ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రి



ANDHRA PATRIKA
LUSTRATED WEEKLY


4 అణాల
23-1-57

'అనాసిన్'

నాలుగు మందులు గలది వైద్యుని ఔషధయోగమువంటిది

1. క్వినైన్ సల్ఫేట్ 2. ఫినాసిటిన
3. కఫేన 4. అసిటిల్ సాలిసిలిక్ ఏసిడ్

'అనాసిన్'—గొప్ప బాధానివారిణి—వైజ్ఞానికంగా కూర్చబడిన నాలుగుమందులను గలిగియున్నది, అవి పరముముఖ్యస్థానము అందు సంయుక్త చర్యను జరిపి, తలనొప్పులు, జలుబులు, జ్వరము, దంతబాధ, కండ నొప్పులనుండి త్వరితగా, సురక్షితమైన శ్రమవిముక్తిని గలిగించును. బాధానివారణకు 'అనాసిన్' కంటె అతివేగముగా పనిచేయునట్టిది మరేది లేదు. సేవించుటకు 'అనాసిన్' కంటె అతిసురక్షితమైనట్టిది మరేదీ లేదు. జ్ఞాపకముంచు కొనుడు! 'అనాసిన్' వైద్యుని ఔషధయోగము వంటిది. అది గుండెకు హానిగాని కడుపు ఉద్రేకముగాని కలిగించదు. 'అనాసిన్' లక్షలాది జనులకు బాధానివారిణి ఎందుకనగా ప్రతివారున్ను 'అనాసిన్' ను కొనగలరు.
ఒక ప్యాకెట్ ధర 2 అణాలు మాత్రమే.



నాలుగు మందుల సూత్రమైన 'అనాసిన్' వాడుడు



జలకాలాట

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక 4 అ.

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 21
23-1-57


దుర్ముఖ పుష్య శుద్ధ అష్టమి బుధవారం

విషయానుక్రమణిక

★

ముఖచిత్రం : హిందీనటి శ్యామ.

బుడుగు చిచ్చుల పిడుగు—	6
న్యూఢిల్లీ లేఖ—"శ్రీకృష్ణ"	8
పంజరంలో చిలక—జి. రామకృష్ణారావు	11
స్వయంవరం—పవని నిర్మల ప్రభావతి	13
"శ్రీమతిచేసిన చిన్న తమాషా" — పి. వి. యల్. నరసింహారావు	16
రాజ్యాభిషేకం—పి. గణపతిశాస్త్రి	17
ఆ గజదొంగ ఎవరు? — చిల్లరిగె స్వరాజ్యలక్ష్మి	20
ఓడిపోయిన పాప—నిష్ఠల బ్రహ్మాజీ	24
కడలేని కడలి—సి. నారాయణరెడ్డి	26
మాంత్రికుడు మాండ్రేక్—	28
మంత్రాలు : నమ్మకాలు—	30
బుజ్జి—రాయచోటి శ్రీనివాసరావు	33
వనితాలోకం—ఎ. ఛాయాదేవి	35
నరానరిన మనగుణాలు—	36
రత్నావళిముగ్గు—కార్యంపూడి లక్ష్మీకాంతం	38
'నై' తత్పురుష—సి. వి. విజయలక్ష్మి	39
"సిగ్గెందుకు"!—	40
"కలికాలపు చోద్యాలేమీ కావు" టి. సీతారామాదేవి	41
చనువుచూపినా అలుసివ్వరాదు—'జయప్రద'	42
బాల సాహితి—అలవర్తి వెంకట సుబ్బారావు	44
మారుపేర్ల మహిమ—ఆర్. దొరస్వామి	45
థీసియస్—సదానందం	48
సినిమా—	50



సమితి ధర్మకర్తృత్వ సంఘ సమావేశం—ఎడమనుంచి నాలుగోవారు భారత ప్రతినిధి శ్రీ కొత్త రఘురామయ్య.

సహజీవనమా, సర్వనాశనమా?

> ప్రస్తుత ప్రపంచ పరిస్థితిపై ప్రఖ్యాత బ్రిటిష్ చరిత్రకారుడు టాయిన్‌బీ అభిప్రాయాలు.

అనంతమైన మానవజాతి చరిత్ర ఎంత త్రవ్వినా తరగని గనివంటిది. ఎంత చదివినా, ఎంత పరిశోధించినా రక్తికట్టించి, ఆసక్తి రెట్టించేది. ఏదో ఉజ్జ్వలమూ, సుందరమూఅయిన భవిష్యత్తును, నవజగత్తును చేరుకోడానికి ఎడతెగని ప్రయాణంచేస్తున్న మానవుని మహాప్రస్థానపథాన్ని వెలిగించే ఆరని దివ్వెలాంటిది చరిత్ర. గతించిన నాగరికతలనుంచి, జీర్ణించిన సంఘవ్యవస్థలనుంచి గుణపాఠాలు నేర్పి వర్తమానాన్ని సరిదిద్దే శక్తిగల గొప్పసాధనం చరిత్ర.

ఈదృష్టితో చూస్తే చరిత్రఅంటే తారీఖులూ, నిస్సారమైన సంఘటనల వర్ణనలూ మాత్రమేకాదు. మనిషికి సమగ్రమైన ప్రపంచ దృక్పథాన్ని, జీవిత వేదాంతాన్ని అలవరించేది మాత్రమే చరిత్ర అవుతుంది.

ప్రముఖ బ్రిటిష్ చరిత్రకారుడు ప్రొఫెసర్ ఆర్నాల్డ్ జె. టాయిన్‌బీ ఇటీవల అన్నామలైనగర్, మద్రాసులలో కొన్ని చారిత్రక ఉపన్యాసాలిచ్చారు. 'చరిత్రనుంచి మనం నేర్చుకునేందుకు వీలుందా?' 'ప్రపంచ సమస్యలపై చరిత్రకారుని దృక్పథం ఏమిటి?' అనే విషయాలపై ఆయన ప్రసంగించారు.

చరిత్రనుంచి కొన్ని పాఠాలు నేర్చుకోవడానికి వీలుందని ప్రొ॥ టాయిన్‌బీ అభిప్రాయపడ్డారు. గతచరిత్రను తెలుసుకోవడంవల్ల భవిష్యత్తులో ఏంజరుగుతుందో జోస్యం చెప్పడానికి వీలులేకపోయినా, గతంలో జరిగిన అనేక సంఘటనలు, వాటి ఫలితాలు తరవాత తరాల స్మృతిపథంలో నిలిచిపోయి, వర్తమాన సమస్యలను పరిష్కరించటంలో మనకు తెలిసో తెలియకో సహాయపడుతూంటాయని ఆయన చెప్పారు. దీనికి బ్రిటిష్ చరిత్రనుంచి, మరికొన్ని దేశాల చరిత్రలనుంచి ఆయన చక్కని నిదర్శనాలిచ్చారు. ఉదాహరణకి ఈరోజున బ్రిటిష్ రాజరికానికి ప్రజలకీ మధ్య పొరపొచ్చాలు ఏవీలేవు. ఈ సంప్రదాయం మూడువందల ఏళ్లుగా వస్తోంది. కాని ఇది స్థిరపడడానికిముందు, బ్రిటన్‌లో పెద్దఎత్తున అంతర్యుద్ధం, రక్తపాతం జరిగాయి. నిరంకుశ రాజరికాన్ని బ్రిటిషు ప్రజలు ప్రతిఘటించి, మొదటి చార్లెసును శిరచ్ఛేదం చేశారు. ఈ హింసాచర్య మూలంగా విప్లవకారు లాశించని దుష్ఫలితాలు ఏర్పడ్డాయి. సైనికప్రభుత్వం, రాజరికం కంటె నిరంకుశమైన పరిపాలనం ఏర్పడ్డాయి. అందుచేత తిరిగి రాజరికాన్ని నెలకొల్పవలసి వచ్చింది. అప్పటినుంచీ హింసాత్మక విప్లవాలవలనకలిగే అనర్థాలను ప్రజలు, నిరంకుశత్వం వలన కలిగే ఫలితాలను రాజులు గ్రహించి ఒకవిధమైన స్నేహ సంప్రదాయాన్ని నెలకొల్పుకున్నారు. ఆ సంప్రదాయం ఇప్పటికీ చెడలేదు.

వలస విధానం

అలాగే అమెరికా ఒకప్పుడు బ్రిటిషువలస దేశంగా ఉండేది. అమెరికనులకు స్వాతంత్ర్యాన్ని నిరాకరించినదాని ఫలితంగా బ్రిటను అమెరికాలకు యుద్ధం జరిగింది. అమెరికాకు బ్రిటన్ స్వాతంత్ర్యం ఇవ్వవలసి రావటమే కాక, రాజకీయంగా అమెరికాతో పూర్తి తెగతెంపులు చేసుకోవలసి వచ్చింది. ఈ సంఘటనవలని గుణపాఠం తరవాత కాలంలో కెనడా, ఆస్ట్రేలియా మొదలైన వలస దేశాలకు, ఇటీవలి కాలంలో భారతదేశంలాంటి ఆసియా దేశాలకు స్వాతంత్ర్యం ఇచ్చివేసి వాటి స్నేహాన్ని నిలుపుకోనేలాగ బ్రిటనుకు సహాయంచేసింది.

బానిస విధానం

ఒకప్పుడు కొన్నికొన్ని దేశాలలో బానిస విధానం అమల్లోఉండేది. క్రీస్తు పూర్వం రోమన్ సామ్రాజ్యంలోను, 15 వ, 16 వ శతాబ్దాలలో ఆటోమన్ తురుష్క సామ్రాజ్యంలోను, ఇంకా ఇటీవలి కాలంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలలోనూ బానిస విధానం ప్రబలంగా ఉండేది. కాని ఈ విధానమే ఆయా దేశాలలో గొప్ప సంక్షోభాలకు, రక్తపాతానికి కారణమైంది. వాటి ఫలితంగా మనిషిని మనిషి బానిసగాచేసే విధానం తప్పని ప్రజలు గ్రహించారు. ఈనాడా విధానం రూపుమాసిపోయింది.

ఈ ఉదాహరణలవల్ల చరిత్రనుంచి నేర్చుకోదగిన మంచి అంశాలున్నాయని వ్యక్తమౌతోంది.

యుద్ధమా, శాంతీ

అయితే, ఈనాడు ప్రపంచ ప్రజలందర్నీ కలవరపరుస్తున్న యుద్ధసమస్య ఉంది. మానవ చరిత్ర ఆరంభమైనప్పటినుంచీ ఏదో విధంగా, ఏదో స్థాయిలో యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్ని పెద్దయుద్ధాలు, కొన్ని చిన్నయుద్ధాలు, కొన్ని మహాదారుణమైనవి, కొన్ని అంతదారుణం కానివి సంభవించాయి. ఈ శతాబ్దంలోనే రెండు ప్రపంచయుద్ధాలు జరిగాయి. 1914–1918 సం॥లలో జరిగిన యుద్ధం అప్పటికి జరిగిన యుద్ధాలన్నిటికంటే ప్రచండంగా జరిగింది. అంతకంటె ప్రచండమైన యుద్ధం 1939–1945 సం॥లలో జరిగింది. ఇకముందు మరొక యుద్ధమే సంభవించేటట్లయితే, బహుశా అదే ఆఖరు యుద్ధం కావచ్చును. ఎందుకంటే ఆ తరవాత యుద్ధాలు సాగించేందుకు జనమే మిగలనంత దారుణంగా విధ్వంసం జరుగుతుంది గనక. మరొక ప్రపంచయుద్ధం వస్తే, ప్రపంచమూ, యుద్ధమూ రెండూ అంతరిస్తాయి. అందుచేత యుద్ధాన్ని వారించి ప్రపంచాన్ని రక్షించడమో, రక్షించకపోవడమో తేల్చుకోవలసిన సమయం ఇది.

అది తేల్చుకోవడానికి చరిత్ర ఏవిధంగా సహాయపడుతుంది? అని టాయిన్‌బీ ప్రశ్న వేశారు.

మొదటి ప్రపంచయుద్ధం ముందు ఎనిమిది అగ్రరాజ్యాలుండేవి. రెండో ప్రపంచ యుద్ధం తరవాత రెండే అగ్రరాజ్యాలు మిగిలాయి. ఒకటి అమెరికా, మరొకటి రష్యా. ఈ రెండూ సంఘర్షిస్తేనే ప్రపంచ యుద్ధం సంభవిస్తుంది. అటువంటి యుద్ధం నివార్యమా, అనివార్యమా?

ఈ రోజున అమెరికా ప్రాతినిధ్యం వహించే పెట్టుబడిదారీ విధానానికీ, రష్యా ప్రాతినిధ్యం వహించే కమ్యూనిస్టు విధానానికీ తీవ్రమైన వైరుధ్యాలున్నాయి. ఇవి సమన్వయం చేయడానికి వీలులేని విధానాలు. మరివాటిని సంఘర్షించకుండాచేయడమెలా?

సమన్వయం, సహజీవనం

దీనికి టాయిన్‌బీ చరిత్రనుంచి కొన్ని ఉదాహరణ లిచ్చారు. ఒకప్పుడు కాథలిక్కులకు, ప్రొటెస్టెంటులకూ మధ్య తీవ్ర

([illegible]-వ పేజీ తరువాయి)

బ్రతుకు భయం

ఎంతో దూరం నడిచి, ఎన్నో మజిలీలు గడిచి, భుజాన కావడిమోస్తూ, అనేక వింతలుచూస్తూ, గోపాలుడు సిద్ధుడితో కలసి కాశీ చేరుకున్నాడు—

కాశీనగరంలో అడుగు పెట్టగానే, సిద్ధుడు దారిలో, పడినబాధలు, గురిఅయిన ప్రమాదాలు, భరించిన కష్టాలు అన్నీ మర్చిపోయి,

'వందే శంభు ముమాపతిం సురగురుం
వందే జగత్కారణం.'

అని మహేశ్వరుణ్ణి స్తుతించి, అన్నపూర్ణ సత్రంలో బొంతా గంతా వదిలి, అన్ని పాపాలు కడిగివేసే గంగానదిలో స్నానం చేయడానికి గోపాలుడితో బయలుదేరాడు.

మణికర్ణికలో మునిగి, బిందు మాధవస్వామిని దర్శించి, దశాశ్వమేధములో స్నానం చేసి, శ్రీ విశ్వేశ్వరుణ్ణి సేవించి, కేదారఘాటులో స్నానం చేసికొని, కేదారేశ్వరుడికి భక్తితో ప్రణామం చేసి మణిసిద్ధుడు గోపాలుడితో "గోపా! చూసేవా కాశీ మహాత్మ్యం. ఇక్కడికి రాగానే ఎంత హాయిగా ఉందో" అన్నాడు.

"ఏం హాయి గురూ, మీతో ఇన్నిచోట్ల గంగలో మునిగి మునిగీ నా ముక్కుకు శైత్యం పట్టుకొంది. ఇంక మీతో రాలేను. నన్ను మా యింటికి పంపించి వేయండి."

"అదేమిరా గోపా! ఇంతదూరం వచ్చి ఇప్పుడిలా అంటున్నావు? ఇంకా కాశీలో వింతలే చూడలేదే. ఇక్కడి చిత్రాలేవీ చూడకుండానే ఇంటికి తిరిగిపోతావా?"

"ఏమి వింతలు గురూ—గంగ ఒడ్డున, సిగ్గులేకుండా స్నానంచేసే దిగంబర సన్యాసులూ, కాళ్లుజారి మణికులు చెక్కుకు పోయే రాతి మెట్లూ, మురికివాసన వేసే ఇరుకు సందులలో నడుస్తూఉంటే రంకెలు వేస్తూ మీదకువచ్చే ఆంబోతులూ—ఇవన్నీ చూస్తూంటే నాకు భయం వేస్తోంది గురూ— ఏ ఆంబోతైనా మనల్ని కుమ్మేసిందా— ఇల్లు వదలి ఇంతదూరం వచ్చి ఇక్కడ ప్రాణాలు వదలవలసి వస్తుంది."

"గోపా, అయితే నీకు చావంటే భయమూ?"

"చాలా భయం గురూ."

"భయం అంటే నాకొక కథ జ్ఞాపకం వచ్చిందిరా."

"ఎప్పుడూ కథలేనా గురూ—అలిసిపోయేం—ఆకలవుతోంది."

"చాలా మంచికథ గోపా. ఇక్కడే అరుగుమీద కూర్చున్నావంటే చెప్తాను."

"వద్దుగురూ—ముందు సత్రానికి పదండి. వంటచేసికొని కడుపునిండా తినకపోతే... చల్లారేక మీరు కథ చెప్పుదురుగాని—"

"సరే పద—"

* * *

అంత మణిసిద్ధుడు గోపాలున కిట్లని చెప్పదొడంగా:—

కొడవంటి నరసింహం

గోపా! చాలాకాలం క్రిందట, అనగా నిన్ను కలుసుకొని, కాశీ ప్రయాణం ప్రారంభించడానికి ముందు నేను దండకారణ్యంలో తపస్సు చేసుకొనే వాడిని. నా చుట్టూ గడ్డి పెరుగుతోంది. ఇంకా పుట్టలు పెరగలేదు. ఒకరోజు నాకు సమాధి కుదరక కళ్లు తెరిచి, ఎదురుగా మైదానంలోకి చూస్తూ కూర్చున్నాను. అలా ఎంత సేపు కూర్చున్నానో తెలియదు. ఇంతలో కీచు కీచుమంటూ, తోక పైకెత్తుకొని ఒక ఎలుక పరుగెత్తుకొని నా ముందునుండి పోతోంది. ఎలుకా, ఎక్కడికంత భయంతో పరుగెత్తుతున్నావ్" అని అడిగేను. "స్వామీ, నన్ను ఆపకండి, నా ప్రాణాలు మింగడానికి నా వెనకనే పామొకటి పరుగెత్తుకు వస్తున్నది" అని ఎలుక అనగా "నీకేం భయంలేదు అక్కడ నిల్చో." అని నేను అభయం ఇచ్చేసరికి ఆ ఎలుక నాకు ఎదురుగా చతికిలబడింది.

ఇంతలోకే ఒక పాము జరజరా పాకుకొంటూవచ్చింది. దాన్ని నిలవేసి "ఏమిటా తొందర" అని అడిగేను. "స్వామీ నన్ను ఆపకండి. నన్ను కాకికి ముక్కలు చేయడానికి ముంగిస తరుముతోంది," అని పాము జవాబిచ్చింది. "నీకేం భయంలేదు. పోయి ఆ ఎలుక ప్రక్క చుట్టచుట్టుకొని ఉండు" అని చెప్పగానే పాము అలాగే ఎలుక ప్రక్కకు చేరింది.

అంతలోనే నేలమీద వాసన చూస్తూ ముంగిస పరుగెత్తుకొని వచ్చింది. దాన్ని కూడా ఆపి, "ఏం? ముంగిసా! ఎందుకలా పరుగెడ్తావ్? ఏ పాము ప్రాణమైనా తీద్దామనా?" అని అన్నాను. "పాముప్రాణం నేను తీయడం ఏమిటి స్వామీ! నా ప్రాణాలు తీయడానికే ఒక పిల్లి నన్ను తరుముతూ ఉంటే, భయంతో ఇలా పరుగెత్తి వస్తున్నాను," అని ముంగిస చెప్పగానే, "ముంగిసా! నీకు వచ్చిన భయమేమీ లేదు. అలా ఆపాము ప్రక్కకి పోయి కూర్చో" అని చెప్పేను. ముంగిస పాము ప్రక్కకి పోయి కూర్చొని అలసట తీర్చుకోవడం మొదలు పెట్టింది.

ఇంతలోకే 'మ్యావ్, మ్యావ్' మంటూ గండుపిల్లి ఒకటి మూతి మీసాలు నిక్కపొడుచుకొంటూ పరుగెత్తి వచ్చింది. ఆ పిల్లిని కూడా నేను ఆపివేశాను. "స్వామీ నన్ను ఆపకండి. నా ప్రాణం తీయడానికో కుక్క నన్ను తరుముతోంది. ఆ భయంచేతే పారిపోతున్నాను." అని పిల్లి అన్నది. "నీకేం భయం, నేనుండగా—వెళ్ళి ఆ ముంగిస ప్రక్క కూర్చొని ఆయాసం తీర్చుకో" అన్నాను.

ఆ పిల్లి అలా ముంగిస ప్రక్క కూర్చొనే లోపలే ఒక నల్లకుక్క తోక ముడిచి పరుగెత్తుతూ వచ్చింది. దానిని కూడా ఆపబోయే సరికి "స్వామీ నన్ను ఆపకండి. నేను నిలుచుండి పోయేనా, నా వెనుకవచ్చే దున్నపోతు నన్ను కొమ్ములతో పొడిచి కాళ్లతో మట్టి చంపేస్తుంది," అని కుక్క పలికింది. దానికి కూడా అభయం ఇచ్చి, పిల్లి చెంత కూర్చుండపెట్టేను.

అంతలోకే దున్నపోతు కూడా రొజుకుంటూ వచ్చింది. బడితెపట్టుకొని ఒక మనుష్యుడు తరుముతో ఉంటే భయంచేత పరుగెత్తుకొని వస్తుందిట. ఆ దున్నపోతుమీద కూడా జాలి కలిగి దానిని కూడా కుక్క ప్రక్కని నిలుచుండమని అభయం ఇచ్చేను.

అంతలోనే బడిత పట్టుకొన్న మనుష్యుడు కూడా వగర్చుకొంటూ పరుగెత్తి వచ్చేడు. వాడిని ఆపేసరికి "స్వామీ, నన్ను ఆపకండి, నా భార్య చీపురు పట్టుకొని నన్ను తరుముకొని వస్తోంది. చేతికి దొరి



"పశువుల మేత"

ఫోటో : బి. వి. సత్యమూర్తి.

కేనా, వీపు పెట్లుతుంది. నన్ను వొదిలేయండి," అని ప్రాధేయపడ్డాడు. అతడి అవస్థ చూచి జాలిపడి అతడిని కూడా నా ఎదుట దున్నపోతు ప్రక్క కూర్చొని క్రమతీర్చుకొమ్మని చెప్పేసరికి చీపురుకట్ట పట్టుకొని ఆదిశక్తిలా ఒక ఆడమనిషి పరుగెత్తి వచ్చింది. ఆవిడని చూసేసరికి నాకే భయం వేసింది. అయినా ధైర్యం తెచ్చుకొని "అమ్మా ఎందుకలా చీపురుకట్ట పట్టుకొని పరుగెత్తుతున్నావు" అని అడిగేను.

"స్వామీ ఏం చెప్పను. ఎలుకంటే నాకు తగనిభయం. వంట ఇంటిలో ఈ వేళ ఒక ఎలుకను చూసేను. ఏమయినా సరే దానిపని పడదామని ఈ చీపురుకట్ట పుచ్చుకొని బయలుదేరాను," అని ఆమె జవాబు చెప్పింది.

అమాట అందుకొని బడితపట్టుకొన్న మనుష్యుడు ముందుకువచ్చి "స్వామీ మా ప్రక్క ఇంటివారి కోడలు అందమైనది. వారి యింటికి నేను తరుచు వెడుతూ ఉంటాను. అందుచేత నన్ను అనవసరంగా అనుమానించి నా భార్య చీపురుతో కొట్టడానికి వస్తోందని అనుకొని, ఏమయినా దానికి బుద్ధి చెప్పాలని బడిత పుచ్చుకొని నిలుచున్నాను. కాని ఆమెదగ్గరకు రాగానే భయం వేసి పరుగెత్తేను" అన్నాడు.

అంతలోకే దున్నపోతు ముందుకువచ్చి, "స్వామీ! ఈ మనుష్యుడి చేనులో పడి ఇవేళ మేత మేస్తున్నాను. బడిత పుచ్చుకొని ఇతడు పరుగెత్తి వస్తూంటే నన్ను కొడదానికే వొస్తున్నాడని భయంతో పరుగెత్తివచ్చాను" అని పలికింది. వెంటనే కుక్క కూడా ముందుకువచ్చి "స్వామీ ఇవేళ ఎక్కడా తిండిదొరక్క డొక్కఎండి, కదల్లేక ఒకచోట పడుకొంటే ఈ దున్నపోతు యముడి వాహనంలా పరుగెత్తుకొంటూవచ్చి నామీద పడ్డది. అది ఎక్కడ చంపేస్తుందో అన్న భయంతో పరుగెత్తి వచ్చేను" అంది.

ఆతరువాత పిల్లికూడా ముందుకు వచ్చి "స్వామీ ఈరోజున నాదురదృష్టం ఏమని చెప్పను. ఒకళ్ల ఇంట్లో పాలు పెరుగు త్రాగడానికి దూరితే వాళ్లు తరిమేశారు. వీధిలోకి వచ్చేసరికి ఈ కుక్క మీద పడ్డది. దానిబాధ తప్పించుకొందుకే భయంతో ఇలా పరుగెట్టుకు వచ్చేను" అంది.

ముంగిసకూడా ముందుకువచ్చి "స్వామీ, ఎన్నాళ్లనుంచో పాములు దొరకలేదు ఈ వేళ ఈపాము పరుగెడుతూ కనిపిస్తే దానిని వెంబడిద్దామనుకొన్నాను అంతలోకే నా పాలిటి మృత్యుదేవతలాగ పిల్లి నన్ను తరుమడం మొదలుపెట్టింది. మీ దయవల్ల యిప్పటికి నిర్భయంగా ఉన్నాను" అంది. అప్పుడు పాము ముందుకువచ్చి, "స్వామీ! ముంగిస చెప్పినట్లు ఇవాళ నాకర్మకాత్తు దాని కంటబడ్డాను. ఏదో ఇప్పటికి గండం గడిచింది," అని చెప్పింది.

అప్పుడు ఎలుకకూడా ముందుకువచ్చి, ఏదో చెప్పబోతూ ఉంటగా, ఎలుకను ఆడమనిషి చూసి భయంతో కెవ్వుమని కేక వేసి వచ్చినదారినే పరుగెత్తడం మొదలుపెట్టింది! ఆమె వెనుకే బడితపుచ్చుకొన్న మనుష్యుడు వెంబడించాడు. అతడివెనుకే దున్నపోతూ - తరువాత-కుక్క-పిల్లి-ముంగిసా-పామూ-ఎలుకా అన్నీ వచ్చినదారినే పోయాయి. అని కథ ముగించి, మునిసిద్ధుడు. "చూశావా, గోపా! ప్రపంచంతా ఇలాభయంతో నిండి ఉంటుంది. ఒకళ్లంటే మరొకళ్లకి భయం. ఎందుకో ఆ భయం తెలియదు. అలా తెలుసుకోకుండానే భయపడుతూ ఒకళ్లనుండి ఒకరు దూరంగా పారిపోవాలని ప్రయత్నిస్తారు. తెలిసిందా ?" అని అన్నాడు.

"తెలిసింది గురూ - కాని ఒక చిన్న సందేహం ?"

"ఏమిటి గోపా ?"

"మీ కథలో ఎలుకా, పామూ, ముంగిసా, 'పిల్లి, కుక్కా, అంబోతూ, మనుష్యులూ అని చెప్పేరు కాని, ఏనుగూ, పులీ, సింహం.........."

"గోపా! ఆ జంతువుల పేర్లెత్తకు. నాకు భయం వేస్తోంది." ★

అవగనగా ఒక గుర్రానికి అంద వికారమైన పిల్ల పుట్టింది. దాన్ని చూస్తేనే తల్లికి అసహ్యంవేసేది. దగ్గిరికి చేరనిచ్చేది కాదు; పాలిచ్చేది కాదు. పావం పసిగుర్రం చాలా అవస్థపడేది తల్లితో.


ఆ గుర్రం ఉంటున్న శాలలోనే మరో గుడ్డిగుర్రానికి అందమైన పిల్ల పుట్టింది. కాని తల్లికి కళ్ళులేవు గనుక పిల్లదాని అందం చూసి సంతోషించే అదృష్టం లేకపోయింది. పిల్ల గుర్రం తనేగదా మహా అందమైనదాన్నని తల్లి అని కూడా ఆలోచించకుండా గుడ్డి గుర్రాన్ని ఏడిపించేది. చచ్చేట్లు డొక్కలో తన్నేది. కళ్లు కనబడవు గనుక తల్లి ఏడుస్తూ అన్నీ సహించేది.

ఈ సమస్యనెలా పరిష్కరించడమా అని ఆ గుర్రాల యజమాని ఆలోచించాడు. చివరికొక ఉపాయం తట్టింది. ఏమిటా ఉపాయం?

....

అందమైన గుర్రపుపిల్లను తీసుకెళ్లి మొదటి గుర్రం దగ్గిర, అందవికారమైన గుర్రపుపిల్లను గుడ్డిగుర్రందగ్గిర వదిలి పెట్టారు.

అందమైన పిల్లకోసం తపించిపోతున్న మొదటిగుర్రానికి సంతృప్తి కలిగింది. తల్లిప్రేమకోసం తపిస్తున్న అందవికారమైన గుర్రంపిల్లకూ సంతృప్తి కలిగింది. మొత్తంమీద అన్నిటికీ సమస్య పరిష్కారమైపోయింది.



నాకు భోఘిపండగ, బాబాయికి సంకురాంతిరి పండగా బాఘా జరిగాయి.

కాని నన్ను అప్పరాబానం చేసేసి కొన్నాళ్ళు బళ్లో పెట్టేశారు రోజూనూ.




బాబాయిని రైల్లో పెట్టేసి మెడ్రాసు పంపించేశారు. ఎందుకంటే, బాబాయి సుబ్బలష్మి ముక్కు బావుంది అన్నాడుట. అందుకని.


మనం ఎప్పుడూ సుబ్బలష్మి ముక్కు బావుంది అనకూడదు. బావులేదు అని కూడా అనకూడదులే. ఎందుకంటే సుబ్బలష్మి మన యింట్లో లేదుగా అందుకు.

మనింట్లో వుంటే, మా నాన్న అనచ్చును. మా యింటో మా అమ్మ వుందిగదా. అమ్మ ముక్కు ఇలా ఎత్తుగా, నాలాగ వుంటుంది గదా.

కేం? మరి నాన్న "ఏయ్ రాధా నీ ముక్కు బావుంది" అంటాడు గదా. నాన్న అలా అన్నా సరే అమ్మ ఒక్కోసారి "పూ పోదూ







గోపాళం" అని ఇలా కోప్పడేస్తుంది. గోపాళం అనదులే. ఫాండీ, అంటుంది అనుకో. అలా కోప్పడ్డా కొంచెం నవ్వుతుందిలే.

యేం. అందుకని, బాబాయి యేమో సుబ్బులు ముక్కు బావుంది అంటే సుబ్బులికి కోపం వచ్చినా కొంచెం నవ్విందిగదా. అయినా వాళ్ళ తాత విన్నాడుమరి.

అప్పుడు వాడు హాంయ్ అని ఖోప్పడ్డాడుగదా. అప్పుడు బాబాయి అభద్దం చెప్పేశాడు.

ఇక్కడ వేసిన రదం ముగ్గు బావుంది అన్నానుగాని ముక్కు కాదండీ అన్నాడు బాబాయి. అప్పుడు సుబ్బులు వాళ్ళ గుమ్మంలో ముగ్గేస్తోందిగా. అందుకు.

అయినా వాళ్ళ తాతయ్య కోపంగానే వున్నాడు.

నువ్వు ముఖు అన్నావు అన్నాడు ఆ తాతయ్య.

కాదు ముగ్గు అన్నాను అన్నాడు బాబాయి.

అప్పుడు సుబ్బులు ఇదిగో ఈ ముగ్గే బావుందన్నాడు అని చెప్పేసి ఇంటోకి వెళ్ళిపోయింది.

అప్పుడు నాన్న వచ్చి బాబాయిని పిల్చాడు. అప్పుడు బామ్మ బాబాయికి ప్రైవేటు చెప్పేసింది. బాబాయి మెడ్రాసెళ్ళిపోతానన్నాడు.

చివరకి వీడే కారణం బోడివెధవ అని బాబాయి నన్ను తిట్టుతూ నెత్తిమీద టెంకిజెల్ల పుచ్చుకున్నాడు.

నేనేం చేశాను!

సుబ్బలక్ష్మి కూడా ముక్కు కాదు ముగ్గు అని అబద్ధం చెప్పిందిగదా అని, నేను వెళ్ళి ముగ్గు కాదూ మరేమో మా బాబాయి ముక్కు అన్నాడు-అన్నాను నిజం చెప్పాలిగా మనం.

అప్పుడు అమ్మ నాన్నా, మంచిపని చేశావులే అన్నారు గాని,

నాకు గబుకున అక్షరాభ్యాసం చేయించేశారు.

ఈ వెధవాయిని బళ్ళో పడేస్తే కాని లాభంలేదు అనేశారు.

నేను అల్లరి చెయ్యడమందుకు ఇదీ శిక్ష.

శిక్ష అంటే చిన్న పిల్లల్ని బళ్ళో పెట్టెయ్యడం అన్నమాట.

శిక్ష అంటే బాబాయిని మెద్రాసు పంపించెయ్యడం అని కూడా అర్థంట. ఇలా అని బాబాయి చెప్పాడులే. కాని ఇదితప్పు.


అక్షరాబాసం ఏం కషం కాదులే. అన్నీ మనకి వచ్చినవే మళ్ళీ అనమంటారు. ఓనామహా సివాయెహా సిధంనామహా ఇలాటివి. అదంతా బావుంటుందిలే.


ఆవేళ నాన్నా నేనూ విసినాధం కొట్టు మీద కెళ్ళాం. విసినాధం కొట్టులో పలకలూ, పిప్పరబంటు బిళ్ళలూ, గోలీకాయలూ, గాలిపగడలూ ఉంటాయి. మనం ఏం కావాలన్నా సరే ఫ్ఫదణాలు పట్రా అంటాడు.

నాదగ్గిర ఫదణాలు లేవు. మరి చిన్న పిల్లాడినిగదా ఎలా ఉంటాయి. ఇపుడున్నాయిలే. బోఘిపండగకి సంపాదించాను.

సంపాదించడం అంటే, చిట్టిగాడులాటి చిన్నపిల్లలికి రేగిపళ్ళు ఇచ్చేసి వాళ్ళదగ్గిర ఫ్ఫదణాలు లాక్కు పారిపోడం.

(56-వ పేజీ చూడండి)





హిరాకుడ్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం

ప్రధాని నెహ్రూ ఈ 18 వ తేదీన హిరాకుడ్ ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం జరిపారు. భారతదేశంలోకల్లా బాగా వెనుకబడిన ఒరిస్సా రాష్ట్రాభివృద్ధికి ఇది ప్రారంభోత్సవ మనవచ్చును. హిరాకుడ్ ప్రాజెక్టు బహుకాలంగా వివాదగ్రస్తమైనది. దానికి మూడుసార్లు శంకుస్థాపన జరిగింది. చివరికి దాన్ని రక్షించిన గౌరవం శ్రీ బి. దాస్, టి. ఎన్. సింగ్, (పార్లమెంటు సభ్యుడు), టి. ఎన్. సింగ్ (నీటిపారుదల శాఖకు ఆర్థిక సలహాదారు) గార్లదే. శ్రీ బి. దాస్ ముప్పదిఏళ్లుగా కేంద్ర శాసనసభలో ఒరిస్సా ప్రతినిధిగా పనిచేశారు. ఒరిస్సా రాష్ట్రం ఏర్పడటానికి కారకులైనవారిలో ఆయనొకడు. పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీకి ఆయన లోగడ అధ్యక్షుడుగా ఉండేవారు. హిరాకుడ్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలన్నీ ఆయనకు కరతలామలకం. అక్కడ పనిచేసే మనుషుల స్వభావాలుకూడా ఆయనకు బాగా తెలుసు. చివరకు, ఆ ప్రాజెక్టు తాలూకు పరిపాలనా వ్యవహారాలన్నీ సంస్కరించబడేట్లు ఆయన ఒత్తిడి తీసుకువచ్చారు.

శ్రీ కృష్ణ

[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

ఈ సమయంలో మరొక వ్యక్తిని కూడా మనం సంస్మరించాలి. ఆయన క్రీ॥ శే॥ బి. ఆర్. అంబేద్కర్. బహుళ ప్రయోజనాత్మకమైన దామోదర్ లోయ ప్రాజెక్టు, హిరాకుడ్ ప్రాజెక్టు ప్రారంభం కావడానికి ఆయన చాలా కృషి చేశారు. అసలు దామోదర్ ప్రాజెక్టు ఆలోచన ఎలా వచ్చిందో చూస్తే చిత్రంగా కనిపిస్తుంది. దామోదర్ నదివరదలవలన పడిపోయిన ఒక రైల్వే వంతెనను తిరిగి కట్టడానికి ఎంతవుతుందో నిర్ణయించేందుకు ఒక సమావేశం జరగ్గా, ఆ సందర్భంలో ప్రాజెక్టు ప్రసక్తి వచ్చింది. అప్పట్లో నీటిపారుదలశాఖ డా॥ అంబేద్కర్ అధ్వర్యంలో ఉండేది కనుక ఆయన ఆసమావేశానికి అధ్యక్షత వహించారు. దామోదర్ వరదలు ఏటేటా వచ్చేవి గనుక వాటిని అరికట్టడానికి ఏం చెయ్యాలీ అని అంబేద్కర్ ప్రశ్నించారు. తత్ఫలితంగా దామోదర్ లోయ కార్పొరేషన్ ఏర్పడింది.

ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవం చూసే అదృష్టానికి డా॥ అంబేద్కర్ నోచుకోకపోవడం విచారకరం.

* * *

ఫైనాన్స్ కమీషన్ అధ్యక్షుడు శ్రీ కే. సంతానం నిర్భయంగా మాట్లాడగలరు. కుండ బద్దలు గొట్టినట్లు ఉన్నదున్నట్లు చెప్పేస్తారు. "ఎకనామిక్ టైమ్స్" ప[illegible] [illegible] ప్రత్యేక [illegible] ఒక వ్యాసం వ్రాస్తూ భారతదేశపు అభివృద్ధిని శ్రీ సంతానం ఈ విధంగా అంచనాకట్టారు.

"సామాన్యప్రజల కూడూ-గూడూ గుడ్డా, సమస్య తీసుకుంటే మార్పేమీ కనిపించడం లేదనే చెప్పాలి. ఆహారం చవకగా దొరికితే, గుడ్డకరువు రావటం, ఆహారధరలు పెరిగితే అనేకులు ఆకలికి బలికావటం కనిపిస్తోంది.

న్యూఢిల్లీలో గృహనిర్మాణం అద్భుతంగా జరుగుతోంది. కలకత్తా, బొంబాయి, మద్రాసుల్లోకూడా ఈనిర్మాణం బాగా కనిపిస్తుంది. కాని తాలూకా పట్టణాలకు, ఇంకా గ్రామాలస్థాయికి పోయిచూస్తే, కొత్తఇళ్లు చెదురుగా, అరుదుగా మాత్రమే కనిపిస్తాయి. కమ్యూనిటీ ప్రాజెక్టులు, జాతీయ విస్తరణ పథకాలక్రింద నిర్మించే ఆఫీసులు, పాఠశాలలు, వైద్యశాలలు మినహాయిస్తే గ్రామప్రాంతాల్లో గృహనిర్మాణ కార్యక్రమం బొత్తిగాలేదనే చెప్పాలి.

ప్లానింగ్‌కు సంబంధించినంతవరకూ వ్యవసాయోత్పత్తి, సహకారపద్ధతి ప్రధాన విషయాలు. నిజానికి ఈ రెండూ పరస్పరాశ్రితాలు. కాని ఇవి తగినంతగా అభివృద్ధి చెందాయా అని నా అనుమానం. భూమి కమతం అస్థిరంగా ఉండడం వల్ల భూమివిలువ తగ్గడం, వ్యవసాయపు పెట్టుబళ్ళు తగ్గడం జరిగి ఉత్పత్తి సరిగా జరగడంలేదు. సహకారోద్యమం ఈ లోటును భర్తీచేయలేకపోతోంది.

విద్య, వైద్యం, రోడ్లు మొదలైన సంఘసేవా కార్యక్రమాల్లో అభివృద్ధి బాగానే కనిపిస్తోంది. అయితే వీటిలో ధనం వృథా వ్యయం అవుతోందేమోనని నా అనుమానం. [illegible] పాఠశాలలు, [illegible] [illegible] [illegible] లయాల్లో మాతోళ్ళ దిగ్గోర్యను అన్నిటినీ ఒకేసారి విస్తరించి అభివృద్ధి చేయ

డానికి ప్రయత్నించడం అటు అధికారులకు, ఇటు ప్రజలకు దిగ్భ్రాంతి కలిగిస్తోంది.

అలోపతి, ఆయుర్వేదాల విషయం ఇంకా సందిగ్ధపరిస్థితిలోనే ఉంది. ఆయుర్వేద వైద్యశాల ఒకటి ప్రారంభిస్తే, అలోపతి వైద్యశాల కావాలని ప్రజ లాందోళన చేయటం జరుగుతోంది.

స్థానిక స్వపరిపాలన దేశంలో అభివృద్ధికి మరొక కొలబద్ద. దేశమంతటా గ్రామపంచాయతీ లేర్పడ్డాయి. వీటిలో చాలా పంచాయతీలు సమంగా పని చేస్తున్నాయి. కాని మునిసిపాలిటీలు, జిల్లాబోర్డులు సంతృప్తికరముగా పనిచేయడం లేదు. ఆధునిక పద్ధతులలో మురుగు పారుదల కలిగిన పట్టణాలు కూడా చాలా కొద్దిగానే ఉన్నాయి.

ఆర్థికాభివృద్ధి వేగంగా జరగాలంటే ప్రభుత్వము కొన్ని నిర్దిష్ట పద్ధతులలో పని చెయ్యాలని తోస్తోంది. చిత్రకళ, సారస్వతం, సంగీతం, నాట్యం, నాటకం మొదలైన వాటిలోకూడా అభివృద్ధికి ప్రజలు ప్రభుత్వం మీద ఆధారపడడం సమంజసం కాదనుకుంటాను. ప్రభుత్వ ప్రయత్నాలతో సరి సమానంగా ప్రజలు తమంతట తాము ముందుకు వచ్చి సహకరించాలి. ప్రభుత్వం చేసే సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి ఐనంతగా ప్రజలవ్యక్తిగత జీవితాలు అభివృద్ధి అయితేనే ఆర్థికాభివృద్ధి జరిగినట్లు మనం ఎంచాలి."

* * *

"హిందుస్థాన్ టైమ్స్"లో రాజకీయ వ్యాఖ్యాత ఇలా వ్రాశాడు:

"శ్రీ వి. కె. కృష్ణమీనన్‌ను నెగ్గించే నియోజకవర్గమేది మద్రాసు, కేరళ రాష్ట్రాల్లో లేకపోవడం వల్లనే, ఆయనను ద్విసభ్య బొంబాయి నియోజకవర్గం నుంచి గెలిపించడానికి శ్రీ ఎస్. కె. పాటిల్ పూనుకున్నారని తెలుస్తోంది."

ఇందూరు కాంగ్రెసులోకూడా ఇలాంటి విమర్శలే వినవచ్చాయి. కేరళ ప్రముఖులలో కృష్ణమీనన్ ఒకరు. కేరళ ఆయనను న్యాయంగా ఏకగ్రీవంగా ఎన్నుకుని గౌరవించాల్సింది. అంతేగాని ఆయన్ని ఇతర రాష్ట్రాల మీద రుద్దటం బాగా లేదు. ఎన్నికల్లో నెగ్గడం, నెగ్గకపోవటం అలా ఉంచి పోనీ అభ్యర్థిగా నన్నా నిలబెట్టి చూడవచ్చును గదా?

* * *


ఢిల్లీకి లోక్ సభలో ఉన్న అయిదు స్థానాలకూ జరగబోయే ఎన్నికల్లో సహజీవన సిద్ధాంతం బాగా వ్యక్తం కాగలదు. ఢిల్లీ కాంగ్రెసు అభ్యర్థులలో శ్రీమతి సుభద్రా జోషీ, కాంగ్రెసు టిక్కెట్ మీద పంజాబులో పోటీ చేస్తోంది. ఆమె భర్త కమ్యూనిస్టు టికెట్ మీద ఢిల్లీ నుంచి పోటీ చేస్తున్నారు.

లోగడ శ్రీమతి సుచేత కృపలాని సోషలిస్టు టికెట్ మీద న్యూఢిల్లీనుంచి పోటీచేసి కాంగ్రెసు అభ్యర్థిని ఓడించి లోక్ సభ సభ్యురాలైంది. ఇప్పుడు కొత్త ఎన్నికలు రాబోతున్నాయనగా ఆమె కాంగ్రెసులో మళ్ళీ చేరిపోయింది. ఈసారి కాంగ్రెసు ఆమెకు కాంగ్రెసు టికెట్ ఇచ్చి మళ్లీ న్యూఢిల్లీ అభ్యర్థిత్వమే ఇస్తుందని అనుకుంటున్నారు. అలా జరిగితే షెడ్యూల్డు తరగతుల అభ్యర్థితో కలిపి ఇంకా నలుగురు అభ్యర్థులను నిర్ణయించాల్సి ఉంటుంది.

ఇప్పుడు ఢిల్లీ ప్రతినిధులుగా ఉన్నవారు కృష్ణానయ్యర్, రాధారమణ్, నవల్ ప్రభాకర్. వీరిలో ఎవ్వరూ తప్పుకోటానికిష్టపడటంలేదు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మప్రకాష్, డా॥ సుశీలా నయ్యర్ కూడా అభ్యర్థులే. అందుచేత డా॥ సుశీలా నయ్యర్‌కు పంజాబులో ఒక స్థానాన్ని కేటాయించి, ఇప్పటి ముగ్గురు ప్రతినిధులకు, శ్రీ బ్రహ్మప్రకాష్‌కు మిగిలిన నాలుగు స్థానాలూ కేటాయిస్తారని అనుకుంటున్నారు. అయితే, కాందిశీకులు తమకు కూడా ఒక ప్రతినిధి ఉండాలని ఒత్తిడిచేస్తున్నారు. రాజ్యసభలో ఢిల్లీకి వున్న మూడు స్థానాల్లో ఒకటి ఖాళీ అయింది. కాందిశీకుల కోర్కె తీర్చడానికి డా॥ సుశీలా నయ్యర్‌కు ఒక ఢిల్లీ స్థానాన్ని కేటాయించి శ్రీమతి సుచేతా కృపలానీకి మరొక నియోజకవర్గమేదన్నా చూడాలని కొందరు సూచించారు. ఇదే గనక నిజమైతే కాంగ్రెసు ముసుగులో డా॥ సుశీలా నయ్యర్‌కూ శ్రీమతి సుచేతకూ గుద్దులాటజరుగుతుందన్న మాట.

1947 దాకా కేంద్రశాసన సభలో ఢిల్లీకి పురుషులే ప్రతినిధులుగా ఉండేవారు. వీరందరూ ఢిల్లీకి చెందినవారే అయి ఉండేవారు. వారిలో ఆఖరువాడు కీ॥ శే॥ అసఫాలీ, ఢిల్లీకి మొట్టమొదటి ప్రతినిధికూడా ముస్లిమే. ఆయన హాల్యాసోహన్‌వాలా.

కాందిశీకులు తమకు ప్రతినిధి కావాలని అలజడి చేయనూ చేయగలరు. తమ మాట నెగ్గించుకోనూ నెగ్గించుకోగలరు. ఎందుకంటే వారిలో కట్టు ఉంది. తలుచుకుంటే ఎన్నికల ఫలితాలను తలక్రిందులు చేయగలరు. కలిమా ఢిల్లీ ప్రజల్లో ఆ కట్టులేదు. అందుచేత వారికి ప్రతినిధులుగా ఎక్కణ్ణించో వచ్చిన స్వార్థపరులు ఎన్నికలలో నిలబడడం జరుగుతోంది. ★



పాండ్స్ కోల్డ్ క్రీమును
వాడే ఆమెను
అతను
మెచ్చుకొనును!
మీరు ముఖము కడుగుకున్న తరువాత ఎల్లప్పుడూ అద్భుతమైన పాండ్స్ కోల్డ్ క్రీమును వాడండి. ఇది కడుగుకుపోతున్న. చర్మమునకు రక్షణ యిచ్చే నూనెలను తిరిగియిచ్చి మీ చర్మమును లేతగా మరియు నిష్కళంకముగా ఉంచును. పాండ్స్ కోల్డ్ క్రీమ సులభముగా చర్మములోకి చొచ్చుకొనిపోయి మీ ముఖమును శుభ్రముగా ఉంచును!
ఉచిత పుస్తకము
Lovelier with Pond's అనే సౌందర్యమును గురించిన మా యింగ్లీషు పుస్తకము కావాలని యీ ఎడ్రసుకు వ్రాయండి: పి.బి. బాక్సు నెం. 1812 బొంబాయి 1.
POND'S
cold
cream

[illegible]

జి. రామకృష్ణారావు

పూర్వం ఇరాను దేశపు రాజధాని టెహరాను నగరంలో ఒక వ్యాపారి వుండేవాడు. అతని పేరు అబ్దుల్లా. వ్యాపారంలో మంచి చాకచక్యం వున్నవాడు. డబ్బు బాగా గడించాడు. శాంత స్వభావుడు. భూతదయగలవాడు. పక్షులంటే అమిత ప్రేమ. అందులోను చిలకలంటే ప్రాణం.

ముద్దులొలికే ఒక చిలకను పెంచుతున్నాడు. కన్న బిడ్డంటే తల్లి ఎంత శ్రద్ధ వహిస్తుందో అంతకంటె ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నాడు ఆ చిలక విషయంలో. ఇంట్లో నౌకరూ చాకర్లూ వున్నప్పటికి అబ్దుల్లా తానే చిలకకు ఆహారం పెట్టాడు, నీళ్ళు త్రాగిస్తాడు. చిలకకోసం అందమైన పంజరం చేయించాడు. చిలకకు అన్ని సదుపాయలూ ఆ పంజరంలో సమకూర్చాడు.

కొన్ని దినాలు గడిచాయి. మక్కా, మదీనా తీర్థయాత్ర చేయాలని నిర్ణయించుకున్నాడు. ప్రయాణానికి అన్ని హంగులు సిద్ధం చేసుకున్నాడు. అయితే తన చిలక విషయంలో పెద్ద సందిగ్ధావస్థలో పడ్డాడు. అరేబియా దేశంలో వేసవికాలంలో ఎండలు మెండు. ప్రయాణం కూడా అతి కష్టం. ఒంటెలమీద గుర్రాలమీద సాగుతుంది ప్రయాణమంతా. సుకుమారంగా బ్రతికే తన పెంపుడు చిలకను ఆ ఎండల్లో తీసుకుపోవటానికి మనస్కరించలేదు. చివరకు తానొక్కడే వెళ్ళేందుకు నిశ్చయించుకున్నాడు.

బయలుదేరేరోజు వచ్చింది తన ప్రయాణం గురించి చిలకకు చెప్పాలి

'ప్రియమైన చిలకా! ఈ మాటలు చెప్పటానికి నాకు నోరు రావటంలేదు. కాని చెప్పకతప్పదు. నేను ఇవ్వాళ తీర్థయాత్రకు బయలుదేరుతున్నాను. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. అరేబియా దేశంలో కాచే ఎండలు సామాన్యమైన ఎండలు కావు. అతి కోమలమైన శరీరం ఆ వేడిని భరించలేదు. నేను కూడా నిన్ను వదిలి ఎక్కువ రోజులు వుండలేను. పుణ్య క్షేత్రాలు సందర్శించి త్వరలో తిరిగి వస్తాను. నీవు యిక్కడ సుఖంగా వుండేందుకు అన్నీ ఏర్పాట్లు చేశాను' అన్నాడు.

ఈ మాటలువిన్న చిలక తనమీద పిడుగు పడ్డట్టు భావించింది. ఏమీ తోచలేదు. 'స్వామీ! నన్ను మీ వశం చేసుకున్న నాటినుండి ఎంతో వాత్సల్యంతో పోషిస్తున్నారు, కంటికి రెప్పలాదిరి కాపాడుతున్నారు. మీరు లేకుండా, మిమ్మల్ని చూడకుండా యిక్కడ నేను వుండటం కష్టం. మీతోపాటే ఆ పవిత్ర క్షేత్రాలు కళ్ళతో చూస్తా యీ పంజరంలోనుంచే. మీతోపాటేవర్షాతపాలుభరిస్తా,అనుభవిస్తా. పంజరంలో వుండే నాకు గ్రీష్మం, వసంతం, వర్షం యిత్యాది ఋతువుల భేదం ఏముంటుంది చెప్పండి? మీ ఎడబాటు సహించటం దుస్సాధ్యం. నన్ను కూడా మీ వెంట తీసుకువెళ్లండి స్వామీ!' అని ప్రార్థించింది.

అబులా కొంచెంసేపు యోచించాడు. 'నీకు తెలియదు. నామీద వుండే ప్రేమాతిశయంవల్ల అలా అనిపిస్తోంది నీకు. మన ఇరాను నుంచి అరేబియాకు వెళ్లటం తేలిక కాదు...అయితే నీకేమన్నా కోరిక వుంటే చెప్పు తప్పక తీర్చివెళ్తాను' అన్నాడు.

తనను వెంట తీసుకుపోడని చిలక గ్రహించింది. ఒక సందేశం పంపేదుకు నిర్ణయించింది. 'స్వామీ! మీరు ఇక్కడ్నుంచి అరేబియాకు పోయేదారిలో బాగ్దాదునగరం తగులుతుంది. ఆ నగరం సమీపంలో మీకు ఒక వనం కన్పడుతుంది. ప్రకృతి సౌందర్యం అంతా ఒకచోటే చేర్చారా అన్నంత శోభతో వుంటుం దావనం. అక్కడ నేకరకాల పక్షులు ఆనందోత్సాహాలతో కలకల ధ్వనంతో మధురగీతాలు గానం చేస్తుంటాయి. ఈ మధురగీతాలు దూరానికే వినిపిస్తాయి. అక్కడ మా బంధువులు, స్నేహబృందం వున్నారు. వారికి నా సందేశం ఒకటి అందివ్వండి. అదే నా కోరిక' అంది.

'ఇంతేనా. అదెంత పని. అదేమిటో చెప్పు. తప్పక అందిస్తా' అన్నాడు.

'వాళ్లతో ఇలా చెప్పడి—ప్రియమైన ఆప్తులారా! స్నేహితులారా! స్వేచ్ఛాజీవులు మీరు, స్వతంత్ర సమీరాలు పీల్చేవారు మీరు, నిరాటంకంగా గగనవీధుల్లో విహరించే భాగ్యవంతులు మీరు. నేను కూడా ఒకనాడు మీ తోటివాణ్నే. మీ మాదిరే జీవించాను, అనుభవించాను. ఇప్పుడు టెహరాను అనే నగరంలో వుంటున్నాను. లోహపు పంజరమే నా ప్రపంచం. ఇందులోనే జీవిస్తున్నాను. ఊహాపథంలో విహరిస్తున్నా. ఇక్కడుండే నా ప్రేయసినిగురించి సుఖస్వప్నాలు కంటున్నా, రేయింబవళ్లు తలపోస్తున్నా. గత్యంతరంలేదు. మీ ఈ ఆపుడు కోసం, భాగ్యవిహీనుడి కోసం బాధపడకండి. కాని ఒక్క మనవి. ఎప్పటికైనా స్వతంత్రజీవి కావాలని, ఆ భాగ్యం ప్రసాదించమని భగవంతుణ్ని వేడండి, ప్రార్థించండి' అంది చిలక కన్నీరు కార్చుతూ.

ఈ మాటలు విని అబ్దుల్లా ఆశ్చర్యపోయాడు. బయలు దేరవలసిన కాలం సమీపించింది. అందరి దగ్గర వీడ్కోలు స్వీకరించి తీర్థయాత్రకు పయనమయ్యాడు.

చిలక చెప్పినట్టు దారిలో బాగ్దాదునగరం తగిలింది. ఆ వనంకూడా కన్పించింది. అనేకరకాల పక్షులు కోలాహలంతో మధుర నినాదాలు చేస్తున్నాయి. వాటి సందడి వినగానే అబ్దుల్లాకు తన పెంపుడు చిలక మనసులో మెదిలింది. ఆ చిలక చెప్పిన సందేశం గుర్తుకొచ్చింది.

ఆవనం చేరుకున్నాడు. చిలకలున్న చెట్టును సమీపించాడు. ఈ ప్రయాణీకుణ్ని

మనవి

గతవారం సంచిక మధ్య పుటలలో ఒరిస్సా ముగ్గులు, ఆముగ్గులపై వ్యాసము రచించినవారు శ్రీ గొల్లపల్లి వెంకటేశ్వరరావు అని గుర్తించ ప్రార్థన. అదేసంచిక 31—వ పేజీలో 'కాకరపూలు'చిత్రించినవారు శ్రీమతి ఎమ్. జి. కాంతమ్మ, ఆదోని; రథము చిత్రించినవారు కార్యంపూడి లక్ష్మీకాంతం అని కూడా గుర్తించ ప్రార్థన.

★ పంజరంలో చిలక ★

చూసి ఆ చిలకలన్నీ ఆశ్చర్యపోయాయి. అన్నీ దగ్గరకొచ్చి గుమిగూడాయి.

అబ్దుల్లా 'ఓ మిత్రులారా! నాది బెహరానునగరం. తీర్థయాత్రకోసం మక్కా వెళ్తున్నా. మీ బంధువు, స్నేహితుడు నాదగ్గర వుంటున్నాడు. నే పెంచుతున్నా. అతని దగ్గర్నుంచి ఒక సందేశం తీసుకొచ్చా' అన్నాడు.

చిలకలన్నీ 'చెప్పండి, చెప్పండి' అన్నాయి. అతి సౌందర్యంగా వున్న ఒక చిలక మరీ ముందుకొచ్చింది రెక్కించి వింటానికని.

అబ్దుల్లా ఆ సందేశం వినిపించాడు.

ఇంకా సందేశం పూర్తిగా అవ్వనన్నా అవలేదు. ముందుకొచ్చిన చిలక 'ప్రియా! ప్రియా!' అంటూ అరిచి మూర్ఛపోయింది.

అబ్దుల్లా ఆశ్చర్యపోయాడు. మిగిలిన చిలకలన్నీ ఖంగారుపడ్డాయి. 'పుణ్యానికని బయలుదేరితే పాపం సంభవించిందేమిరా?' అనుకున్నాడు. ఎన్నో వుపచర్యలు చేశాడు ఆ చిలకకు. కాని లాభం కన్పించలా. స్పృహ రాలేదు.

తిరిగి ఆ చిలకల్ని అడిగాడు గత్యంతరం ఏమిటని.

వయస్సులో పెద్దగా వున్న చిలక చెప్పింది: 'మీరు పెంచుతున్న చిలక యీ చిలకకు ప్రియుడు. మీ సందేశం విని మూర్ఛపోయింది ప్రేయసి. ప్రియుడువచ్చి పలకరిస్తేగాని స్పృహ వచ్చేటట్లు లేదు. తక్షణం మీరు బెహరానువెళ్లి ఆ చిలకను తీసుకువస్తేతప్ప యీ చిలక జీవించదు.'

ఆలోచించాడు అబ్దుల్లా, పాప పుణ్యాలెరగని చిలకను చేతులారా చంపటమంత ఘోరపాపం వేరే వుండదనుకున్నాడు.

మరుక్షణమే వెనక్కి వెళ్లాడు. కరవేగంతో ప్రయాణం సాగించాడు.

పెద్ద చిలక సలహాప్రకారం తన పెంపుడు చిలకను వనంలోకి తీసుకొచ్చాడు.

తను అప్పుడు పంజరంలో వుండటం చూశాయి చిలకలు. కలకలం ఎక్కువయింది.

తన పెంపుడు చిలకను బయటకు వదిలాడు పంజరంలో నుంచి. రంయి మంటూ బయటకొచ్చింది. మూర్ఛలో వున్న చిలక దగ్గరకుపోయింది ఆత్రుతతో మరీ దగ్గరగా వెళ్లి రుద్ధకంఠంతో 'ప్రియతమా! ప్రియతమా ఇదిగోవచ్చాను. లే! నీ కళ్ళలోని అందాన్ని చూడని నీ తీయని కంఠంతో నన్ను మనసారగా 'ప్రియా!' అనిపిలు. లేప్రియతమా! లే, లే ప్రియతమా!' అంది.

మూర్ఛపోయిన చిలక గాఢ నిద్రలోంచి మేల్కొన్నట్టు లేచింది. ఏదో మధుర స్వప్నం నిజమైనట్టు లేచింది. ఎదురుగా తన ప్రాణాధికమైన ప్రియుణ్ణి చూసింది. పరవశురాలైంది. 'ప్రియా! ప్రియా! ప్రియా!' అని ఆ పరవశంలో పిలిచి ప్రియుణ్ని నిలువెల్లా చూసి ఆనంద సాగరంలో తేలి ఆడింది. ప్రియుణ్ని ప్రేమాతిశయంతో చుంబించింది.

ఈదృశ్యం చూస్తున్న అబ్దుల్లాతోపాటు చిలకలుకూడా ఆనందాశ్రువులు రాల్చాయి. అందరికళ్ళూ సంతోషంతో మెరిశాయి. అబ్దుల్లా గుండె నిబ్బరపడింది.

తన పెంపుడు చిలకతో 'ప్రియమైనచిలకా! ఇకనీవు హాయిగా యిక్కడేవుండు. స్వేచ్ఛగా జీవించు. నీ ప్రేయసిని స్వీకరించు నాకు చక్కని పాఠం నేర్పావు. స్వతంత్రపిపాస ఎలావుంటుందో నాకు తెలిసివచ్చింది. ఇంక ఎప్పుడూ, ఎవర్నీ బందీగా వుంచను. ఇంతకాలం నా దగ్గర పంజరంలో వుండి ఎంతో బాధ అనుభవించావు. అంతా మర్చిపో. నేను నిశ్చింతగా మక్కా కు పోతాను. కాని నీమీదవుండే వాత్సల్యం ఆమరణాంతం వుంటుంది ఇవే నా ఆశీస్సులు' అన్నాడు.

ఆచిలక: 'స్వామీ! మీరుణం ఎన్నటికీ తీర్చుకోలేను. ఒక ఆ స్వతంత్ర జీవికి స్వతంత్ర ప్రదానం చేశారు. మీ పుణ్యం అమోఘమయింది. అంతే కాదు. నా ప్రేయసికి ప్రాణభిక్ష పెట్టారు. ఆజన్మాంతం మేం కృతజ్ఞులం. మీకు మేలు చేకూర్చాలని మేం ఎప్పుడు దైవాన్ని స్తుతిస్తూవుంటాం' అని చెప్పింది.

అబ్దుల్లా తన యాత్ర తిరిగి ప్రారంభించాడు అక్కణ్నుంచి.

ఆచిలుకలు రెండూ స్వేచ్ఛగా, మనసు తీరేట్టుగా, జంటగా ఆకాశంలోకి ఎగిరిపోయాయి. (హిందీ ఆధారంగా)

స్వయంవరం

ఐదుగురూ యువకులే!

ఐదుగురూ పాతికేళ్ళ లోపువాళ్లే!

ఐదుగురూ ధనవంతులే!

ఐదుగురి దగ్గరా ఐదు శుభలేఖలున్నాయ్!

ఐదుగురూ నిస్పృహగా పడివున్నారు!

ఒకేరకమైన వింత జబ్బుతో బాధపడ్తున్నారా ఐదుగురు యువకులు. భావకవి భద్రం చూచిచూచి బరువుగా నిట్టూర్చాడు. బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు. శుభలేఖను చదివి కిటికీలోనుంచి అవతలికి పారేశాడు. "హా! స్వప్నసుందరీ! ప్రాణేశ్వరీ! నెచ్చెలీ" అంటూ పాలిపోయినముఖంతో పడక కుర్చీలో పడిపోయాడు.

కాలిపోతున్నది కామేశం హృదయం. శుభలేఖలోని పెద్ద అక్షరాల దగ్గర్నుంచీ మొదలెట్టాడు: చి. సౌ. వసంతను - చి. శేఖర్ : M. SC కి ఇచ్చి వివాహము జరుగునటుల..... కలవర పడ్డాడు. ఇక చదవలేక పోయాడు. కాళ్లుగట్టిగా బల్లకేసి తన్నాడు. కసకస నలిపి శుభలేఖను చిత్తుకాగితాల బుట్టలో పారేశాడు. కాళ్లు తడబడి పక్కన మంచంమీద కదలకుండా పడిపోయాడు కామేశం. అర్ధనిమీలిత నేత్రాలతో గోడకు చేరబడ్డాడు ఆనందం. అల్లాగే ఓపికగా "చి. సౌ. వసంతను-శేఖర్-కు ఇచ్చి, ..." అంతే బ్రేకుపడి పోయింది ఆనందం గొంతు. అడుగులో అడుగేసుకుంటూ "జగమే మాయ" అంటూ నిట్టూర్చుతూ అలమరా దగ్గర అల్లాగే వాలిపోయాడు.

పళ్లుపటపట లాడించాడు పరశురామ్. "చి. సౌ. వసంత... శేఖర్" పర పర చింపేశాడు శుభలేఖ. పళ్ళు బిగించి ఘట్టిగా కొట్టుకున్నాడు నదుటిమీద చేత్తో పసిల్లాడిలా ఏడుస్తూ, పనసతొనలు పెట్టివున్న ళ్లెంమీద విరుచుకు పడ్డాడు.

సూదులతో పొడిచినట్టుగా తన్నుకులాడాడు సూర్యం. శుభలేఖను మడిచి పక్కన పారేశాడు. సురసుర కాలిపోతున్నట్టనిపించింది అతని హృదయం. ఉసూరుమంటూ "వసంతా"! అని వినిపించనంత నెమ్మదిగా అంటూ వాపోతుండగానే స్థూలకాయుడు సూర్యం బల్లమీద ముందుకు ఒరిగిపోయాడు.

భద్రం నాన్న భయపడిపోయాడు!

కామేశం తండ్రి కలవర పడ్డాడు!

ఆనందం అయ్యకు అంతు పట్టలేదు!

పరశురామ్ తండ్రి పని అయిపోయింది!

సూర్యం, బాబు సొలిపోయాడు!

దీని కంతటికీ కారణం...?

వసంత!

మూడురోజుల క్రిందట......

సాయంత్రం 5 గం॥ కావొస్తోంది. బీచ్ ఒడ్డున ఆతురతగా అటూ ఇటూ తిరుగుతున్న ఓ యువతికి ఓ యువకుడు ఎదురుపడ్డాడు. ఆయువతి, సన్నగా, పొడుగ్గా, నాజూగ్గా వుంది.

యువకుడే మొదట పలకరించాడు.

"మీరు దేనికోసమో వెతుకుతున్నట్టుంది"

ఆశగా చూచింది యువతి.

"ఆ! హాండ్‌బాగ్ పోయింది"

యువకుడు సూటు జేబులోంచి ఓ చిన్న హాండ్ బాగ్‌ను ఇవతలకు తీశాడు. యువతి కండ్లు ఆనందంతో మెరిశాయి.

ప్రభావతి

"ఇదేనా?" వినయంగా అడిగాడు.

"ఆ! అదే!" ఆతురతగా చెప్పింది.

హాండ్ బాగ్ తీసుకుంటూ ఆమెఅంది:

"థాంక్స్! మీ పేరు?"

"భద్రం! అసలు రామభద్రం. మా ఫ్రెండ్స్ భావకవి భద్రం అంటారు!" ఆయువకుడు గర్వంగా చెప్పాడు.

"మీ పేరు" అతడడిగాడు.

"వసంత! మీకుదొరక బట్టి సరిపోయింది. చాలా థాంక్స్, అప్పుడప్పుడూ అలా మా ఇంటికి వస్తూండండి" వసంత చిరునవ్వు నవ్వుతూ అంది' పళ్ళు ముత్యాల్లా మెరిసిపోయినాయ్.

"ఏ స్ట్రీట్‌లో వున్నారు మీరు" భద్రం నెమ్మదిగా ఆమెపక్కన నడుస్తూ అడిగాడు.

"గవర్నరుపేట"

"ఇంటినంబరు?"

చెప్పింది వసంత.

భద్రం నోట్ చేసుకున్నాడు.

"మరి గుడీవెనింగ్..." వసంత కారు స్టార్ట్ చేసింది.

భద్రం భావ ప్రపంచంలో మునిగిపోయాడు.

* * *

"ప్లీజ్! ఈ కారును కాస్త స్టార్ట్ చెయ్యగలరూ!......?"

మధురమైన కంఠస్వరంవిని కామేశం, ఆనందం అదిరిపడ్డారు. వసంతనుచూచి వాస్తవ ప్రపంచంలో పడ్డారు.

"అల్లాగే" అనుకోకుండా ఇద్దరూ జవాబిచ్చారు. కారుదగ్గరికి వచ్చారు.

కాస్సేపట్లో కారు స్టార్టయింది.

"థాంక్స్! చాలాపొద్దుపోయింది!" వసంత మృదువుగా అంది.

"జాగ్రత్తగా వెళ్ళండి! చీకటిపడ్తోంది" ఆనందం అందిచ్చాడు.

"ఫర్వాలేదులెండి" వసంతగొంతు కితకితలుపెట్టింది.

"ఇంతకూ ఎక్కడికెళ్లాలనో..." కామేశం కళ్ళుతిప్పుతూ అడిగాడు.

"గవర్నరుపేట. లాయర్ రంగనాథం మా ఫాదర్..." వసంత పూర్తిచేసేలోపల అందుకున్నాడు ఆనందం.

"చలపతిరావు మీ బ్రదర్ అనుకుంటాను. నాడియరెస్ట్ ఫ్రెండు కూడాను."


"అలాగా! మీ పేరు...?"

"ఆనంద్" గర్వంగాఅన్నాడు. "B Sc. ఆనర్సు చదువుతున్నాను. ఇతను మా క్లాస్‌మేట్ కామేశం. చలపతిరావుకూడా తెలుసు." "ఇలా ఫ్రెండ్స్ అందరం కలుసుకున్నామన్నమాట" వసంత కిలకిల నవ్వుతూ కొరకొరచూస్తున్న కామేశంవేపు తిరిగింది. ఐసయి పోయాయి కామేశం కండ్లు.

"వెళ్తాను..." జవాబు ఆశించకుండా కారు కదిలిపోయింది. స్నేహితులిద్దరూ ఒకరివేపు ఒకరు చూచుకున్నారు వింతగా.

* * *

సెకండ్ షో. ఇంటర్‌వెల్‌లో లైట్లు వేశారు. వసంతకు కుడివైపు అన్నయ్య చలపతి కూర్చున్నాడు. హఠాత్తుగా ఓ చెయ్యి చలపతిభుజంమీద తట్టింది. చలపతి



ఇంటికి పంట

ఫొటో: గంధం కృష్ణమోహన్‌రావు—జమ్మిపెడ్పూర్.

★ స్వయంవరం ★

వెనక్కు తిరిగి "ఓనువ్వా! సూర్యం! రా ఇలా కూర్చో. నేనసలు చూడ్లేదు."

సూర్యం చలపతి పక్క కుర్చీలో కూర్చున్నాడు.

"వీడు నా ఫ్రెండ్ సూర్యం వసంతా! M. A చదువుతున్నాడు. ఈవిడ మా చెల్లెలు వసంత. B. A చదువుతోంది."

వసంత, సూర్యం ఒకరినొకరుచూస్తూ అభినందించుకున్నారు.

"ఈ మధ్య బొత్తిగా రావటమే మానేశావ్?"

చలపతిప్రశ్నకు సమాధానం సూర్యం నోట్లోకాదుగదా మనస్సులోగూడా లేదు. అతనిమనస్సు చలపతికి ఇంతఅందమైన చెల్లెలుందని తనకు తెలీదే అని చింతిస్తోంది.

పిక్చర్ మళ్ళీ బిగిన్‌చేశారు.

సూర్యం పిక్చరే చూళ్ళేదు.

హాలునుంచి బయటికివస్తూ "శెలవురారా! సూర్యం!" అన్నాడు చలపతి.

"తప్పకుండా"

"నమస్తే మిస్ వసంతా!" సూర్యం తప్పనిసరిగా విధిలేక వెళ్ళాడు.

సూర్యంవెళ్ళిన పదినిముషాలదాకా గష్ తగ్గలేదు.

"హల్లో వసంతకుమారి! మీరిక్కడికి వచ్చారు. నేనుగమనించలేదు సుమండీ!" ఒక వ్యక్తి వసంతపక్కకు వస్తూ అన్నాడు.

ఆశ్చర్యంగా చలపతి అతనివేపు చూచాడు.

"వారు మీ..." అతను పూర్తిచేసే లోపలే అందుకుంది వసంత.

..."బ్రదర్! వీరు "పరాజయం" నాటకంలో కాలేజిలో నాతోపాటు యాక్టుచేసిన పరశురాంగారు అన్నయ్యా. నా క్లాస్‌మేట్ కూడాను."

"అలాగా..." చలపతి షేక్‌హేండ్ ఇచ్చాడు.

"ఈ రోజు చాలామంది ఫ్రెండ్స్‌ను కలుసుకున్నాను" చలపతి అన్నాడు.

"ఒక్కొక్క రోజు అలా వుంటుంది. రష్ తగ్గింది. వెళ్దామా "పరశురామ్ వసంత వేపు చూస్తూ అన్నాడు.

"మా కారులో పోదాం రండి. ఎటూ అటువేపే వస్తారుగా!" వసంత స్నేహంగా అంది. కారు కదిలింది.

* * *

మర్నాటి రోజు...

పొద్దున 7 గం|| లప్పుడు వసంత గేటు దగ్గర పూలచెట్ల దగ్గర తిరుగుతోంది తోచక.

"నమస్తే వసంతాదేవీ!..." వులిక్కిపడింది వసంత.

ఓ చిన్న పుస్తకం చేతపట్టుకుని భద్రం గేటుదగ్గర కనిపించాడు. విస్తుపోతూ ఆహ్వానించింది వసంత.

"భావకవిని కాదూ మరి. వినేవాళ్లున్నారని తెలిస్తే మహాఇదిగా వస్తుంది కవిత్వం. మీకు వినిపిద్దామని వచ్చాను. ఏమంటారు?" ఊపిరి పీల్చుకోటానికి ఆగాడు భద్రం.

"ఊ! కానీండి. ముందటలా లోపలికి వెళ్ళి కూచుందాం రాండి" తప్పదురా భగవంతుడా అనుకుంది వసంత. కాఫీ తాగారు ఇద్దరూ. ఓ సుందరిని గురించిన కవిత్వం వినిపించాడు భద్రం.

సరిగ్గా వినకపోయినా "ఫస్టుక్లాస్‌గా వుంది" అని వదిలించుకుందామని అంది వసంత, మహా ఆనందంతో మళ్ళీ వస్తానని వెళ్ళాడు భద్రం. భారం తీరినట్టుగా సంతోషించింది వసంత.

9 గం|| ప్రాంతంలో జడల్లుకుంటున్న వసంత వాకిటి కర్టెన్ కదులుతుండటం చూచి బయటికి వచ్చింది రూంలోంచి.

కామేశాన్ని చూచి ఆశ్చర్యపడింది.

"మీరు......"

..."మీకోసమే వచ్చాను. ఏమీ తోచలేదు సుమండీ! అలా వెళ్తే మా రూమ్‌మేట్స్ ఎవ్వరూ లేరు. మరి తోచక ఇలా వచ్చేశాను."

"మంచిపని చేశారు లెండి"...

పిచ్చాపాటి మాట్లాడుకున్నారు.

10 గం|| ప్రాంతంలో మీల్స్ వేళయిందని లేచింది వసంత. కదలక తప్పలేదు కామేశానికి.

ఆనందంగా ఈల వేస్తూ "చలపతిరావూ!" అంటూ వచ్చాడు ఆనందం. 2 గం|| లయుంటుంది.

"ఎవరూ?..."ఆశ్చర్యంతో అట్టిట్టయింది వసంత.

"లేడండీ! తెల్లవారుఝామున అర్జంటు పనిమీద వైజాక్ వెళ్ళాడు."

"అరె! నాకు తెలీదు. అయినా ఏదో ఓలా పొద్దుపుచ్చుకోవాలికదా మరి. మీకిప్పుడేం బిజీ వర్క్ లేదనుకుంటా" ఆనందం ఆప్యాయంగా ఆమె వేపు చూచాడు.

"ఊహు..." అప్రయత్నంగా వచ్చింది వసంతకు.

అతన్ని అవతలకు పంపించేసరికి 5 గం|| లయింది.

ఇకేం ఖర్మంరా అనుకుంటున్న వసంతకు ప్యూన్ మల్లయ్య వచ్చి చెప్పాడు. ఎవరో ఇద్దరు మీ కోసం వచ్చారంటూ!

హాతాశురాలైంది వసంత.

అప్పుడే వాళ్ళు లోపలికి రానేవచ్చారు. పరశురామ్, సూర్యం.

"చలపతి వూరి కెళ్ళాడటగాదండీ వసంత కుమారీ!" సూర్యం అన్నాడు.

"ఏమిటి మీ బ్రదర్ వూళ్ళో లేరూ! ప్చ్!" పరశురామ్ డ్రామాలో 'యాక్ట్' చేస్తున్నట్టుగా అన్నాడు.

"వెళ్ళొస్తామయితే ఇంకెందుకూ" సూర్యం వెనక్కి తిరిగాడు.

"కాస్సేపు అలా ఏదైనా మాట్లాడి పోదామండీ! ఎటూ వచ్చాంగాదూ!" పరశురామ్ అన్నాడు.

"కాఫీతాగి వెళుదురుగాని" వసంత గొంతు నూతిలో నుంచి మాట్లాడినట్టుంది.

ఇద్దరూ ఇంటినుంచి కదిలేసరికి 7 గంటలయింది.

తలనొప్పిగా వుందని వసంత భోజనమయినా చెయ్యకుండా, మళ్ళీ ఎవరొస్తారోనని మేడమీదికెళ్ళి పడుకుంది.

* * *

వసంతను చూడంది బ్రతకలేనను కున్నాడు భద్రం!

వసంత వల్లే తను కాళ్ళూ చేతులూ కదల్చగల్గుతున్నాననుకున్నాడు కామేశం!

వసంత లేనిది జీవితంలో అందం లేదను కున్నాడు ఆనందం!

వసంతను తల్చుకుంటూ పరవశమౌతున్నాడు పరశురామ్!

వసంతలేని బ్రతుకులో సొగసే లేదను కున్నాడు సూర్యం!

* * *

ఆరోజు...

రోజూ కంటే అందంగా అగుపించింది వసంత!

పైగా మిత్రులందరూ ఒకేసారి వచ్చారు! చాలా మంది యువతులు కూడా వచ్చారు.

చిరునవ్వు వెదజల్లుతోంది వసంత ముఖం.

స్వయంగా ఐదుగురి మధ్యకూ వచ్చి అందిచ్చింది తలా ఒక శుభలేఖ.

భద్రం బిక్కపోతూ బయటకు వచ్చాడు.

కామేశం కాలు గాలిన పిల్లిలా పరుగెత్తాడు.

ఆనందం ఆనందవిహీనంగా బయటపడ్డాడు.

పరశురామ్ పాలిపోయిన ముఖంతో వెళ్ళాడు.

సూర్యం పరపుర దహించుకు పోతూ వచ్చాడు.

అంతే! అదే ఈ నాటి ఈ దుర్ఘటనకు కారణం! ★

"శ్రీమతిచేసిన చిన్నతమాషా"

ప్రక్కగా పోతున్న ప్లిమత్ కారు డ్రైవరు వేసిన సడన్ బ్రేక్ తో 'బ్రోంయ్' మంటూ శబ్దం చేసికొంటూ ఆగిపోయింది. ఆ దెబ్బతో పరధ్యానంగా నడుస్తూ వున్న ఆనందరావు ఆలోచనా ప్రవాహానికి కూడా సడన్ బ్రేక్ పడింది. వెంట్రుక వాసిలో తప్పిపోయింది పెద్ద ప్రమాదం. జనం అంతా గుమికూడారు. "ప్రతివారికీ వీధులలో నడుస్తూ కూడా పెద్ద వేదాంతుల లాగా ఆలోచించుకొంటూ నడవటమూ కారు ప్రమాదాలు జరుగుతున్నవి అని మమ్మలను కోర్టులకు యీడ్పించటం పరిపాటయిపోయింది" అంటూ డ్రైవరు తిరిగీ కారు నడుపించుకొని పోయాడు.

ఆనందరావు తిరిగీ నడక సాగించాడు. ఆలోచనా తరంగాలు క్రిందికీ పైకీ పొంగుతూనే వున్నయి అతని మెదడులో. అంత తీవ్రంగా ఆలోచిస్తూ నడవటానికి కారణం లేక పోలేదు అతనికి. తనపేరు తలచుకొని చిరునవ్వు నవ్వుకొంటాడు తనలో తానే నేతిబీరకాయను గుర్తుకు తెచ్చుకొని. ఆనందరావు ప్రథమశ్రేణిలో ఎం. ఏ. పట్టం పుచ్చుకొన్న యువకుడు. అతడు పడినవన్నీ బాధలే. అతని విషాద గాథలు వేదనా శకలాలు. కాని, 'కావడికొయ్యే కుండలు మన్నే' అనే వేదాంతంలోకి దిగాడు-చివరకు.

కాని యీనాటి ఆనందరావు పరిస్థితి వేరు. అతను వెళుతున్నది సర్వీసు కమిషను ఆఫీసుకు. కొన్నిదినాల క్రింద అతను పదవ సారి కూర్చున్న కాంపిటేటివ్ పరీక్షల ఫలితాలు యివాళ తెలుస్తయి ఆఫీసులో. ఆ ఫలితాలమీదనే ఆధారపడి వున్నది అతని జీవితం అంతా. అతడు అందులో నెగ్గితే గెజిటెడ్ ఆఫీసరు అయికూర్చుంటాడు ఒకే సారి. అందుకనే అంతగా ఆలోచిస్తూ నడుస్తూ వున్నది. ఇప్పుడు అతని మెదడులో జరుగుతున్నది యీ సంగ్రామమే. ఆలోచనలు ఒకదానివెంట ఒకటి పరుగిడుతున్నయి పాదరసం లాగా. మిగిలిన ఒకే ఒక చార్మినార్ సిగరెట్టును బైటికి తీసి ముట్టించాడు. ఒకవేళ ఆఫీసరు అయిపోతే తన శ్రీమతి యెంత ఆనందిస్తుందో. పాపం తనకోసం యెన్ని కష్టాలు పడుతున్నది యిప్పుడు. అప్పుడు తను యెంత గారంగా చూచుకొంటాడో.

పి. వి. యల్. నరసింహారావు

ముద్దులు మూటగట్టే మూడేండ్ల బాబు! బాబుకు తను సైకిలు, గుర్రం యెన్ని కొంటాడో? నిజంగా తనకా అంత అదృష్టం! ఇది రాకపోతే వేసిన చోటనే వున్న గొంగళే అతని పని. ప్రతి వుదయమూ తనకు మేలుకొలుపులు చెప్పే వైతాళికులు — పాల మనిషి, అంగడివాడు, గృహ యజమాని చాకలి. వగైరాలు. తనూ. ఆ జీవితానికి అంతు వుండదు. ఇలా ఆలోచిస్తూ సర్వీసు కమిషను ఆఫీసులోకి చిరిగిన చొక్కా భాగం పైకి అగుపించకుండా పాంటులోకి దోపుకొంటూ అడుగెట్టాడు ఆనందరావు. ఆనందరావు ఆనందానికి అంతులేదు. తన కండ్లను తను నమ్మలేకపోయాడు. ఏకంగానే ఆఫీసరు అయిపోయాడు. మనసు మనో వాయు వేగాలను అధిగమించింది శ్రీమతి యెంత సంతోషిస్తుందో. యింటికి పరుగులెత్తాడు ఆనందరావు.

ఆనందరావు ఆశ్చర్యానికి అంతులేదు యింటికి వచ్చేటప్పటికి సీతాకోక చిలుకలా తయారయిన శ్రీమతి కలకలలాడుతూ కిలకిల నవ్వుతూ ఆహ్వానించింది. ఎలా తెలిసిందో యీశుభవార్త శ్రీమతికి తనకు వున్న ఒకే ఒక జార్జెటు చీరెతీసి శృంగారించుకొన్నది. ఎవరి నోటా యేమాటా పలకలేదు. భోజనానికి లెమ్మన్న శ్రీమతి మాట విని నివ్వెరపోతున్న ఆనందరావు కాళ్లు కడుక్కొని వచ్చి పీటమీద కూర్చొన్నాడు. విందును చూచి వింతపడ్డాడు. ఇదివరకు వాసనలు ఆఘ్రాణించి తృప్తిని జెందిన ఆనందరావు లడ్డూ, అవ, పులిహోరలతో విందు ముగించాడు. భోజనానంతరము శ్రీమతి తాంబూలముతోపాటు మడతపెట్టిన ఒక కాగితం ముక్క యిచ్చింది. అందులో "విజయంలో వేంచేసిన శ్రీవారికి—బహుమతి" అని వ్రాసివుంది. రానురాను అగమ్యమయిపోయింది అతని స్థితి ఆ పరీక్షలో నెగ్గిన ఆనందరావు యీ పరీక్షలో తప్పిపోయాడు.

మెట్లు యెక్కబోతున్న ఆనందరావు శ్రీమతి ఒక చిన్న కాగితం మడతపెట్టి మూలగా విసిరివేయటం చూసి చూడనట్లే నటించాడు. బాబును యెత్తుకొని శ్రీమతి పైకి వెళ్ళింది. పిల్లిలాగా అడుగులు వేసుకొంటూ వెళ్ళి ఆ కాగితంముక్క మడతలను విప్పి చూచాడు అందులో. "రాకపోతేపోయింది. ఆ ఉద్యోగం, దీనితోతయింకొకటి వస్తుంది. దిగులుపడకండి' అని వ్రాసి వున్నది.

ఆనందరావుకు అర్థం అయింది శ్రీమతి చేసిన తమాషా. హుషారుగా పాడుకొంటూ మెట్లు యెక్కిన ఆనందరావును చూచి పకపక నవ్వింది శ్రీమతి. "అమ్మదొంగా, తెలిసిందిలే నీ నాటకం" అంటూ శ్రీమతి ముద్దాడుతున్న బాబును పోట్రేగా తనుకూడా రెం[illegible] ప్రయత్నించాడు. కొంటె బాబు ప్రక్కకు తప్పుకోవటంతో యిద్దరి పెదవులు కలిసాయి. ఉన్న ఒకే ఒక జార్జెటు చీర నలిగి పోతుందని శ్రీమతి పెట్టుకొన్న మొర వృథా కానే అయింది. ★

రాజ్యాభిషేకం

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

౧

భీమ దుర్యోధనుల చిత్రవిచిత్ర గదాయుద్ధ కౌశలం ప్రేక్షకులనందరినీ దిగ్భ్రాంతిలో ముంచివేసింది. వారి ఇద్దరినీ మాటిమాటికి ప్రత్యేకంగా అభినందించే కురువృద్ధుల జయజయ ధ్వానాలు మిన్నందుకొన్నాయి.

కౌరవ పాండవకుమారుల అస్త్ర విద్యాభ్యాసం పూర్తి కాగానే ద్రోణాచార్యుడు వారి అస్త్ర విద్యాకౌశలం పరిశీలించవలసినదని సవినయంగా ధృతరాష్ట్రచక్రవర్తికి విన్నవించుకొన్నాడు. ధృతరాష్ట్రుడు, గాంధారి, కుంతి, భీష్ముడు మొదలైన కురువృద్ధులంతా తమకోసం ప్రత్యేకంగా ఏర్పరిచిన సింహాసనాలమీద సమాసీనులై అత్యద్భుతమైన కుమారుల అస్త్రవిద్యా ప్రదర్శనంతో ఆనందించారు. విదురుడు అంధదంపతులిద్దరికీ ఆయా కౌరవ పాండవకుమారుల అస్త్రవిద్యా చాతుర్యాలు వేర్వేరుగా విన్నవిస్తూంటే వారిద్దరు అంత ప్రత్యక్షంగా చూసినట్టే ఆనందించారు. అంధులైన వారి కనుగొలుకులలో ఆనందబాష్పాలు ఉవ్వెత్తుగా ఆవిర్భవించాయి. కుమారుడు భీమసేనుని గదాయుద్ధ కౌశలం చూసి కుంతి ఎంతైనా సంతోషపడింది.

క్రమక్రమంగా ప్రాతఃకాల సూర్యకిరణాల కాంతులు భీమ దుర్యోధనుల గదాదండాలపై ప్రచండంగా ప్రకాశించాయి. వారిద్దరు ఒకరొకరికి తీసిపోకుండా అలాగే నిలిచి గదాయుద్ధం సాగించారు.

అలాగ కొంతసేపు గడిచిపోయేసరికి సభాస్తారుల జయజయధ్వానాలింకా బాగా ఎక్కువైపోయాయి. వారంతా అంతకు పూర్వం అనేకమంది కురుకుమారుల అస్త్ర విద్యాచాతుర్యాలు పరిశీలించారు. అవన్నీ అత్యాశ్చర్యకరంగానే ఉన్నాయి. కాని భీమ దుర్యోధనుల గదాయుద్ధ ధోరణికి వేరుకనకనే సభాస్తారుల అభినందన ధ్వానాలానిశంగా ఆకాశం అందుకున్నాయి.

భీమ దుర్యోధనుల గదాయుద్ధంలో ఇంకొక విడ్డూరం పుట్టింది. ఇంతకు పూర్వం సభాసదులంతా అస్త్రవిద్యాచాతుర్యం మెరయించిన కౌరవపాండవ కుమారులందరిని అభినందిస్తూ జయజయధ్వానాలు చేశారు. కాని ఇప్పుడు సభలోనివారంతా రెండు పక్షాలుగా చీలిపోయారు. కొందరు ప్రత్యేకంగా భీమసేనుణ్ణి అభినందిస్తూ హర్షధ్వానాలు చేశారు. మరికొందరు దుర్యోధనుణ్ణి అభినందిస్తూ హర్షధ్వానాలు చేశారు.

క్రమక్రమంగా సభ్యులలో పక్షపాతాలు బాగా హెచ్చుపెరిగిపోయాయి. భీమ దుర్యోధనులుకూడా మరింత పట్టుదలతో పెనగులాడడం ప్రారంభించారు. అలాగ ఎంతసేపు పోరాడినా కొంచెమైనా వారొకరొకరికి తీసిపోలేదు. వారిద్దరు మరింత అభినివేశంతో పోరాడటం మొదలుపెట్టారు. అభినివేశాలు చూచినకొద్దీ సభ్యులలో క్రోధావేశాలు, ప్రతిజ్ఞలు, పట్టుదలలు మరింత హెచ్చుపెరిగిపోయాయి.

ద్రోణాచార్యుడా వ్యవహారం అంతా బాగా జాగరూకతతో పరిశీలిస్తూనే ఉన్నాడు. క్రమంగా భీమదుర్యోధనుల గదాయుద్ధం శ్రుతిమించిపోగలదనీ కురువృద్ధులకు మనస్తాపహేతువు కాగలదనీ ఆచార్యునికి భయంవేసింది. వెంటనే అతడు గదాయుద్ధం విరమించవలసినదని అశ్వత్థామ ద్వారా వారిద్దరికి ఆజ్ఞాపించాడు. తిరిగీ సభలో జయజయస్వనాల కలకలం చెలరేగింది. క్షణంలో భీమదుర్యోధనులిద్దరు తమ గదాయుద్ధం విరమించివేశారు.

ఆచార్యుడు క్షణంలో రంగ మధ్యంలో నిలబడ్డాడు. తన ప్రియాంతేవాసి అర్జునుని ధనుర్విద్యా కౌశలం కళ్ళారా చూచి ఆనందించవలసిందని కురువృద్ధులందరికీ సవినయంగా విన్నవించాడు. అర్జును డంతలోనే విల్లమ్ములు ధరించి రంగమధ్యంలో నిలబడ్డాడు.

బంగారు కవచం ధరించిన అర్జునుడా సభామధ్యంలో నిలబడగానే సదస్యులందరు చకితులై క్షణకాలం రెప్పపాటు లేకుండా అతనివైపే తిలకించారు. నీలమేఘ శ్యామలమైన అర్జునుని శరీరంమీది సువర్ణ కవచం నల్ల నల్లని మబ్బుపై మెరిసే మెరుపులా తళ తళ లాడింది. అర్జును డంతలోనే తన ధనుర్విద్యా కౌశల ప్రదర్శన కుపక్రమించాడు.

౨

అర్జునుని అస్త్రవిద్యా కౌశలం కురువృద్ధులందరినీ ఆశ్చర్య సాగరంలో ముంచివేసింది. జయజయధ్వానాల కలకలంతో సదస్యుల చెవులు గళ్ళుపడిపోయాయి. ఆ సమయంలో కుంతీదేవి ఆనందానికి ఇక అంతే లేదు. ఆమె నేత్రాంతాలలో ఆనంద ధారలవిరళ ధారలుగా వహించాయి. ఆ కలకలం విని ధృతరాష్ట్రు డదిరిపడి దానికి కారణమేమని విదురుణ్ణి ప్రశ్నించాడు. విదురుడర్జునుని అపూర్వ చాతుర్య ధోరణి అంతా ఆవృద్ధ నృపతి కెరిగించాడు.

ఆ ఆనంద వార్త వినగానే ధృతరాష్ట్రుని కంఠం గద్గద భారంతో వణికిపోయింది.

"నేటికిగదా నావీనులకు సాఫల్యం కలిగింది. కుంతీ కుమారులు త్రేతాగ్నుల్లా ప్రజ్వలిస్తూ ఇక మా కురుకులచరితం అంతా నిశ్శేషంగా నశింపజేయగలరు!"

అని అనేక విధాలుగా కౌంతేయులను, తత్రాపి అర్జునుణ్ణి అనేక విధాల ప్రశంసించాడు. అర్జును డా సమయంలో అనేకమైన దివ్యాస్త్రాలు ప్రయోగించి అపూర్వమైన తన అస్త్రచాతుర్యం మెరయింపజేశాడు. అత్యద్భుతమైన ధోరణులలో అనేక చిత్రవిచిత్ర గతులలో బాణపరంపరలు ప్రయోగించాడు. అతని చాతుర్యం తిలకిస్తున్న సభాస్తారుల కిక శరీరాలపై స్మృతులే సడలిపోయాయి.

అంతలో రంగద్వారంలో ఒక భయంకరమైన భుజాస్ఫాలనం వినిపించింది. ఆశ్చర్యంతో అర్జునుని అస్త్రచాతుర్యం తిల

రాజ్యాభిషేకం

కిస్తున్న సభ్యులందరిచూపులు ఒక్కమారుగా అటువైపు తిరిగాయి.

బాలసూర్యునివలె ధగద్ధగాయమానంగా వెలిగిపోతూ కర్ణుడక్కడ ప్రత్యక్షమైనాడు. అతని చెక్కిళ్ళపై సహజకుండలాలు రెండు రెండు నక్షత్రాలలా ప్రకాశించాయి.

కర్ణుడు రంగద్వారంలో నిలబడినవారి నందరినీ ఒత్తిగించుకుంటూ క్షణంలో రంగ మధ్యానికి వచ్చి, ముందుగా కృపాచార్యునికీ, ద్రోణాచార్యునికీ సవినయంగా నమస్కరించాడు. వెంటనే అర్జునునివైపు తిరిగి వర్షాకాలమేఘంలా గర్జించాడు:

"నీ వొక్కడవే ఈ మహాస్త్ర విద్యలన్నీ నేర్చుకొన్నానని విర్రవీగుతున్నావేమో! వీటిలో కొన్నింటిని నేను అభ్యసించాను. నీవుచేసిన అద్భుతాలన్నీ నేను చేసి చూపించగలను. అవి చూచిన ఈ పెద్దలంతా ఇంతకన్నా ఆశ్చర్యపోతారు."

ఆ పరుషవచనాలు వినీవినగానే అర్జునుని కెంతైనా కోపం వచ్చింది. కాని దుర్యోధనుడామాటలు విని సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బైపోయాడు.

వెంటనే కర్ణుడు ద్రోణుని అభ్యనుజ్ఞ తీసుకొని అర్జునుడు ప్రదర్శించిన అద్భుతాలన్నీ ప్రదర్శించాడు. అతని అద్భుతశక్తి చూచి అక్కడివారంతా శిలాప్రతిమల్లా నిశ్చేష్టులైపోయారు. అతని అపూర్వ చాతుర్యం వేనోళ్ళ ప్రశంసించారు.

దుర్యోధనుడానందం పట్టలేని అత్యాదరంతో అతన్ని గాఢంగా కౌగలించుకొన్నాడు:

"కర్ణా! ఈక్షణం నించీ నాతో చెలిమి చెయ్యవలసిందని నిన్నభ్యర్థిస్తున్నాను. నాకు నా బంధువులకు హితైషివై నా కౌరవ రాజ్యం అంతా స్వయంగా నడిపించ వలసిందని నిన్ను ప్రార్థిస్తున్నాను."

అని ఎంతో ఆప్యాయంగా కర్ణుణ్ణి ప్రార్థించాడు. దుర్యోధనుడంతటివాడు తన్నావిధంగా ప్రార్థించినందుకు కర్ణుని హృదయం ఆనందసాగరమై ఉప్పొంగింది.

"నా అస్త్రచాతుర్యానికి నీవింతగా ఆశ్చర్యపడవలసింది ఏమి ఉంది? మీ అందరి ఎదట పార్థునితో కలిసి ద్వంద్వ యుద్ధం చెయ్యాలని నే నెంతో కాలంగా ఉబలాటపడుతున్నాను! అదే నా కోరిక."

అనతిదూరంలో నిలబడి అదంతా తిలకిస్తున్న అర్జునుని కామాటలు వినిపించాయి. అంతవరకు తనలో బయలుదేరిన ఆగ్రహం అంతా లోలోపలే నిగ్రహించుకొన్న అర్జునుడిక ఓరిమి వహించలేకపోయాడు:

"పిలవనిదే తగుదునమ్మా అని ఇక్కడికి సిద్ధమై నీ యిష్టం వచ్చినట్లు కారుకూతలు కూస్తున్నావా? తులువా? నీకు పరాత్మ తారతమ్య జ్ఞానం బొత్తిగా లోపించిపోయిందే!"

అదివిని కర్ణుడింతకన్నా రెచ్చిపోయాడు:

"ఈ మాటల కేమిలే! నా శస్త్రాస్త్రాలతో నీ నోటికి తగిన సమాధానం ఇస్తున్నాను. రా!"

అని గట్టిగా గర్జించాడు. అంతటితో ఊరుకోలేదు:

"ఈ రంగభూమి కొకరు పిలవవలిసిన అవసరం ఏమి ఉంది! వీరవరేణ్యులందరు ఇక్కడికి రావడానికర్హులే! ఇక్కడికి రాకూడదని అడ్డగించడానికింకొకరికి అధికారం లేదు."

అని యుద్ధసన్నద్ధుడై అర్జునుని మీదిమీదికి వెళ్ళిపోయాడు.

3

దుర్యోధనుడావిధంగా కర్ణునికి ద్వంద్వ యుద్ధానికనుజ్ఞ ఇవ్వడంలో ఆశ్చర్యం లేదు. కర్ణుడావిధంగా ఉరకలు వేసుకుంటూ మీదిమీదికివచ్చి పడుతున్నప్పుడిక ఉపేక్షించి ఊరుకోవడం పాండవులకు భావ్యంగా కనిపించలేదు. వారు కూడా ఆ ద్వంద్వ యుద్ధానికర్జుని కనుజ్ఞ ఇచ్చారు.

వెంటనే ఆ ఇద్దరి మధ్య భయంకరమైన ద్వంద్వయుద్ధం ప్రారంభమైంది. వారిద్దరు ఒకరొకరిమీద ఘోరాస్త్రాలు ప్రయోగించుకొన్నారు.

ఆ ద్వంద్వయుద్ధ ప్రారంభంతో సభ్యులందరిలోను పక్షపాతాలు బాగా ఒలిసిపోయాయి. ధృతరాష్ట్ర చక్రవర్తి, మిగిలిన కౌరవ కుమారులు కర్ణునియెడల పక్షపాతం వహించారు. భీష్మ ద్రోణాదులంతా అర్జునునియెడల పక్షపాతం వహించారు. అయితే ఆ పక్షపాతాలు మాత్రం బాహాటంగా పైకి పెల్లడికాలేదు. అవి జయజయధ్వానాలలోనే అణిగిపోయాయి.

అంతలో కర్ణుని మేఘాస్త్రం కమ్ముకుని అర్జును డదృశ్యుడై పోయాడు. అది చూచి కుంతీదేవి దుఃఖంతో కుమిలిపోతూ కూర్చున్నపాటుగానే నేలమీద కొరిగిపోయింది. విదురుడామెకు శీతలోపచారాలు చేయించి నెమ్మదిగా ఓదార్చాడు. అర్జునుడు వాయవ్యాస్త్రం ప్రయోగించి తనపై కమ్ముకొన్న కారుమేఘాల నన్నిటినీ ఒక కనురెప్పపాటులో చెదరగొట్టి వేశాడు. కుంతీదేవి తిరిగీ సేదదేరింది.

అంతలోనే కర్ణార్జును లిద్దరికీ శస్త్రాస్త్రాలతో తిరిగీ భయంకరమైన ద్వంద్వ యుద్ధం ప్రారంభమైంది.

కృపాచార్యుడు ద్వంద్వయుద్ధం మర్యాదలన్నీ తెలిసిన మనీషి. అతడు క్షణకాలం భయంకరంగా సాగిపోతున్న కర్ణార్జునుల ద్వంద్వయుద్ధం అతి జాగ్రత్తిగా పరిశీలించాడు. వారియుద్ధం అంతటితో ఆగిపోయేటట్లు కనిపించలేదు. వెంటనే మెరుపులా వచ్చి వారిద్దరి మధ్య నిలుచున్నాడు. తత్క్షణం ఆ ద్వంద్వయుద్ధం ఆపివేయవలసిందని ఆజ్ఞాపించాడు:

"కర్ణా! అర్జునుడు కుంతీదేవి కుమారుడు. పాండవకుల శ్రేష్ఠుడు. నీవితనితో యుద్ధం కొనసాగించే పక్షంలో ముందుగా నీ కులగోత్రాలు తెలియజెయ్యడం ధర్మం. ఆపైన

మూడు తాబేళ్లు కాఫీ హోటలుకు పోయి కాఫీ తెమ్మని ఆర్డరిచ్చాయి. ఇంతలో వాన ప్రారంభమైంది.

తమలో చిన్నదైన తాబేలును మిగతా రెండూ 'ఇంటికి పోయి గొడుగు పట్రా'మ్మని అడిగాయి.

"మరి నే వెళ్లొచ్చేలోగా మీరు నా కాఫీ తాగెయ్యరు గదా!" అంది చిన్న తాబేలు.

"తాగంలే; వేగం పట్రా" అన్నాయి పెద్ద తాబేళ్లు.

చిన్న తాబేలు ప్రయాణమై వెళ్లింది.

రెండేళ్లు గడిచాయి. తాబేలు ఇంకా తిరిగి రాలేదు. పెద్దవాటికి విసుగు పుట్టింది. చిన్నదానికోసం తెచ్చిన కాఫీ చల్లారిపోతోందని "మనమే తాగేద్దామా" అనుకున్నాయి.

"ఏయ్, అలాగైతే నేనసలు వెళ్లను" అన్నది ఇంకా గడప దాటబోతున్న చిన్న తాబేలు.

అర్జునుడు నీకెదురుగా నిలిచి పోరాడగలడు! అంతవరకు ఈ ద్వంద్వయుద్ధం ధర్మసమ్మతం కాదు."

ఆ మాటలు వినగానే కర్ణుని చేతులలోని విల్లమ్ములప్రయత్నంగా జారి నేలమీద పడిపోయాయి. అతడు సూతకులజుడు. తన కులగోత్రా లుచ్చరించడానికే అతనికి నోరాడ లేదు. వల్లమాలిన సంకోచంతో అతని శిరస్సు నేలవైపు ఒరిగిపోయింది.

అది చూచి దుర్యోధనుడు కృపాచార్యుని సన్నిధికివచ్చి అతనిమీద విరుచుకు పడ్డాడు:

"ఆచార్యా! రాజ్యాధిపత్యానికి మూడు విధాలైన అర్హత లున్నాయని పెద్దలంటారు. కులీనుడు, శౌర్యవంతుడు, సేనాబలశాలి రాజ్యాధిపత్యాని కర్హులు. కర్ణుడు రాజు కాక పోవటంవలనే ఇతడర్జునితో ద్వంద్వ యుద్ధానికి కనర్హుడని తాము సెలవిస్తున్నారు. నేనీక్షణంలోనే కర్ణుని కంగరాజ్యాభిషేకం చేస్తున్నాను".

అని భీష్మ ధృతరాష్ట్రుల అభ్యనుజ్ఞ స్వీకరించి వెంటనే కర్ణునికి అంగ రాజ్యాభిషేక సన్నాహాలు చేయించాడు.

క్షణంలో కర్ణుణ్ణి బంగారు సింహాసనం మీద కూర్చోబెట్టి సకల రాజచిహ్నాలతోను, మర్యాదలతోను అతని కంగరాజ్యాభిషేకం చేయించాడు. వేలకొలది భూసురులకు గోసహస్రాలు దానాలు చేయించాడు. అక్షతలతోబాటు భూసురుల ఆశీర్వచన సహస్రాలు కోకొల్లలుగా కర్ణుని శిరస్సుపై వర్షించాయి.

ఆ మహాగౌరవానికి కర్ణుడెంతో ఆనందించి దుర్యోధనుని గాఢంగా కౌగలించుకొన్నాడు.

"ఇంతటి మహాగౌరవం చేసిన నీ ఋణం నే నే విధంగా తీర్చుకోగలను!"

అని అత్యాదరదృష్టితో దుర్యోధనుని వైపు చూచాడు.

"కర్ణా! నీ సఖ్యమే నేను కోరుకొనే వరం!" అన్నాడు.

కర్ణుని జనకుడు సూతుడిది చూచి నిలువునా నిర్ఘాంత పోయాడు. ఎక్కడో దొరికిన తన శిశు వీనాడింతవాడైనాడు గదా అని పరమానందభరితుడైనాడు. కర్ణుణ్ణి కౌగలించుకొని ఆనందాశ్రువులతో అతని శిరస్సు తడిపివేశాడు.

భీమసేనుని కామహోత్సాహం చూచీ చూడగానే ఒక్కసారిగా అరికాలిమంట నెత్తికెక్కింది. కర్ణునివైపు తిరిగి ఒక్క వికపు నవ్వు నవ్వాడు:

"ఓలు కర్ర చేతబట్టి రథము తోలుకో వలసిన నీకు అర్జునునితో సరిసమానంగా ఎదట నిలిచి పోరాడే అర్హత ఎక్కడినుంచి వస్తుంది?

"ఇక ఈ క్షణంనించీ అంగ రాజ్యాధిపతి నైనానని విర్రవీగుతున్నావేమో! అది ఉత్తమక్షత్రియరాజకుమారులు చేపట్టవలసిన రాజ్యం! మంత్రపూతమైన పురోడాశం భక్షించే అర్హత యాజకునికేగాని కుక్కకెక్కడిది?"

అని కర్ణుణ్ణి గడ్డిపరకలా ఈసడించివేశాడు. పాపం! కర్ణుని కాసమయంలో ఏమనడానికీ పాలుపోలేదు. వెలవెలబోయిన ముఖంతో ఆకాశంచూస్తూ నిలుచున్నాడు.

అంతలోనే దుర్యోధనుడు మళ్లీ భీముని మీద విరుచుకుపడ్డాడు:


"భీమా! నీ వీ విధంగా మాట్లాడడం న్యాయమేనా? లేడి కడుపున పులి పుట్టడం ఎక్కడైనా విన్నామా? ఇంతటి మహా తేజశ్శాలి అధమాన్వయంలో జనిస్తాడా? అదీగాక మహావీరుల పుట్టుపూర్వోత్తరాలెవరు నిర్ణయించగలరు? కుమారస్వామి రెల్లులో జన్మించలేదా? ద్రోణాచార్యులు కుంభంలో జన్మించలేదా? అంతవరకెందుకు? మీ రంతా ఎలాగ జన్మించారో ప్రపంచానికి తెలియదా?

"కర్ణుడు అంగరాజ్యానికేగాదు! భూమండలానికంతటికీ ఏకచ్ఛత్రాధిపత్యం వహించగల దక్షుడు!"

అని కర్ణుణ్ణి స్వయంగా తన వెంట రాజగృహానికి తీసుకుపోయాడు.

కుంతీదేవి హృదయంలో కర్ణుణ్ణి గుర్తుపట్టింది. కాని ఆ రహస్యం పైకి వెల్లడించ కిష్టంలేక తెలిసీ తెలియనట్టుగా మాట్లాడ కూరుకుంది.

'ఇంతకాలానికి అర్జునునికెదురుగా నిలిచి నీవా నేనా అని పోరాడగల వీరాధివీరుడు లభించాడు గదా' అని దుర్యోధను డానాటిరాత్రి గుండెలమీద చెయ్యి వేసుకొని హాయిగా నిద్రపోయాడు. ★



అనగా - అనగా - ఒకదేశం. ఏదేశం? అని అడగకండి. ఏ దేశం అయితే నేం? "పేరులోన నేమి పెన్నిధి యున్నది? అని గురజాడవారి గిరీశం తెనిగించాడు కాబట్టి, ఒకానొక దేశం అనిమాత్రం అందాం. ఆ దేశం ఏలే రాజుకు-దశరథ మహారాజుకి మల్లేనే ముగ్గురు భార్యలు; ముగ్గురికీ ముగ్గురు కొడుకులు పుట్టి పెరుగుతున్నారు. ఇంత మట్టుకే మన కథకీ రామాయణానికీ సాపత్యం. దశరథపుత్రులు ఉత్తములు; ధర్మమార్గానుసారులు. ఈ కథలో అన్నదమ్ములు దాశరథులంత సన్మార్గులు కారు. తండ్రిని ఖైదులో పెట్టి, అన్నదమ్ముల్ని హత మార్చి, రక్త సిక్త హస్తాలతో సింహాసనం ఎక్కిన ఔరంగజేబంతటి దుర్మార్గులూ కారు. కాని స్వార్థంతో ఎవరిమట్టుకు వారే-తండ్రి అనంతరం దేశానికి రాజు కావాలనే అభిలాషతో ఉవ్విళ్ళూరుతున్నారు.

తండ్రిగారికి సుస్తీచేసింది; వారం రోజుల పాటు మంచంమీంచి లేవలేదు. ఇంకేం వుంది? రాజుగారు మనలో వారు కారు; ఇహ బతికరు; చచ్చిపోతారు; తరవాత వారసులు ఎవరవుతారో! ఎవరు ఏల్తారో ఈ రాజ్యం? అని గుసగుసలు ప్రారంభం అయినవి. రాజముద్రిక ఎవరు అంకించుకుంటే వారే అనంతరమందు రాజు కాగలరు! అని పట్నంలో అనుకుంటున్నారు.

మూడో నాటికి జబ్బు ఇంకా యెక్కువ అయినది. నాలుగోరోజు ఎలా తెల్లారుతుందా అని ప్రజలు తహతహలాడుతున్నారు. కఫ వాతాల ప్రకోపం ఎక్కువగానే వున్నది. రాజవైద్యులు కుప్పెలు తెగ గోసి పోస్తున్నారు. ఆవేళ మహారాజుగారికి వంటిమీద తెలివీ తేటా ఏమీ లేవు. అదో మగతగా పడుకొన్నారు. కన్ను విప్పలేదు, చూడలేదు.

ఎలాపోయిందో - ఏ(విటో గాని - ఆవేళ రాజముద్రిక పోయింది; పోవడం రూఢే. అంతఃపురంలో మహారాణులో, కొడుకులో, పరిచారకులో - ఎవరు అంకించుకున్నారో-ఏమో కాని ముద్రికమాత్రం కనబడకుండా పోయింది. దొరకలేదు. ఎక్కడ వెతకడం? ఎవరి ననడం? ఎవరి నడగడం? అంతా ఘరానా మనుష్యులే. ఎవరా గజదొంగ? ఎవరిని అనుమానించడానికైనా సావకాశం ఏదీ? ఐదో నాటికి రాజుగారి జబ్బు మళ్లినది. మాంద్యంపోయి తెలివి వచ్చినది. కొత్త నీరసం తప్ప మరేమీ జబ్బు లేదు, రాజవైద్యులు నడిపించిన దివ్యౌషధ ప్రభావంవల్ల నీరసంకూడా తగ్గింది. రాజ్యపరిపాలన రాజుగారు మళ్లీ స్వయంగా చూచుకొంటున్నారు.

కాని రాజాజ్ఞలను ధ్రువపర్చే రాజముద్రిక మాయమైనదే! పోనీ మరో ముద్రిక తయారుచేయించ కూడదా? అంటే — అసలుముద్రిక దొంగిలించిన దొంగ — రాజాజ్ఞకు వ్యతిరేకంగా తప్పటాజ్ఞలు వ్రాయించి అసలుముద్రిక వేసి పంపిస్తూ వస్తే పరిపాలన వ్యవహారం అంతా చిందరవందర అవుతుందే! కూటపత్రాలు - కూట ఆజ్ఞలూ వెడలితే రాజకీయం స్తంభించి పోదా? ఆ ప్రమాదం తప్పించుకోడం యెలాగ? దాని జాడ తీసి పట్టుకోవాలి; గత్యంతరం కనబడలేదు. అంతరంగికంగా మహారాజావారు, మంత్రులు, కొత్వాలు, అనుభవశాలులు-సభచేసి, ఒక కథకుని పిలిపించడానికి నిశ్చయించారు. అతడు వయోవృద్ధుడు, ప్రజ్ఞాశాలి, ధీమంతుడు, ఇంగితజ్ఞుడు, మనశ్శాస్త్రవేత్త, చమత్కారంగా కథలు చెప్పే కథకుడు-ఆయనను పిలిపించి నిండుసభలో రమ్యమైన కథ ఒకటి చెప్పించారు. సభాభవనంలో ఉత్తరపు తట్టు స్త్రీలకోసం ప్రత్యేకించి పరదాలు కట్టేశారు. మహారాణులు, పండువంటి

పుణ్యస్త్రీలు, పౌరస్త్రీలు–250 మంది సభను అలంకరించారు. మహారాజావారూ – మంత్రులు–సిబ్బందంతా మామూలుగా కూర్చున్నారు. విద్యావంతులూ, వయోవృద్ధులూ, యువకులూ–యోధవీరులూ అంతా దక్షిణం వైపు ఆసీనులైనారు. ఇటువంటి మాన్య సభలో ప్రాజ్ఞకథకుడు శ్రావ్యకంఠంతో, గంభీర వాక్కులలో ఈ క్రింది కథ వివరించారు.

"కల్యాణ పట్టణం ఏలుతున్న మహారాజు గుణసముద్రుడు. నిజంగా గుణసముద్రుడే–ఆయనకు ఒక పుత్రికా రత్నం. భద్రావతి. సంగీత సాహిత్య విద్యలు–షట్ శాస్త్రాలూ–అన్నీ నేర్చుకున్న అపరసరస్వతి–సౌందర్యం. శరీరం కుందనచ్ఛాయ, వదనం సౌందర్యసదనం, పిక్కలు తాకే నీలపు కురులు, ఆకర్ణాంత విశాల నేత్రాలు. శ్రీకారయుక్త కర్ణములు. ఆకర్ణాంత విశాల నేత్రాలు. దొండపండు మోవి–కంబుకంఠం యౌవనం పొంగిపొరుతున్న సుందరదేహం, సుశ్రోణి, ఇవన్నీ ఎందుకు – నిలకడకన్న తొలకరి మెఱుపు, సానబట్టిన మకరాంకు శస్త్రం అనిపించుకునేట్టు ఆమె తయారైనది. వివాహం సంకల్పించారు. చదువు ముగించి, గురుదక్షిణ యిచ్చి అంతఃపుర ప్రవేశానికి గురువనుజ్ఞ కోరి ఆమె గురువుగారింటికివచ్చి, పంచలచాపులూ – ఉత్తరీయాలు, దుశ్శాలువలు, రజితపాత్రలూ, స్వర్ణాభరణాలు అన్నీ పట్టించుకొనివచ్చి, దక్షిణ తాంబూలాలు ఇచ్చి, నమస్కరించి సెలవు అడిగింది. చేతులు జోడించి, నిలబడిఉన్నది. గురువుగారు వృద్ధులే–అయితేనేం? దశరథుడు, కైకను చూసి కరిగి ద్రవించిపోయాడు. రాజపుత్రిక సౌందర్యముకు వశుడై, తన అభిప్రాయం ఆమెతో చెప్పే ధైర్యం చాలక గురువు గుక్కిళ్లు మింగుతున్నాడు. బాలికామణి విశాల హృదయం కలది. "గురువరా? మీ మనస్సు ఎందుచేతనోగాని సంతుష్టి చెందలేదు. దక్షిణ చాలలేదా? వస్త్రాభరణములు బాగులేవా? దేనిమీదనో మీకు అభిలాష కలిగినట్లు కనపడుతున్నది. సంశయించక మీ అభీష్టం నాకు ధారాళంగా విప్పి చెప్పండి – ఏమైనా, ఎట్టిదైనా, చేకూరుస్తాను" అని ధైర్యం చెప్పింది; నొక్కి అడిగినది. మిమ్మలరించినగాని అడుగు కదలనని భీష్మించినది. "బాలికామణీ! నా కోరిక అసందర్భము. క్షమింపరాని దోషము. కాముడతి క్రూరుడు, వావివరుసలు తెలపనీయడు. "బలవానింద్రియగ్రామో, విద్వాంస మపి కర్షతి"కి, నేను ఉదాహరణ. కాముడు దురాసదుడు. అదీ, నా దురవస్థ" అని ఊరుకున్నారు. "ఓహో! గట్టితంటానే! ఐనా, నేర్పుగా సాధించా"లి శీలభంగం కాకుండా, అన్యతదోషం అంటకుండా, తప్పించుకురావాలి" అని ఆలోచించుకొని, "గురువర్యా! దీనికి సంశయం అక్కరలేదు. అయితే – నేనిప్పుడు కన్యను. తల్లిదండ్రుల చాటుదానను; స్వతంత్రం లేదు; నాన్నగారితో చెబితే, ముందు మీకు ప్రాణభంగం. తరువాత నన్నేం జేస్తారో...కొన్నాళ్లు తాళండి. కొద్దిరోజులలో నాకు పెండ్లి అవుతుంది; భర్తగారి అదుపు ఆజ్ఞలలో వుంటాను; కార్యం నాటి రాత్రి ఆయనసెలవు పొంది, మీతావుకు వచ్చి, మీ అభీష్టం నెరవేరుస్తాను. అప్పుడు నాకు ఏ దోషమూ అంటదు; మీ కోరికా నెరవేరుతుంది; ఉభయ తారకంగా ఉంటుంది ... అలాగ అనుగ్రహించి, ఇప్పటికి సెలవిచ్చి పంపండి" అంటే అంతఃపుర ప్రవేశానికి అనుజ్ఞయిచ్చి గురువుగారు భద్రావతిని పంపించారు.

2

మహారాజావారి కులగౌరవ సాంప్రదాయాలకూ, దర్జాకూ అన్నివిధాలా సరిపడ్డ సంబంధం – మరొక మహారాజకుమారునితో రాజకుమారి భద్రావతికి వివాహం నిశ్చయం అయింది; వరుడుకూడా – విద్యావంతుడు, స్ఫురద్రూపి, బుద్ధిమంతుడూ, రాజయోగ్యములైన శస్త్రాస్త్ర ధనుర్విద్యలన్నీ అభ్యసించిన పరాక్రమశాలి; విద్యా సంస్కార సౌరభాలతో, ప్రీతిపాత్రుడుగా ఉన్నాడు. జనకుడూ, దశరథుడూ వియ్యం అందినట్లు, మహారాజులు సంబంధాలు కలుపుకున్నారు. వివాహం చూచినవాళ్లంతా, పెండ్లి సలక్షణంగా జరిగిందనీ, సీతారాముల కల్యాణం లాగ సకల ప్రమోదకరంగా ఉందనీ శ్లాఘించారు.

అడుతీర్చాలని శుభముహూర్తం నిర్ణయించి, శోభనంచేసి కులాచార ప్రకారం నూతన దంపతులను శయనమందిరంలో ప్రవేశపెట్టేరు. సంపూర్ణ యౌవనవతి, చక్కని చుక్కను – భార్యను చూచి భర్త ఉప్పొంగుతున్నాడు – కాని ఎంత లాలించి పిలిచినా, తలవంచుకొని, జాలిగా నిలబడినదికాని, అనుకూలంగా భర్తను అలరించలేదు. ఆమెకు గురువుగారు ఎదుట కనబడుతున్నారు. గుండె బరువుగాఉన్నది – తేలికలేదు. తన మనస్సులోమాట ఆయనకు ఎలా చెప్పవలెను? విని వారేమందురో? కొంపదీసి – శీలం శంకిస్తే భవిష్యత్తు భగ్నమూ– పాడూ కాకతప్పదు. బుద్ధిమంతుడు – హనుమంతుడు చెప్పినట్లు– నేను కామించి పాపచింతతో గురువును కోరలేదు; శరీర సౌఖ్యంకోసం అతనిపొందు వాంఛించలేదు. నా నైర్మల్యం హనుమత్సమేతులు సీతారాములే ఎఱుగుదురు. వారే నన్ను అన్యతదోషం అంటకుండా, శీలభంగం వాటిల్లకుండా రక్షించగలవారు" అనుకునేసరికి ఒక్కమారు ఉత్సాహం పొందింది; వధువు భర్తపాదాల

★ ఆ గజదొంగ ఎవరు? ★

మీద వ్రాలినది. వ్రాలిన ముద్దుగుమ్మను భర్త ఎంతో ప్రేమతో ఎత్తి, లేవదీసి, హృదయమునకు అత్తుకొని, తలనిమిరి, బుగ్గలంటి చుబుకము పైకెత్తి, కండ్లలోనూటిగా చూస్తూ "ప్రేమా? నీమనస్సు స్థిమితములేక సంక్షోభిస్తున్నది; నీకేమి కావలసినా అడిగి పుచ్చుకో; ఇస్తాను; గుండెపదిల పర్చుకో, నీవు సుఖించి నాకు సుఖమివ్వు" అన్నాడు. ఆమె చేతులు జోడించి, వివాహాత్పూర్వము గురునితో తాను చేసుకొనిన నిర్ణయము నెఱవేర్చి, అనృత దోషము అంటకుండ రక్షింప వేడుకొన్నది. ఆమె హృదయ నైర్మల్య, ధారాళ ప్రసంగములకు ప్రీతుడై "సత్యవతీ! వెళ్లు! గురుని ప్రీతునిచేసి, నీవు ధన్యవై నన్ను ధన్యుని చేయు"మని అనుజ్ఞ యిచ్చాడు.

సమస్తాభరణములు ధరించి, నిలుకడగన్న మెఱుపులాగున, ఘల్లు ఘల్లుమనుచు నడచి వచ్చు నా సతీమణిని చూచి, చోరులడ్డుపడిరి. అడ్డి, ఆపి, నిలిపి "ఆగు! మేము దొంగలము! నీ ఆభరణములన్నీ ఒల్చి ఇక్కడపెట్టి, మరి కదులు" అని గర్జించారు. రాజకుమారి ఏమీ సంకోచించలేదు. "అన్నలారా! నేను పుట్టినప్పుడు నాతో ఈ అలంకారములు తేలేదు. పోయేటప్పుడు ఇవేవీ - ఆఖరుకు ఒక పుచ్చిన వక్క-నా- నాకూ డారావు. జగన్నాటకంలో మూడురోజుల మధ్యాన్నం బ్రతుకులో - ఎప్పుడు, ఎక్కడ ఎవరికి ఏది రావాలో అదివస్తుంది; ఏది పోవాలో అది పోతుంది - వచ్చినప్పుడు సంతోషంతో పొంగావద్దు పోయేటప్పుడు దుఃఖపడి యేడవావద్దు - నాకు మీరు ఇవితీసుకుంటారని విచారంఏమీ లేదు - నేను పూర్వం చేసిన ఖరారుప్రకారం, గురువుగార్ని సంతోషపెట్టాలని వెళుతున్నాను. అందుకు నా ప్రాణేశ్వరులను మతించారు. దీపపు సెమేలాగ అలంకారాలు లేకుండా వెళితే బాగుండదు; రెండడుగులు వెళ్ళి గురువు అభిలాష తీర్చి, ఈదారినే వచ్చి నా మంగళసూత్రం, కుత్తుకంటు, చెవులకమ్మలూ - ముక్కు అడ్డబాస, చేతుల కంకణాలు - కాళ్ళ అందెలూ - ఐదువ మాంగల్య లక్షణాలు తప్ప తక్కిన జవాహిరీ అంతా మీరు తీసుకోండి" అన్నది.

ఆమెమాటలు విని చోరులు మరేమీ మారు చెప్పలేకపోయారు - "అలాగే! వెళ్ళిరా, అమ్మా!" అన్నారు.

రాజకుమారి ఝుణ ఝుణాత్కారాలతో గురువుగారింటికి వెళ్ళి తలుపుపిలిచిలేపి "గురువర్యా!. సద్భావులైన నాభర్తగారు మీ కూటమి నంగీకరించి నన్ను పంపించినారు. మీరు మీ అభీష్టము నెరవేర్చుకొని నన్ను త్వరలో తిరిగి పంపండి; నేడు మా శోభనపు రాత్రి; వారు నాకోఅకు ప్రతీక్షిస్తూ వుంటారు" అని త్వరపెట్టినది. గురువుగారు దిగ్భ్రమచెంది, "అమ్మా! లోగడ నాకు దుర్బుద్ధి పుట్టి నీ సమాగమము వాంఛించిన సంగతి నిజమే. కాని తరువాత, పుత్రికాసమానురాలవు, శిష్యురాలవు నైన నిన్ను కూడుట మహాద్రోహము - ఘోర పాపమని పశ్చాత్తాప పడుచున్నాను - నీవు నాకు ఆడపడుచువు. పసుపు, కుంకుమ, పండ్లు ఫలములు, చీరె, సారె, వస్తువాహనములు పెట్టి నిన్ను ఆశీర్వదించి పంపుదామన్న ఆలోచన తప్ప నాకు పాపాసక్తి లేదు. శోభన పరంపరా ప్రాప్తిరస్తు; పుత్ర పౌత్రాభి వృద్ధిరస్తు; సౌభాగ్యవతీ భవ" అని ఆశీర్వదించి వీడ్కొలిపెను.

బ్రతుకుజీవుడా అనుకొని రాజకుమారి తొందరగా అడుగులు వేయుచు చోరగృహమున నడుగు పెట్టింది.

3

"రండి! అన్నలారా! చప్పున రండి! మీకిచ్చేస్తానన్న ఆభరణాలు త్వరగా తీసుకోండి! గురువుగారు నన్ను పుత్రికాప్రాయంగా చూచుకొని, నన్నుమన్నించి, చీర - సారె-పసుపు కుంకుమ, పండ్లు ఇచ్చి వీడ్కొల్పినారు. ఈ రాత్రి మా శోభనపు రాత్రి; భర్తగారు నాకోసం ప్రతీక్షిస్తున్నారు. చప్పున రండి! మీ వస్తువులు మీరు తీసుకొని నన్ను పంపించండి" అని కంటె, ఒడ్డాణము, కాసులపేరు — చంద్రహారములు ... చప్పుచప్పున తీసిపెట్టి "రండి! రండని దొంగలను తొందర చేస్తున్నది.

దొంగలు అడ్డగించినప్పుడు — లోకంలో

రోజూ హోటలు భోజనం చేస్తూ, పదార్థాలేమీ బావుండక విసుగెత్తిపోయిన ఒక ఆసామి ఒకరోజున సర్వరుతో ఇలా అన్నాడు: "నేను చాలరోజుల్నించీ చూస్తున్నాను, ఆ మూల కూర్చున్న పెద్దమనిషికి మంచి మంచివన్నీ వడ్డిస్తున్నారు. నాకుచల్లారిపోయినవీ, ఉడికీ ఉడకనివీ పడేస్తున్నారు. ఏమిటీ అన్యాయం? నేను మేనేజరుతో చెప్పదలచుకున్నాను "

"మంచిదిసార్," అన్నాడుసర్వర్.

"మీ మేనేజరెక్కడుంటారు?"

"ఆమూల కూర్చున్నాయనేసార్," అన్నాడు సర్వర్.

స్త్రీలు గోలుగోలున యేడ్చుచుండు రేగాని రండి, తీసుకోండి అని దొంగలనే త్వరపెట్టే స్త్రీ రత్నమును ఇంతవఱకు దొంగలు చూచిలేరు—ఇటువంటివారిని చూడలేదు. ఈ వింతకు దొంగలుకూడ నిశ్చేష్టులై నిలిచి "ఈమె, మానవ స్త్రీ కాదు. ఏదో దేవత, కనకదుర్గ" అని భావించి, "తల్లీ! నీవు మాకుకూడా ఆపె పకుచువే! నీ సొమ్ములు మా కేమీవద్దు, నీవే ఉంచుకో! అని పసుపు కుంకుమతో అరటిపండ్లు ఆభరణములు ఆమెకు సంచితో చేతి కందిచ్చి "తల్లీ! ఇవి తీసుకొని, సంతోషించు! నీ సంతోషము మాకు జయము" అని యామెను వీడుకొల్పిరి.

వాయువేగ మనోవేగాలతో ఆమెకోట ఉత్తరపు వేపు వంక నడిచి, తొందరగా మెట్లెక్కి, శోభనపుగదిలో ప్రవేశించి, తలుపు గడియవేసి, ఆనంద బాష్పములు రాల భర్తగారి పాదములకు నమస్కరించినది. "దేవా! ప్రాణేశ్వరా! తమకు నాయందు గల ప్రేమ, విశ్వాస గౌరవములు అప్రతిమపూర్వములు. కాబట్టి మనకు సర్వసౌభద్రమైనది. మీరు తప్ప, లోకములో, ఏ శోభనాల్ పెండ్లికొడుకు, ప్రథమసమాగమం వేళ—తన భార్యను నమ్మి—పర పురుష సమాగమానికి కూడా ఒప్పుకొని ఇలాగ పంపేస్తారు? భగవత్కృపవల్ల—శీలభంగం కాకుండా, సత్య వ్రతం చెడకుండా—ప్రాప్తి ఫలముతో తిరిగివచ్చినది — హనుమత్ సమేత సీతారాములను నమ్మి చెడినవా రెవరూ లేరు" అని ఉభయులూ—ఇష్ట దేవతలకు మ్రొక్కి. ఆనంద బాష్పాలు రాలుస్తూ, ఒకళ్ళొకళ్ళ కౌగిళ్ళలో పెనవేసుకొన్నారు—పురుషోత్తము కరస్పర్శతో గజేంద్రుని శరీరం సుఖపడ్డట్లు, స్వకీయ పురుషస్పర్శతో భద్రావతి దేహ మనోరుజలన్నీ మాయమయినవి! ఎంత బాధపడ్డదో ఆమె అంతసుఖించినది ఆమె చిత్ర కథ విన్నవాళ్లు కూడా "హాయి హాయి!" అని మెచ్చుకున్నారు."

4

"సోదర సోదరీ మణులారా! పూజ్య సభాసదులారా!

మీరు ఇప్పుడు పుణ్యశ్లోకులైన నలుగురు మానవుల చరిత్ర విన్నారు. పైని వివరించినది యదార్థంగా జరిగిన కథగాని, నేను కల్పించి చెప్పిన కథ కాదు.

అయితే ఈ నలుగురిలో, బాగా విమర్శించి, ఆలోచించి చూడగా, ఉత్తమోత్తమము, మిక్కిలి శ్లాఘ్యము అయిన పాత్ర యెవరిదని మీమనస్సుకు అనుతుందో, వారి పేరు వ్రాసి, దిగువ మీ సంతకం చేసి, మీకు ఇప్పుడే అందజేసే తెల్ల కాగితంమీద లిఖించండి. మీ అభిప్రాయములకు హేతువులనుకూడా, ఇష్టమైనవారు 1-2 వాక్యములలో సంగ్రహంగా ఉల్లేఖించ వచ్చును. సభాభిప్రాయప్రకారం ఉత్తమమైన విమర్శకు ఒక లక్ష రూపాయిల వఱకూ బహుమతి కూడా లభించవచ్చును" అని కూడా కథకుడు, రాజానుమతిని ప్రకటంచెను.

సభలో ఒకొక్కరికి పావుటావు—పావుటావు చొప్పున తెల్లకాగితములును, వ్రాయుటకు లేఖినులును అందియ్యబడినవి "ప్రక్కవారిని, పైవారిని అడగకుండా ఎవరికి స్వయంగాతోచిన అభిప్రాయం వారే వ్రాయవలసిన" దనికూడా సభికులకు విన్నవింపనైనది.

సభికులలో స్త్రీలు రెండువందల ఏబది మంది ఉన్నారు - వాళ్ళందరూ - రాజపుత్రిక - భద్రావతి - శీలము ఉత్తమోత్తమమైనదనీ-అద్భుతమనీ ప్రశంసించి వ్రాశారు.

మగసభికులలో కాలముగడిచిన వృద్ధులంతా గురుశీలమును మెచ్చి ప్రశంసించారు. ఆప్రకారమే వ్రాసియిచ్చారు. ఆ సమ్మతుల సంఖ్యకూడా—250 య్యే. యువక సభికులందరూ భర్తపాత్రను మెచ్చుకొని ప్రశంసించి వ్రాశారు. ఈవిధంగా 750 అభిప్రాయాలు వ్రాయబడినవి - భర్తప్రశంస, భార్యాప్రశంస, గురుప్రశంస, అన్నీ సంఖ్యలో సరిసమానంగా వున్నవి

మరొక్క కాగితము మిగిలినది - అది రాజకుమారుళ్ళలో మధ్యవాడు వ్రాసి యిచ్చినది. ఈ కథలో మిక్కిలి ప్రశంసింపతగినవారు చోరులు. ఏమంటే చేతికందిన సొమ్ములూ-ఆభరణాలూ ఏ చోరుడూ విడిచిపెట్టలేడు-కథలో వీళ్ళు విడిచిపెట్టారంటే అది లోకోత్తరమున్నూ, మిక్కిలి ప్రశంసాపాత్రమున్నూ; కనుక నేను వాళ్ళని మెచ్చుకుంటాను" అని సేవకుడు వ్రాశాడు.

సభలోనుంచి ఎవరూ కదలకూ వదలక రాజభటులు గంభీరంగా ఉరిమి రాజాజ్ఞ కోసం ప్రతీక్షిస్తున్నారు. మహారాజా వారూ, న్యాయాధీశుడూ, మంత్రి కొత్వాలు - మంతనం చేశారు

పిమ్మట న్యాయాధీశుడు తన స్థానం అలంకరించి, రాజకుమారులలో మధ్యవానిని పిలిచి, ఇలాగన్నాడు: "రాజకుమారా! దొంగలూ, దోషులూ ప్రకృతిబద్ధులైన మానవులు కావడంచేత, తమ దోషములను తామే ప్రకటించుకోనిదారికి పోతారు చిత్రం ఏమిటంటే తమ నేరము తామే బయటపెట్టి ప్రకటించుకుంటున్నామని గ్రహించుకోలేరు. ఈ విషయమే శ్రీకృష్ణభగవానులు భగవద్గీత కడపటి శ్లోకాలలో చమత్కారంగా సెలవిచ్చారు. "స్వభావజేన కౌన్తేయ నిబద్ధస్స్వేన కర్మణా। కర్తుం నేచ్ఛసి యన్మోహాత్ కరిష్యస్యవశోఽపి తత్." ఎంత మరుగున దాచినా, ఎలకను చూస్తూనే పిల్లిపసిగట్టక మానదు

ఏ తావాతా, నీ నైజం నీ చేత చోరులను శ్లాఘింపచేసింది; రాజముద్రిక అపహరించినవాడవు నీవే! ఆర్భాటములు అక్కరలేకుండా—మర్యాదగా—రాజముద్రిక ఇచ్చివేసి రాజ్యపరిపాలనకు తోడుపడమని నిన్ను కోరుతున్నాము."

అని న్యాయాధీశుడు అడుగగా—ఆ రాజకుమారుడు, చిఱునవ్వు నవ్వి, జేబులోనుండి రాజముద్రికను తీసి, న్యాయాధీశునకు అందిచ్చాడు. అల్లరులు, చికాకులు లేకుండ ముద్రిక చేతికి వచ్చినందుకు మిక్కిలి సంతోషించి, మహారాజావారు కథకుని మిక్కిలి ప్రశంసించి వేయిన్నినూట పదహార్లు, దుశ్శాలువలు ఇచ్చి బహూకరించిరి.

ఈ గజదొంగ వ్యవహార మింత సులభముగా తేల్చినందుకు ముఖ్యులైన రాజకీయోద్యోగులు ఒక్కొక్కరు నూట పదార్లిచ్చి కథకుని గౌరవించారు. ★

ఓడిపోయిన పాప

నిష్ఠల బ్రహ్మాజీ

‘అమ్మా! అమ్మ యిలా రావే. ఒక్క సారి యిలా రామ్మా!’ దీనంగా మొహం పెట్టి ప్రాధేయపడుతూన్నట్టు పెరట్లో నించుని కేకేసింది ఆరేళ్ల పాప.

ఎందుకో అని ఆలోచించకుండానే వెళ్ళింది అమ్మ.

‘ఏమిటే అమ్మా యిది.’ పెరట్లో గోడ వారన కొత్తగా మొలిచిన ఒక జానెడు మొక్కను చూపెడుతూ ఆశ్చర్యంగా అడిగింది పాప.

అమ్మ నవ్వింది.

‘ఇందుకా; ఏదో పెద్ద రాచకార్యం మించిపోతూన్నట్టు గావుకేక పెట్టావు. అదేదో మొక్క’ అని విసుగ్గా అనేసింది అమ్మ.

‘మొక్కంటే ఏం మొక్క?’ అని మళ్ళీ ప్రశ్నించింది పాప.

‘ఏం మొక్కో. నాకుమాత్రం ఏం తెలుసునే ఏదో గడ్డిమొక్క’ అంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది అమ్మ

పాపం, పాప మొహం చిన్నబుచ్చుకుంది ఆ మొక్కను మొటమొదట చూసినప్పుడే పాప చిన్ని మెదడులో అనేక ఆలోచనలు అల్లుకున్నాయి. నిజంగా అదే ఏదో పూలమొక్క యితే!......రాధావతీ వాళ్ళింట్లో పెద్ద పెరడుంది. వాళ్ళింట్లో ఎన్నో పూలచెట్లున్నాయి. తనింట్లో ఏ మొక్కలూ లేవు. మొక్కలు తెమ్మని ఎంత మొత్తుకున్నా అన్నయ్య తనమాట వినడు. అమ్మకూడా యింట్లో జాగా లేదని తిడుతుంది. రాధావతి రోజు కొకరకం పువ్వులు పెట్టుకొస్తుంది. ఏవేవో కొత్త కొత్త పేర్లు చెపుతుంది. అందర్నీ వూరిస్తుంది. వాళ్ళింట్లో యెన్నో మొక్కలున్నాయని దానికెంతో గర్వం......నిజంగా యిది కూడా కొత్త పువ్వుల మొక్కయి కొత్తరకం పువ్వులు పూస్తే...రాధావతి గర్వం అణిచేయొచ్చు. కాని ఛీ...అమ్మ ఎప్పుడూ యింతే. ఏదడిగినా తేలిగ్గా తోసిపారేస్తుంది. అన్నయ్య నడిగితే సరి...అనుకుని అన్నయ్యదగ్గరకు పరిగెత్తింది పాప.

‘అన్నయ్యా! నీకో తమాషా చూపిస్తాను రా అన్నయ్యా’ అంటూ అన్నయ్యను మొక్క దగ్గరకు తీసుకు వెళ్ళింది పాప.

‘ఇదేం మొక్క అన్నయ్యా’. పాత ప్రశ్నే వేసింది.

‘ఓస్ యిదా తమాషా’ అన్నట్టు మొహం ముడుచుకున్నాడు అన్నయ్య.

‘ఏమో నాకూ తెలీదే. ఏదో పువ్వుల మొక్కే అయుంటుంది’ అన్నాడు.

దాంతో పాపకు మొక్కమీద మోజు మరీ ఎక్కువయింది. అమ్మనడిగితే అమ్మకూ తెలియదన్నది. అన్నయ్యకూ తెలియదంటున్నాడు మరి. పైగా అదేదో పువ్వుల మొక్కే నంటున్నాడు. అంచాత యిదేదో కొత్త రకం పువ్వుల మొక్కే అయుంటుంది అనుకుంది పాప. అయినా వూరుకో లేదు. నాన్నని పిల్చి నాన్నకు చూపించింది అక్కయ్యను పిల్చి అక్కయ్య కూడా చూపించింది. అక్కయ్య కూడా అదే అన్నది. దానికీ ఆ మొక్క పేరు తెలియదుట. కాని పువ్వులుంటాయని చెప్పింది... ఇలాంటి మొక్క రాధావతీ వాళ్ళింట్లో వుంటుందా? ఎందు కుంటుంది; ఎలా వుంటుంది? ఆ మొక్క తనింట్లోనే మొట్టమొదట పుట్టింది తనే అందరికన్నా ముందు చూసింది ఈ మొక్కను గోలెంలో వేసి చక్కా పెంచుతే పెద్దదై పువ్వులు పూస్తుంది. అప్పుడు దానికో కొత్త పేరు పెట్టి రాధావతికి చూపిస్తే; అప్పుడు దాని సంగతి చూడాలి! తెగ వుడుక్కు చస్తుంది ఒళ్ళో పిల్లలంతా పువ్వులకోసం ఆమె వెంట తిరగడం మానేసి తన జట్టు చేరతారు. అనుకుంటూ అమ్మ దగ్గరకు పరిగెత్తింది పాప

‘అమ్మా నాకో గోలెం కొనిపెట్టవే’ అమ్మ నడిగింది పాప.

‘గోలెం కేనికే డబ్బులేవు పో’ అన్నాది అమ్మ.

పాప కళ్ళల్లో కోపం జీరాడింది. అమ్మ మీద ఎంతైనా కోపం వచ్చింది.

తన పువ్వుల మొక్కకి-ముద్దుకైన తన పువ్వుల మొక్కకి గోలెం లేక పోతే యెలా?...

‘అహా! అయితే నేనిచ్చే అన్నంతినను తలదువ్వకోను, నీళ్లు పోసుకోను. మానుకో మరి...’ అంటూ ఎవరినో వుద్ధరించడానికి యివన్నీ అన్నట్టు బెదిరించింది పాప.

అమ్మ మాత్రం వూరుకుంటుందా?

‘రక్షించావు నాకు చాకిరీ తప్పుతుంది. మానెయ్,’ అన్నది.

‘అయితే ఏడుస్తాను’ అంటూ ఏడుపు లంకించుకుంది పాప.

ఈ ప్రయోగానికి మాత్రం అమ్మ తట్టుకో లేక పోయింది.

‘చెరిలో జోరీగలా ‘గీ’ పెట్టకు తల్లీ. వెళ్ళి మీ నాన్నని డబ్బులడుగు’ అన్నాది.

పాప కిలకిలా నవ్వింది. రివ్వున నాన్న దగ్గిర వాలింది. చేయవల్సిన మారాం చేసి డబ్బులు సంపాదించింది. పనిమనిషి చాత ఓ చిన్న గోలెం తెప్పించి, అక్కా తనూ కలిసి మొక్కను ఆ రోజునే గోలెం లోకి మార్చేశారు. ఒక పూట మాత్రం మొక్క కొంచెం వాడినట్టయింది పాపం! పాప మొహం కూడా ఆ పూట వాడిపోయింది. మొక్క చస్తుందేమోనని బెంగపెట్టుకుంది. కాని మర్నాటి ఉదయానికల్లా, మొక్క మాంచి వుషారుగా నిగనిగలాడుతూ నించుంది. పాప ఆనందంతో పొంగిపోయింది: కూనిరాగాలు తీస్తూ ముద్దులగా గోలెం నిండా నీళు పోసింది పాలదాన్ని బ్రతిమలాడి మేకగెత్తం తెప్పించి వేసింది. అప్పటి నించీ రోజల్లా మొక్క సంరక్షణతోనే పాపకు కాలక్షేపమయ్యేది.

కొన్నాళ్ళకి మొక్క పెద్దదై కొమ్మలు రెమ్మలూ వేసి చక్కా గుబురుగా విస్తరించింది. దాంతోపాటే పాప ఆలోచనలు కూడా అధికమయ్యాయి ‘ఈ మొక్క పేరేమిటి? ఏం పేరు పెట్టడం?’ అని రాత్రింబగల్లు అదేపనిగా ఆలోచిస్తూండేది ఆ సమస్యతోనే అమ్మనీ. అక్కనీ కూడా వేధిస్తూండేది ‘ఏదేం చెప్పమంటావు! పువ్వులయినా పూయనీ చెప్తాను,’ అనేది అక్క ‘నే చెప్పేదేమిటి! నీకే తెలుస్తుందిలే’ అనేది అమ్మ.... ఇలా కొంతకాలం గడిచింది నవంబరు నెల ప్రవేశించింది. ఒకనాటి వుదయం వున్న పాటున చెట్టు మొగ్గ తొడిగి ఎర్రని పూవు పూసింది.

పాప ఆశ్చర్యానికంతు లేకపోయింది ..

‘హాయ్ హాయ్ పువ్వు పూసింది. తన చిన్ని మొక్క ఎంచక్కా పూసింది! ఇన్నాళ్లకి!

పల్లెటూరినుంచి వచ్చిన ఒకడు తన స్నేహితుడితో చెన్నపట్నం బజారులో సాయంకాలమప్పుడు నడుస్తూ నడుస్తూ "అరె, ఇక్కడెక్కడో కీచురాయి 'గీ' పెడుతోంది" అన్నాడు.

"ఏతీశావ్, ఇంత సందడిలో నీకు కీచురాయి అరుపు వినిపిస్తుం దేమిటి? ఏదోవిని కీచురాయి అనుకున్నావేమో" అన్నాడు స్నేహితుడు

"కాదు, కాదు, నాకు స్పష్టంగా వినిపిస్తుంటేనే. ఆగు, చెబుతా" అని పల్లెటూరివాడు జేబులోంచి రూపాయి తీసి పేవ్‌మెంట్ మీద ఖంగుమనేట్టు పడేశాడు

చుట్టుపక్కల నలభై అడుగుల దూరంలో ఎవరిపనిమీద వారు వెడుతున్న జనాభా యావత్తూ రూపాయి పడినవైపు చూశారు.

"నేను చెప్పలా, ఎవరికి ఏది అలవాటైతే అదే వినిపిస్తుంది మిగతావి వినిపించవు" అన్నాడు పల్లెటూరువాడు.

నవంబరు నెల రాగానే పూసింది పాప చిన్ని మెదడు ఒక్కసారి ఆలోచనలతో నిండిపోయింది. ఆమె ఆలోచనలకొక చక్కని పేరు స్ఫురించింది. బలే తన అందాల మొక్కకు అందమైనపేరు! పెద్ద అన్వేషణ సాగించి విజయంపొందిన దానిలా అంతులేని ఆనందంతో గంతులేసింది పాప.

'మొక్క పేరు తెలిసింది. తెలిసిందినాకు; నవంబరు మొక్క నవంబరు పూలు' అంటూ పకపకా కిచకిచా నవ్వుకుంది

'ఏమిటమ్మా అలా పొంగిపోతున్నావు' అన్నారు నాన్నారు.

'నా మొక్క పువ్వుపూసింది నాన్నా. ఎంచక్కా పూసిందనుకున్నావ్. చూడు మరి.' అంటూ నాన్నకు పువ్వు చూపించింది.

'అలాగా' అన్నారు నాన్నారు పూవువైపు చూసి.

'దానిపేరుకూడా తెలిసింది నాన్నా నాకు. ఆ పేరేమిటో చెప్పనా ' అన్నది పాప గొప్పగా.

నాన్నారు నవ్వుతూ పాపను యెత్తుకుని ముద్దు పెట్టుకున్నారు.

'చెప్పమ్మా చెప్పు. ఏమిటా పేరు?' అన్నారు

'నవంబరు పూవు నాన్నా. నవంబరుపూవు' జౌనా?' అన్నది నాన్న చేతుల్లోంచి క్రిందికి జారుతూ.

ఆమె చెప్పింది కాదనగల ధైర్యం నాన్నకు లేకపోయింది.

'ఔనమ్మా! అదే,' అన్నారు పాపను క్రింద దించుతూ.

పాపకు ఆరోజు పర్వదినంలాగా తోచింది. అమ్మనీ అక్కయ్యనీ అన్నయ్యనూ-అందర్నీ ఒక్కసారి పెరట్లోకి యీడ్చుకెళ్ళి మొక్కని, దాని ఆకుల్లో మెరిసే పువ్వునీ చూపెటింది. తను కనిపెటిన పేరుకూడా వాళ్లకి చెప్పింది అంతా నవ్వుకుని పూరుకున్నారు ఇంక, మిగిలిపోయిందల్లా బళ్ళో పిల్లలు మాత్రం. ఆరోజు పాప అందరికన్నా ముందుగానే బళ్ళో హాజరయింది. పంతులుగారు పాపచేతుల్లో సిరిమట్టారు. కాని పాప ముందుగా వచ్చింది అందుకోసం కాదుగా. నేస్తాలందరికీ తన మొక్క సంగతి చెప్పేవరకూ మహా ఆత్రుతగా వుంది రాధావతి మాత్రం ఆపూట బడికి రాలేదు.

'ఒసే లలితా, ఒసే రాజేశ్వరీ, శాంతా, కమలా-అందరూ రండర్రా. మీకో మాంచి సంగతి-బలే సంగతి చెప్తాను రండి, రండి' అంటూ అందర్నీ దండోరా వేసి పిలుచుకొచ్చింది.

'ఏమిటే పాపా; ఆ బలే వార్త? ఏమిటో చెప్పుమరి' అంటూ అందరూ పాప చుట్టూరా జేరారు. పాపకు మహా గర్వం వేసింది.

'చెప్పనా, చెప్పనా, చెప్పమంటారా' అంటూ మరీ వూరించింది.

'చెప్పేతే వేగం చెప్పు మరి. మనమిలా గుమికూడడం పంతులుగారు చూశారంటే పేము బెత్తానికి పని తగుల్తుంది.' అన్నాది అందర్లోనూ కాస్త పొడవుగా వున్న రాజేశ్వరి

'చెప్పవేపాపా మరి చెప్పమంటూంటే,' అంటూ అందరూ ఒక్కసారి ప్రాధేయపడ్డారు.

దాంతో పాప కూడా యిక వుండబట్టలేక పోయింది.

'మా యింట్లోనర్రా ఒక కొత్తరకం - సరికొత్త రకం పువ్వులమొక్క చక్కని పువ్వు పూసింది అలాంటిపువ్వులమొక్క, అలాంటి పూలు యీ వూళ్లో యీ దేశంలో, ప్రపంచంలో కూడా ఎవ్వరి యిళ్ళల్లోనూ మరి వుండవు తెలుసా! మరేం ఆ మొక్క మాయింట్లో దానంతటదే పుటింది ' అన్నాది పాప

లలిత, కమల, రాజేశ్వరి ఆశ్చర్యంగా పాప ముఖంలోకి చూశారు

'నిజమేనటే' అని అంతా ఒక్కసారే అడిగారు.



కడలేని కడలి

[సి. నారాయణరెడ్డి]

ఏమి పల్కుదును నా దేపాటి గొంతు ని
స్తంద్రమ్మగా మ్రోగు సంద్రమ్ము ముందు?

ఒక రెండుమార్లు గొంతుక నెత్తితినో లేదొ
విమల గాంధర్వమ్ము పీగిపోయిన దనిరి.

ఒక రెండుతీర్ల గీతిక లొత్తితినో లేదొ
వాగ్దేవతకు మోము వాలిపోయిన దనిరి.
విశ్వమానవుల నిర్వేద వేదధ్వనుల
వినిపించు రత్నాకరుని ముందు నే నెంత?

బడబాగ్నులను గుండె యెడిలోన ముడుచుకొని
జల చామరముల విశ్వంభరను లాలించు
శివమెత్తికొనుచు వచ్చెడు వేదనోర్మికల
నొక మహాయోగి పోలిక నిగ్రహము సేయు
కడలి కెదురుగ నిలంబడినపుడు నేను వె
ల్వెలవోదు తెలవారువేళ దివ్యయలీల

తన తనువు నుప్పునీటను నిల్పి లోకాల
కలనాడె అమృతాంశు నర్పించినది కడలి.
బీజాత్మకమ్మైన పృథ్వి సాహస్రదళ
పద్మ మగుటకు కడలి ప్రత్యక్షమగు సాక్షి.

కడలి తరగల యౌగికముగ నాలోకింప
కనిపించు లిపికందగాలేని కావ్యాలు.
కడలి తరగలలోన యెడదల బ్రతిష్ఠించ
వినుపించు మహతికందని దివ్యనాదాలు

ఓడిపోయిన పాప

'ఊం. అబద్ధాలు చెప్పడానికి నాకేం పట్టింది. కావలిస్తే మీరంతా సాయంత్రం మా యింటికి రండి. చూపిస్తాను.' అన్నాది పాప దర్జాగా.

'అయితే అలాంటి మొక్క రాధావతీ వాళ్ళింట్లో కూడా లేదు లే!' అమాయికంగా అడిగింది కాంత. పాపకు పట్టరాని కోపమొచ్చింది.

'ఛెస్ చెనిటి మాలోకమా! అసలు ప్రపంచంలో నే యింకెక్కడా వుండదంటూం టే; రాధావతి ఏమైనా దేవతా! దాని మొహం! దాని కెక్కడిదీ? వాళ్ల నాన్న కూడా తేలేడు అలాంటి మొక్క' అన్నాది గర్వంగా, మహా పొగరుగా.

'అయితే చూడవల్సిందే, సాయంత్రం అందరం కలిసి వెళ్దామర్రా. రాధావతిని కూడా పిలుచుకెళ్దాం' అంది రాజేశ్వరి.

అందరూ వెళ్దామంటే వెళ్దాం చూద్దాం అని గంతులేశారు. ఆ పూటల్లా రకరకాల ప్రశ్నలతో పాపను వేధించుకు తిన్నారు. వాళ్లు. పాపకి మరీ ఏదో అఖండ రాజ్య పదవి అబ్బినట్టనిపించింది. వాళ్లు ఒకటడిగేసరికి తను పది ఏకరూ పెట్టింది.

'అయితే ఆ మొక్క పిల్లల్ని పెడుతుందా మరి.' అన్నాది ఒకమ్మాయి.

'ఓ కొల్లలుగా పెడుతుంది. అసలందికే మా నాన్నతో చెప్పి ఒకపాలం కొనిపించి దాన్నిండా పెద్దతోట నాటించుదా మనుకుంటున్నాను. అప్పుడు మీకూ కావాలంటే పిల్లల్ని యిస్తాను లెండి' అన్నాది పాప, గుడ్లు గిరగిరా చక్రాల్లా తిప్పుతూ.

పిల్లలంతా పకపకానవ్వారు పాపకూడా నవ్వేసింది; ఎందుకో తెలియకుండానే బడిగంట కొట్టగానే అందరూ పలకలూ పుస్తకాలూ తీసుకుని యిళ్ళకు బయల్దేరారు.

* * *

ఆ రోజల్లా అల్లరిచేయకుండా అమ్మ చెప్పినట్టు నడుచుకుంది పాప. సాయంత్రం అయ్యేసరికల్లా పిల్లలంతా పాపయింటికొచ్చి చేరారు. పాపకిదంతా ఘనవిజయంలా తోచింది. చాలాసేపు ఆ కబురూ యీ కబురూ చెప్పి వాళ్ళని వీధిగుమ్మంలో నే కూర్చోబెట్టి మరీ మరీ వూరించింది. ఆ తరవాత 'రండర్రా లోపలికి' అంటూ ముందు తను దారి చూపిస్తూ పెరట్లో మొక్క దగ్గరికి తీసుకు వెళ్ళింది.

వెళ్తూనే- 'అదిగో. అదేనర్రా మా నవంబరు మొక్క' అంటూ గోలెం దగ్గరకి పరుగెత్తింది. పిల్లలందరూ గోలెంచుట్టూ మూగారు. కొమ్మలూ, రెమ్మలూ పట్టుకు మాస్తూవుంటే మొక్క యెక్కడ వాడిపోతుందోనని లోలోపలే బెంగపెట్టుకుంది పాప.

కాని పైకి మాత్రం - 'మాడండర్రా చూడండి. ఎర్రగా కెంపులా ఎలా మెరిసిపోతోందో ఆ పువ్వు మాశారా!' అంటూ స్వంత డబ్బా వాయించుకుంది.

పిల్లలంతా నవ్వారు. రాధావతి అందర్నీ వెనక్కు నెట్టుతూ ముందుకొచ్చి చూసింది పుటుక్కున మూతి విరిచింది:

'ఓస్ యిదేనా. మహా గొప్పగా కోతలు కోస్తున్నావ్. ఈ రకం మొక్క మా యింట్లో లేదుకాని బెజవాడలోవున్న మా అత్తయ్యా వాళ్ళింట్లో నేనోసారి మాసాను ఇది డిసెంబరు మొక్క,' అన్నది.

పాపకు పట్టలేనంత కోపంవచ్చింది.



పండుగ గాజులు

చిత్రకారుడు:—శీలంయతిరాజు, అబ్బినేని గుంటపాలెము.

'నీ మొహం పిచ్చివాగుడు వాగకు. ఇది డిశంబరు మొక్కేం కాదు నవంబరు మొక్క. మీ అత్తయ్యకే కాదు. దేవతలకూ్కడా ఇలాంటి మొక్క దొరకదు' అన్నది ఖచ్చితంగా ఖండిస్తూ.

రాధావతి అంతకన్నా మొండిఘటం. 'నీకు తెలియకపోతే సరా! ఇది డిశంబరు మొక్క. ఢంకా బజాయించి చెప్తాను,' అంది.

పాప కంతకన్నా పట్టుదల యెక్కువయింది.

'ఇది ముమ్మాటికీ నవంబరు మొక్క — డిశంబరు మొక్క కాదంటే కాదు. డిశంబరు మొక్క డిశంబరునెల్లోనే పువ్వులు పూస్తుంది. అంతేకాని నవంబరులో యెందుకు పూస్తుంది? ఇది నవంబరు మొక్క కనక నవంబరు నెల్లో పూసింది ఏమే రాజేశ్వరీ కదుటే?' అన్నది.

'కాదే పాపా! దాని పేరు డిశంబరు కాని అది నవంబరులోనే పూత ఆరంభిస్తుంది,' అన్నది రాజేశ్వరి. మిగిలిన పిల్లలంతా తెలబోయి చూశారు.

పాపం! పాప మొహం చిన్నబుచ్చుకుంది.

'కావాలంటే మీ అమ్మనడుగు మీ అక్కనడుగు. ఇంకెవరినైనా అడుగు, అది డిశంబరే, అంటూ ఛాలెంజ్ చేసింది రాధావతి.

ఈ తగవులాటంతా తమాషాగా చూస్తూ వరండాలో నించున్న అమ్మ, అక్కల దగ్గరకు పరిగెత్తింది పాప.

అమ్మ అటూ ఇటూ చెప్పకుండా టక్కరిగా చిన్న నవ్వు నవ్వి వూరుకుంది. పిల్లలంతా చల్లగా బయటికి జారుకున్నారు. ఓడిపోయిన పాప భోరుమంటూ వెళ్ళి మంచంమీద వాలిపోయింది. అమ్మా, అక్కా, అన్నయ్యా ఎంత బుజ్జగించినా, పాప అక్కసు తీరలేదు. ఆఖరుకి నాన్నగారొచ్చి ఒక్కమాట పాప చెవిలో చెప్పారు—

'చూడు పాపా! మనింట్లో మొక్క ఏదయితేనేం? అలాంటి మొక్క రాధావతికి లేదుగా! రేపట్నించీ అది ఆ మొక్క కోసం నిన్నే బ్రతిమాలుతుంది' అన్నారు.

పాప పకపకా నవ్వుతూ లేచి నాన్న వొళ్ళో దూరింది. ★


మాంత్రికుడు
మాండ్రేక్
కల్పన, రచన:
...లీ ఫాక్, ఫిల్ డెవిస్...
మాంత్రికుడు మాండ్రేక్ ఆ మర్నాడు నార్దాను వెతకడానికి బయల్దేరాడు.
అలా ఇక్కడికెవరూ రాందే...నే చూశ్లేదు.
అదే సంగతి. నార్దా నిన్నరాత్రినుంచి కనబడలేదు. పోయిన టోపీకోసం ఇక్కడికివెళ్తున్నట్టు నిన్న చెప్పింది.
నాకేమన్నా అజతెలి
మీకు కబురంపుతా.
ఇంకెంతసేపీజాగరణ! 12 ఐంది. అరెనిజమే! గోరీ మూత లేస్తోందే!


అన్నీ దొంగవేషాలు. పచ్చి అబద్ధాలు.
హుం. నార్దాగోల కాస్త జాగ్రత్తగా వినాల్సింది..ఏదో చదునైనగోరీ అంది. మూత తెరుచుకుందిట. ఎముకచెయ్యేదో పట్టుకుందంది.
3
చిత్రంగాఉంది!..అవేమిటో! మనుషులే. శవపేటిక బైటికి మోస్తున్నారు..అందులో ఏముంటుందో!
6
6-20

(ఇంకా ఉంది)

మంత్రాలు: నమ్మకాలు

★ బీజాక్షర విద్యుత్తరంగాలు ★

మంత్రాలు కేవలం ఒక నమ్మిక మాత్రమేనా? కాదు. మన ఉనికి ఎంత సత్యమో వాటి ఉనికికూడా అంత సత్యమే. కేవలం నమ్మకం మాత్రమే అయితే ఎప్పుడో అవి గతించి ఉండేవి. మనమాత్రపు మేధావులు ఇదివరలో పుట్టకపోవటంచేత అవి ఇప్పటికే నిల్చి ఉన్నాయి అనుకోవటం మన అజ్ఞానం తప్ప వేరే ఏమీ కాదని నా దృఢవిశ్వాసము. మనం పాశ్చాత్యవిద్య కొద్దిగా నేర్చి ఇదంతా బూటకం అంటం పరిపాటి అయింది. మనకు మాక్సుముల్లరు లాంటి ఏ పాశ్చాత్యుడో "అవి సత్యం" అనే వరకూ మనం కళ్ళుతెఱవం. పోతే ప్రయత్నం చేసినతర్వాత ఫలించని వ్యక్తులు ఇది సర్వాబద్ధం అంటూ ఉంటారు. వారు పొంద లేనంతమాత్రాన వాటి ఉనికి లేదనటం అన్యాయం. ప్రపంచంలో మానవులు అనేక విషయాల్ని గురించి అనేక ప్రయత్నాలు చేస్తారు. అన్నింటిలో వారు సాఫల్యం పొందుతున్నారా? ఇప్పుడు ప్రతిరోజూ వాడుకలో ఉన్న పెన్సిలిన్ చూడండి: ఇది అద్భుతమైన మందు అని అందరూ ఏకగ్రీవంగా ఒప్పుకొన్నదే. అయినప్పటికీ సరియైన వైద్యులు ఇచ్చిన అన్ని కేసులలోను నూటికి నూరుపాళ్లు పనిచేస్తున్నదా? లేదు. ఒకరికి పని చెయ్యనంతమాత్రంచేత ఆరోగి "పెన్సిలిన్ మందు కాదు. అది వట్టి నమ్మకమే. అంతా మోసపోతున్నారు," అంటే మనకు ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో మంత్రాల విషయంలో కూడా అంతే.

ఇక ఉదాహరణలు వదిలేసి, మంత్రములు అంటే ఏమిటి? అవి ఎల్లా పని చేస్తాయి? దానికి శాస్త్రీయ వివరణ (సైంటిఫిక్ ఎక్స్‌ప్లెనేషన్) ఏది? అనే క్లిష్టవిషయానికి వస్తాము. "మంతారం త్రాయత ఇతి మంత్రః" వగైరా ఇదివరకే వ్రాశారు. మంత్రాలను రెండురకాలుగా భాగించవచ్చు. (1) మహామంత్రాలు, (2) మాలామంత్రాలు. వాటి వివరములను గురించి చర్చించకుండా అవి ఏ మాదిరిగా పని చేస్తాయి అనే అంశం తీసికొందాము.

మంత్రాలు అంటే బీజాక్షరాలతోగాని లేకుండాగాని ఉన్న భావయుక్తమైన పదజాలం. సాధారణంగా మంత్రాలు ఉపాసించేవారిలో కనీసం నూటికి తొంబది అయిదుమందికి ఆ బీజాక్షరాల అర్థం తెలియదనవచ్చును. కాని తెలిసి ముట్టుకొన్నా తెలియక ముట్టుకొన్నా నిప్పు ఎట్లా కాలుస్తుందో అదికూడా అంతే. అలా అయితే ఒకరికి మంత్రసిద్ధి అవటం ఇంకొకరికి కాకపోవటం ఏమిటి? దానినే పూర్వజన్మ సుకృతం అంటాం. మంత్రసిద్ధి అనేది మనం చేసే దానినిబట్టికూడా ఉంటుంది. అంటే చిన్న చిన్న వాటిని గురించి చేస్తే అవి సాధారణంగా ప్రతివారికీ సిద్ధి అవుతాయి. కాని పెద్దపెద్ద ఆలోచనలతో ప్రపంచాన్ని తారుమారు చెయ్యాలనో లేక కేవలం మన స్వార్థంకోసం అనేకమైన దుష్కార్యములు చెయటానికో మంత్రాలు ఉపాసిస్తే మటుకు సిద్ధి అవటం దాదాపు అసంభవం. కనుక మంత్రసిద్ధి పొందటానికి కొన్ని ముఖ్య లక్షణాలు కావాలి. పూర్వజన్మ సుకృతం కావాలి. సద్గురువు అనుగ్రహం కావాలి.

ముఖ్య లక్షణాలు ఏమంటే నియమాలతోడి జీవితం, అబద్ధం ఆడకుండటం మొదలైనవి. పూర్వజన్మ సుకృతం అన్నది ఒక బ్రహ్మాండమైన విషయం. దానినిగురించి చర్చించటం ఇక్కడ అప్రస్తుతం. పూర్వజన్మను నమ్మేవారికి చెప్పవలసింది ఏమీ లేదు. నమ్మనివారికి ఒక చిన్న సలహా. వారు "లెడ్‌బీటర్" యొక్క గ్రంథాలు చదివితే చాలావిషయాలు తెలుసుకొంటారు. (ఈ గ్రంథాలు ఏ పెద్ద థియొసఫికల్ లైబ్రరీ - పరవిద్యాశ్రమ గ్రంథాలయం - లోనైనా దొరుకుతాయి.)

ఇక సద్గురువు అన్న విషయం. ఈ రోజుల్లో సద్గురువు దొరకటం అన్నది మహా దుర్లభమైన విషయం. అదృష్టవశాత్తు దొరికితే తరువాత వ్యవహారం సులువు. ఆయన ఈ వ్యక్తికి ఏ విద్య ఇస్తే ఫలిస్తుందో ముందుగానే తెలిసికొని అది ఉపదేశిస్తారు. తప్పక ఫలిస్తుంది. అలాంటి సద్గురువు దొరకక పోవటంవల్ల చాలా అవస్థ ఉంది. కొన్ని ఉపదేశాలు పొందటం, అవి ఫలించకపోవటం, వెంటనే మంత్రశాస్త్రాన్నే తిట్టటం జరుగుతోంది. అదిగూడా కాకుండా గ్రంథాలు చూచి మంత్రం అనుష్ఠానం పుస్తకంలో ఉన్న ప్రకారం చేసి ఫలించక తిట్టేవారు కొంత మంది. కాని సద్గురువు లేకున్నప్పటికి ఉపదేశం మూలంగా మంత్రం తీసికొనవలసిన అవసరం ఉంది

ఇక పోతే అన్ని మంత్రాలు అందరకు ఎందుకు ఫలించవు అన్న ప్రశ్న. మనం అందరం సాధారణంగా ఉపయోగించే భోజన పదార్థాలలోనే కొన్ని కొందరకు సరిపడవు. పైగా లేనిపోని బాధలు కలుగ చేస్తాయి. ఎందుచేత? ఆ తత్వానికి సరిపడవు అంటారు అదే Allergy (ఎలెర్‌జీ) అంటారు. అదేవిధంగానే ఈ మంత్ర శాస్త్రంలోకూడా కొన్ని కొన్ని ఆ తత్వానుసారంగా అనుకూల, ప్రతికూల వాతావరణములు కలిగి వుంటాయి

కనుక మనకు తత్వానుకూలంగా మంత్రం ఫలిస్తుంది. అంతేగాని చేసినంత మాత్రాన ప్రతివిద్య ప్రతి ఒక్కరికి ఫలించదు. అది కాక కు. చ తప్పకుండా శాస్త్రోక్తంగా అన్ని నియమాలనూ పాటించిన మంత్రం సిద్ధించకపోవటం చాలా అరుదు. ఫలించనివారు ఒక్కసారి ఆత్మపరిశోధన చేసికొంటే లోటు ఎక్కడో వారికే తెలుస్తుంది. నిశ్చలంగా భావం కేంద్రీకరించి అనుష్ఠాన దైవాన్ని తప్ప ఇంకేమీ తలపులోకి రాకుండా చేసి ఫలులైన వారు ఎవరైనా వున్నారా అని సందేహం. మనస్సును అరికట్టి లక్ష్యం తప్పకుండా జపం చేయటం ఎంత కష్టమో అందరికీ తెలిసిన విషయమే. అది కూడ కాక కొన్ని కొన్ని మహావిద్యలు లోకవాసనలు అన్నీ నశించినగాని సిద్ధించవు అన్నది మరవకూడదు. ఇక శాస్త్రీయ వివరణ చూద్దాం.

మన మనస్సు ఎల్లప్పుడూ పని చేస్తూనే వుంటుంది అన్న విషయం అందరకు తెలిసినదే. నిద్రపోవునప్పుడుకూడ అది పనిచేస్తూనే ఉంటుంది. మన ప్రతి ఆలోచన, ప్రతి పని మన మెదడులో కొన్ని మార్పులను తెస్తూ వుంటుంది. కాని

కొన్ని విద్యుత్పరిణామాలు కల్గి ఆలోచనా తరంగముల మాదిరిగా గాలిలోకి వస్తాయి. ఈ అలలను మంచినిద్రలో ఉండగా మాత్రమే శాస్త్రకారులు రికార్డు చేశారు. ఏమాత్రం మెళుకువ వచ్చినా ఆ అలలు మన యంత్రం గుర్తించలేనంత వేగంగా ప్రవాహం లాగా వచ్చినాయి. కనుక మన ప్రతిపని, ఆలోచన, తదనుగుణ్యమైన విద్యుత్తరంగాలను పంపుతాయి. మన మంత్ర పునశ్చరణ కూడా ఒక నిర్ణీతవేగం (Frequency)లో విద్యుత్తరంగాల్ని బైటికి పంపుతుంది. అయితే దాని వల్ల మనకు ఏమి ఉపయోగమో తరువాత చెప్తాను. ఇప్పుడు సరికొత్త పరిశోధనలలో కత్తిలేని శస్త్రచికిత్స ఒకటి. దీనిలో మానవుని చెవికి వినబడనంతటి సూక్ష్మమైన అలలు ఒక యంత్రంద్వారా పంపితే మనకు ఏమీ వినపడకపోయినా, తెగినట్లు మటుకు కనపడుతుంది. ఆ తరంగాలు పనిచేస్తున్నా యని నమ్మకం ఏమిటి అంటే జరిగిన శస్త్ర చికిత్సనుబట్టే. డీప్ ఎక్స్‌రే కూడా అల్లాగే కనపడకుండా పనిచేస్తుంది.

ఇంకొకవిషయం ఏమంటే ఒకవిధమైన సంగీతం కొన్నిరకాల వ్యాధులను కుదురుస్తుంది, ఇంకొకరకమైన సంగీతం కొన్ని వ్యాధులను పెంచుతుంది, అని రిసెర్చివల్ల కనుక్కున్నారు. అయితే సంగీతానికి జబ్బుకు సంబంధం ఏమిటి? అంటే మంచి సంగీతంవల్ల మనస్సు తృప్తి చెంది రోగికి కొంత సుఖంగాఉంటుంది, చెడ్డపాట వల్ల మనస్సుకు చికాకు ఎక్కువ అవుతుంది అనవచ్చు. కాని కేవలం సమాధానం అంత మాత్రమే కాదు. వినపడే సంగీతం ఎట్లాంటిది అయినా దానియొక్క ప్రత్యేక తరంగాల్నిబట్టి వ్యాధిమీద పనిచేస్తుంది అని నిర్ధారణ చేశారు.

కనుక మనకు వీటినిబట్టి తేలే దేమిటంటే నవీనశాస్త్రవిజ్ఞానం కూడా ఇప్పుడు ఆ తరంగాలు ఎంతపనిచేయగలవో కొంతవరకు తెలియ వచ్చింది. ఇవన్నీ చూసినతర్వాత కూడా ఒక ముఖ్యవిషయం మనం మరువకూడదు. అది ఏమిటంటే ప్రకృతిని గురించిన రహస్యాలలో ఈ సైన్సు తెలిసికొన్నది అతి స్వల్పం. ఇంకా ఎంతో పరిశోధనచేసి తెలిసికోవలసి ఉంది. ఏదైనా మనకు తెలియనంతమాత్రంచేత, మనవల్ల కాక పోయినంతమాత్రం చేత అది లేనే లేదు అనటం చాలా పెద్ద పొరపాటు. ఉదాహరణకు ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతము (Theory of Relativity) చూడండి. అది అర్థమైనవారు అంతా కలిపితే ప్రపంచం మొత్తంమీద పది మంది కూడా లేరు. అందుచేత ఇక మన మంతా దాన్ని బూటకమంటే ఏం బాగుంటుంది? సరియైన శాస్త్రకారుడెవడూ దేనినీ లేదనడు. వారి జీవితాలు ధారపోసి పరిశోధన చేస్తారు. దాని అంతు తేలుస్తారు. ఒకరు కాకపోయినా ఇంకొకరైనా సాధిస్తారు. మనకు కూడా అటువంటి తత్త్వం అలవడటం చాలా అవసరం. ఇక పోతే ఆ విద్యుత్తరంగాలు మన మెదడులోనుండి వచ్చిన సంగతికి వద్దాము. ప్రతి మంత్రమునకు ఒక భావం ఉంది. దానికి అనుగుణ్యంగానే మంత్రం సృష్టించబడి ఉంటుంది. అందుచేత ఆ మంత్ర పునశ్చరణ జరుగునపుడు ఒక ప్రత్యేక నిర్ణీత విద్యుత్తరంగాలు వెలువడుతాయి. కృషిచేసిన వ్యక్తికి ఆ ప్రత్యేకమైన తరంగములను సరియైన మార్గంలో పంపేశక్తి ఉంటుంది. అవి మనకు వినపడక పోయినా కనపడక పోయినా వాటి పని అవి చేస్తాయి. జరిగిన పనిమాత్రమే మనకు కనపడుతుంది. అయితే అంతకాలం మంత్రం ఎందుకు చేయాలి అంటే కొంతకాలంపాటు మంత్రం రాపాడితేకాని మనకు ఒకే వేగంలో తరంగాల్ని బలంగా పంపే శక్తి రాదు. ఆ శక్తి వచ్చిన తర్వాత ఆ తరంగముల శక్తిని గమనించవచ్చును. అదేవిధంగా ప్రతిమంత్రంవలన ప్రత్యేక వేగంతో తరంగాలు వెలువడి, మానవ శరీరముపై పని చేస్తాయి. ఆ ఫలితాన్ని విషహరణ మొదలైన క్రియలలో మనం చూడగలం. సరియైన ఫలితం కన్పడకపోతే తప్పనిసరిగా ప్రసారకేంద్రం (Transmitting station) లో — అంటే మంత్రోపాసకునిలో — ఏదో లోటున్న దన్నమాట. అది సరిచేస్తే పని సరిగ్గానే ఉంటుంది. కాని అదే ఒక పెద్దసమస్య. ఆ లోటు సరిచేయగలిగే ఒక ప్రత్యేక ప్రావీణ్యంగల సాంకేతిక నిపుణుడు కావాలి. అతడే సద్గురువు. ఉపాసకుడు ఒకయంత్రం. పిండిమరలో పంచదార చేయటానికి ఎట్లా వీలుపడదో అట్లాగే ఉపాసకుడు తన తాహతుకు మించిన మంత్రాన్ని సాధించలేడు. సాంకేతిక నిపుణుడైనవాడు ఒకయంత్రాన్ని దాని అవకాశాల్నిబట్టి కొద్ది మార్పులనుచేసి ఉన్నతమైనదానినిగా ఎట్లా తయారుచేయగలడో అదేవిధంగా సద్గురువు శిష్యునితత్త్వం యోగ్యత, సంస్కారము అన్నీ గమనించి ఉచిత మంత్రోపదేశం చేసి సిద్ధికి దారి చూపటమే కాక సంకల్పమాత్రాన శిష్యునికి



★ మంత్రాలు, నమ్మకాలు ★

కొంతశక్తిని, యోగ్యతను ప్రసాదించి అసాధారణమైనవి, దుస్సాధ్యమైనవి కూడ శిష్యులచేత చేయించగలరు.

ఇది ముగించకముందు మంత్రాలు కేవలం నమ్మితేనే ఉన్నాయి లేకపోతే లేవు అన్నది ఎలా నిజముకాదో కొన్ని ఉదాహరణలు చెప్తాను. సాధారణంగా మన అందరకు అనుభవంలో ఉన్న విషయం ఒకటి చూడండి పసిపిల్లలు ఉలిక్కిపడటం ఏడవటం వగైరా సర్వ సామాన్యమైనదే. చాలామంది కేటికి వైద్యాలుచేయించి విసిగిపోవటం చూస్తూనే ఉన్నాము. మంత్రించిన విభూతి పెట్టేక వెంటనే కులాసాగా ఉండటం చూస్తూనే ఉన్నాం. దీన్ని ఏమనాలి? ఇది మానసిక పరిణామం (Psychological effect) అనటానికి ఇది అర్థంచేసికొనే ఊహ రోగికి లేదు గదా! ఇక దృష్టిదోషము-దృష్టితీయటం మనం సాధారణంగా వింటున్నదే ఆ దృష్టి దోషముతో బాధపడే వ్యక్తికి దృష్టి తీసిన తర్వాత చాలిసుఖం తెలుస్తుంది సామాన్యంగా పాటున ఒక్క మిరపకాయ పొయ్యిలో పడితే దగ్గలేక అవతలకు పోతామనుకుంటాం, అటువంటిది దృష్టిదోషమున్న వ్యక్తికి దృష్టి తీసి గుప్పెడు మిరపకాయలు పొయ్యిలో పోసినా మనసు దగ్గురాదు తర్వాత ఆవ్యక్తి సుఖంగా ఉంటాడు. కనుక దృష్టిదోషమున్న దన్నమాట. దృష్టికి మంత్రం ప్రయోగం చేస్తూఉంటే దృష్టి ఉంటేనే ఆవలింతలు వస్తాయి (వ్యక్తికి మళ్లీ దృష్టితాలి దృష్టి మంత్రంవేస్తే, దృష్టి తీస్తే ఎంతో హాయిగా తేలికగా అంటే హాయిగానూ ఉంటుంది

కనుక మంత్రం పనిచేస్తుందనటానికిది నిదర్శనము మన తెలుగుదేశంలో సాధారణంగా పాముల నరసయ్యగారి పేరు విననివారుండరు ఎంతదూరంలోవున్నా ఆయనకు తెలియజేస్తే సర్పదష్టులు తిరిగి చైతన్యం పొందగలేవారు ఇది కట్టుకథ కాదుగదా! దగ్గిరవున్నా, దూరంగావున్నా మంత్రబలం విద్యుత్తరంగాల రూపంలో పనిచేస్తుందన్న విషయం పైన చర్చించాము అయితే అందరి మంత్రాలు మారానికి పనిచేయవేం? హ్రస్వతరంగాలు, మధ్యమతరంగాలు అన్ని రేడియో కేంద్రాలనుండి ఒకే బలంతో ప్రసారం కావేం? హ్రస్వతరంగాలు ప్రసారకేంద్రపు శక్తినిబట్టి వివిధాలుగా వస్తాయిగదా! ఒకే వేగంతో (frequency) రెండు కేంద్రాలనుండి వస్తూంటే బాగా శక్తిగల కేంద్రము మనకు వినబడుతుంది. అదేవిధంగా ఉపాసనాబలంమీద మంత్రం దూరానికి పనిచేయటం ఆధారపడివుంటుంది. కనుక పాముల నరసయ్యగారి శక్తి అందరికీ ఉంటే అదేమాదిరిగా పనిచేయగలుగుతారు ఆశక్తి ఎలా లభిస్తుందంటే అది స్వయంకృషివల్ల గావలసిందేగాని వేరే మార్గంలేదు. అందుచేత దీన్నిగురించి ఎంత వ్రాసినా వృధాయే.

కనుక ముఖ్యంగా తెలిసికోవలసిన విషయం ఏమిటంటే సరియైనగురువు సాన్నిధ్యంలో ఉపదేశంపొంది నిశ్చలమైన మనస్సుతో కృషి చేసిగాని మనం దేన్నీ సాధించలేము. పొట్టకూటికి చెప్పే కొంతమంది మంత్రశాస్త్రాలు విని వాళ్ళదగ్గిర సరియైన


విద్య కనుపించని కారణాన అంతా అదే మాదిరి అంటం పొరపాటు. మంత్రాలు కేవలం బూటకం, నమ్మితేనే ఉంది లేకపోతే లేదు అనేవారికి నాదొక చిన్నమనవి. వారు స్వయంగా వీరాంజనేయ మంత్రం ఉపదేశంపొంది నిష్ఠ నియమాలు ఏమీ పాటించకుండా కొంతకాలం చేసి చూడండి దాని దెబ్బ ఏమిటో స్వయంగాచవిచూస్తారు.

దయ్యాల్నిగురించి. ఇవి ఉన్నాయి, లేవు అనే రెండు తెగలవారు ప్రపంచమంతటా ఉన్నారు. నా అనుభవం చెప్తాను. ఒక టైఫాయిడ్ రోగికి నెమ్మదించింది. పథ్యం మరునాడు పెడదాము అనిచెప్పాను. మళ్లీ నాడు ఉదయం 8 గంటలకు "రోగి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతోంది సంధిలాగా ఉంది మన స్వాధీనంలో లేదు" అని అర్జంటుగా రమ్మన్నారు ఆశ్చర్యపోయి ఇంజక్షన్‌లు వగైరాతో అక్కడికి వెడితే రోగి స్వాధీనంలో లేనిమాట యథార్థమే. "ఇల్లు కాలిపోతోంది" అంటోంది. నన్ను గుర్తుకూడా పట్టలేదు. జ్వరం మాత్రే సబ్ నార్మల్. ఏవిధమైన వ్యాధి లక్షణాలు లేవు. అప్పుడు ఒక ఉపాసకుని పేరు చెప్పి విభూతి పెట్టించి, పథ్యం పెట్టమన్నాను. విభూతి పెట్టించి పథ్యం పెట్టారు. ఆ అమ్మాయి కులాసాగా ఉంది. అందరూ ఆశ్చర్యపోయారు. తర్వాత రక్షరేకు కూడా కట్టించారు. ఈ విభూతి సంగతి స్వాధీనంలో లేని ఆ రోగికి తెలియదు కాబట్టి మానసిక పరిణామం అంటానికి పొసగదు. దయ్యాల అల్లరి చాలమందికి తెలుసు. ఒక్కొక్కప్పుడు అవిచేసే శబ్దాలను B.B.C కేంద్రం ఎలాగైనా పట్టుకొని ప్రసారం చెయ్యాలని ప్రయత్నిస్తోంది.

అందుచేతనే మన వివేచనాశక్తి నుపయోగించి మంచినే తీసికోవాలి. మనకంటె అన్ని విధాలా చాలా పైస్థాయిలో ఉన్న శ్వేతజాతులవారికే ఇలాంటి నమ్మకాలు మన కన్న చాల ఎక్కువ ఉన్నాయి. అందుకోసం మనకీ ఉండాలని కాదు నేననేది. అది మానవనైజం. వాటివల్ల మనకు ఏవిధమైన బాధా లేదు. నష్టం లేదు. అందుచేత వాటియొక్క అంతర్యం ఏమిటా అని ఆలోచించి తెలిసికోవటం అవసరం. ★

"తుకారాం"

—గుడివాడ.



బుజ్జి

రాయచోటి
శ్రీనివాసరావు

నవ్వులొలికిస్తూ! తడబడి నడుస్తూ క్షణ క్షణమూ ఆనంద డోలికలో ఆడింప జేసేటి ముద్దులపట్టి ఒకడు లేకపోగా రామారావు, లీలా దంపతులు బెంగుళూరునుండి ఒక ముద్దొచ్చే కుక్కపిల్లను తెచ్చుకున్నారు

టామీ, టైగర్, జిమ్మీ, పప్పీ అలాంటి పేర్లేమీ తమ కుక్కపిల్లకు పెట్టలేదు. ముద్దుగా ఆ కుక్కపిల్లను 'బుజ్జి' అని పిలిచే వాళ్ళు. ఆ కుక్కపిల్లకూడా యెక్కడికీ పోకుండా అస్తమానమూ ఆ దంపతుల మధ్య ఆడుకుంటూ వుండిపోయేది.

రామారావు సాయంకాలం ఆఫీసునుండి యింటికి రాగానే ఒక గ్లాస్కో బిస్కట్టు తప్పకుండా తెచ్చి, వాకిటిలో నిలబడి "బుజ్జి" అని పిలచేసరికి, ఎక్కడున్నా సరె ఆ బుజ్జి పరిగెత్తుకుంటూ వచ్చి ముందరి కాళ్ళు రామారావు చేతుల కందించి, వెనుక కాళ్ళతో నిలబడి నోరు తెఱచి చూస్తూ వుండేది రామారావు బిస్కట్టునో ప్లేవుం చుతూనే ఎగురు కుంటూ పోయి దాన్ని లీలావతమ్మకు చూపెంచేది. ఆమె నవ్వి దాని దేహం ఒక సారి నిమిరిన తర్వాత ఆ బిస్కట్టును తినేది.

"పూర్వ జన్మలో ఈ బుజ్జిగాడు మన వాడే అయివుంటాడే" అని అంటుండే వాడు రామారావు "లేకపోతే కుక్క పిల్లేమిటి, మనమీద యింతా అనురాగం చూపడమేమిటి?" అని లీలావతమ్మ కూడా అనేది

ఆ దంపతు లిద్దరికీ, తమకో పాపకావాలనే కోరిక నానాటికి తగ్గిపోయింది బుజ్జి మీద అనురాగం ఎక్కువయింది. ఆకుక్క పిల్లనే తమ బిడ్డగాభావించుకుని క్షణక్షణం దాని బాగోగులు కురించి జాగ్రత్తగా చూచుకుంటుండే వారు

ఇలాగా చాలా రోజులు గడిచాక, ఒక రోజు బుజ్జి పార్కుకు వెళ్ళి దీపాలుపెట్టే వేళకు యింటికి వచ్చింది, కానీ యిల్లుతాళం వేసింది పక్కింటబ్బాయి (అప్పుడప్పుడు బుజ్జితో ఆడుకునేవాడు) "బుజ్జీ! వాళ్ళు యిప్పుడే హాస్పిటల్ కు వెళ్ళారు." అన్నాడు. మనభాష దానికి అర్థమయిందో లేదో గానీ, అది మాత్రం, అక్కడి నుండి కదలి వెళ్ళిపోయింది.

తనకు తోచినదారి వెంబడి బుజ్జి పరుగెత్తింది. తన కెగురయిన ప్రతి సినిమాహాలు దగ్గరా ఆగి చూచింది. అలా గె వెళ్ళుతూంటే తన దృష్టి ఒక జట్కాబండిని ఆకర్షించింది. ఒక్క పరుగులో ఆ జట్కాను అందుకుంది. అందులో రామారావు లీలావతమ్మ వెళ్ళుతున్నారు. జట్కాలో వున్న రామారావును ఎగిరి ఎగిరి అందుకోడానికి ప్రయాసపడింది బుజ్జి. కానీ రామారావు చిదరించుకొని "వెళ్ళు వెళ్ళు, యింటికెళ్ళు" అని బెదరించాడు.

ఎంతసేపటకీ తిన్నురమ్మని చెప్పనందుకు బుజ్జి నిరాశగా తిరుగుముఖం పట్టింది.

ఇంత వాకిటే విచారవదనంతో ఏదో ఆలోచిస్తూ పడుకుంది. ఎప్పటిలాగే పక్కింటి అబ్బాయి, బెండు తెచ్చి "ఆడు కుందాంరా" అని పిలచాడు. బుజ్జి సంతో షించలేదు. ఆ అబ్బాయి తన చేతిలోని బెండును దూరంగా విసరి "అదో అక్కడ— ఆ యింటిముందు బెండుంది. తే రెడీ... ఒన్...టు...త్రీ" అన్నాడు. బుజ్జి కద లేదు మెదలేదు. అల్లాగే విచారంగా పడు కుంది.

ఆ అబ్బాయి కోపంగా "తేవూ... తీసు కరావూ... సరే రేపు మానాన్న కొని యిచ్చినప్పుడు, నే నేదయినా కొను క్కుంటా — అప్పుడు నీకేమైనా యిస్తా నేమో చూడు," అని కోపంగా వెళ్ళ బోయేసరికి, ఆ బుజ్జి తిన్నగా లేచి బాధగా నడుస్తూ పోయి ఆ బెండు తెచ్చి ఆ అబ్బాయి ముందు జారవిడిచింది. తాను యథా ప్రకారం ఇంటి గడపమీద పడుకుంది.


ఆ అబ్బాయి ఆ బెండు తీసుకొని బుజ్జీకి ఆడుకోడం యిష్టం లేదేమోనని వెళ్ళి పోయాడు.

రాత్రి పది గంటలకుపైగా రామారావు మాత్రం యింటికొచ్చాడు బుజ్జి గడపమీదే మేలుకొని పడుకొంది. "బుజ్జి యిక్కడే వున్నావా, లే అన్నులే," అని బుజ్జి అడ్డం తొలగినతరువాత రామారావు తాళం తీసి లోనికి వెళ్ళాడు. బుజ్జికూడా ఆయన వెంబడే ఆయన కాళ్ళకు రాచుకుంటూ నడచింది. దానికి యెక్కడలేని వుత్సాహం.

రామారావు ఒక పెట్టె తెరచాడు. బుజ్జి తన ముఖం ఆ పెట్టెలో పెట్టి గందరగోళం చేస్తుంటే, అందులోని పాత బిస్కట్టు ముక్క వొకటి దూరంగా విసిరి "అది తీసు కోపో" అని అన్నాడు కాని బుజ్జి బిస్కట్టు ముక్కకోసం వెంతలేదు. అక్కడే నిలు చుంది. రామారావుగారు కొంత డబ్బు తీసు కొని ఆ పెట్టె మూసేశాడు రామారావుతో బాటు బుజ్జీకూడా వెలుపలికి వచ్చి; అతను తాళం వేసేంతవఱకు అక్కడేవుండి, రామా రావును ఎంతో దూరం వెంబడించింది. రామా రావు కసరి కొట్టాడు. "వెళ్లి-వెళ్లి-అక్కడికి నిన్ను రానివ్వరు" అని, చరచరా వెళ్ళి పోయాడు.

ఏ మనోగాలనుకుందో; ఏం చెప్పాలను కుందో ఆ నోరులేని బుజ్జి! ఏం చెయ్యలేక కళ్ళనీరు కారుస్తూ నిలబడిపోయింది. తన దక్కడికి మాట్లాడిచ్చేవా రెవరూ లేరు. పాపం! బుజ్జి కుమిలిపోయింది. నిద్రాహారాలు మాని వేసింది. రెండు రోజులుపాటు ప్రక్కనున్న పార్కులో గడిపింది.

ఆనాడు నీరసంగా యింట్లో ప్రవే శించింది బుజ్జి మధురమనోహర గానం బుజ్జి చెవుల కందింది. ఏనాడూ వినరాని యీపాట ఎక్కడా అని ఆలోచించింది. ఆ అమృత గానం వినవచ్చే చోటికి మెల్లగా పోయింది. మేడమెట్లు ఎక్కింది. లీలావతమ్మ వుయ్యాల లోని బిడ్డను జోకొట్టి జోలపాట పాడు తూంది బుజ్జి సంతోషానికి మేర లేదు. గబగబ



మైసూరు రాజభవనం

ఫొటో: టి. వాసుదేవన్, మద్రాసు.

వుయ్యాలదగ్గరికెళ్ళి బిడ్డను నాకడానికి తన ముందరి కాళ్లు వుయ్యాలమీదికి వుంచింది. అంతలో రామారావు అక్కడికొచ్చి "ఛీ! వెధవ ముఖమా... పాపను కొరుకుతావా... పో" అని బుజ్జి వెనక కాళ్లు పట్టుకొని జరజర లాక్కొచ్చి మేడమెట్లనుంచి క్రిందకు విసిరి పారేశాడు. పాపం! బుజ్జి ముందే నిద్రాహారాలు మాని నీరసంగా వుంటే పైపెచ్చు దెబ్బలు తగిలి రక్తం ప్రవహిస్తోంది. రామారావు లక్ష్యం చెయ్యక వెళ్ళిపోయాడు. బుజ్జి పాపం ఆరక్త సిక్తమైన శరీరంతో దోగుకుంటూ బయటికి అరుగుమీదకు వచ్చి పరుండిపోయింది.

తనంటే ప్రాణసమానంగా చూచుకొంటూ, ప్రతి సెకనూ తన్ను లాలిస్తూ, చంకన వేసుకొని ఎగుర వేసుకుంటూ, ప్రక్కన పరుండబెట్టుకుంటూ వుండేవారు లీలా దంపతులు. ఇప్పుడు తను వాళ్ళకు చీడపురుగులా అయిపోయింది. ఒకప్పుడు లీలావతమ్మ వుయ్యాలలో తన్ను పరుండబెట్టి జోకొట్టేది... రామారావు తన్ను ఎత్తుకొని ముద్దెట్టుకొని, ఆఫీసుకు తీసుకెళ్ళేవాడు. ఇప్పుడా ముద్దులు మురుదులు అంతా దూరమై పోయింది బుజ్జికి. పాపం! బుజ్జి ఏడ్వని నిముషమంటూ లేదు. రోజు రోజుకు కుమిలి కుమిలి కృశించి పోతూంది. అందంగా చందమామ వన్నెలా నల్లగా వుండే బుజ్జి నలుపు తిరిగి అంద విహీన అయిపోయింది.

ఆరుమాసాలు గడిచాయ్. ఆరోజు లీలా రామారావులు ఏదో అవసరమైన పనిమీద బజారు వెళ్ళారు. బహుశ పాపకు బట్టలు తేనుంటుంది. ఎప్పుడు ఎక్కడికి పోయినా బుజ్జికి చెప్పి ఇల్లును జాగ్రత్తగా చూచుకోమని వెళ్లేవారు. ఈనాడు యింటికి తాళం వేసి వెళ్ళిపోయారు... ఆ తాళం చూచి బుజ్జి కుమిలిపోయింది.

కొన్ని గంటల తర్వాత లీలా రామారావులు యింటికి వచ్చారు. తాళం తీసి లోనికి ప్రవేశించారు. అంతలో ఎదురుగా మేడమెట్లు దిగివస్తున్న బుజ్జిని చూచి రామారావుకు మండిపోయింది. బుజ్జి నోటిలో పాపవుంది. ఈ దృశ్యం చూచి గట్టిగా ఏడ్చింది లీలావతమ్మ... రామారావు వెంటనే ఒక పెద్ద బెత్తం తీసుకొని బుజ్జిని చావమోదాడు. పాపను లీలావతమ్మ బుజ్జి నోటినుండి లాక్కొంది. ఆ దెబ్బలకు బుజ్జీ నోటినుంచి రక్తం ఏకధారగా ప్రవహించింది.

ముందే కృశించిపోతున్న బుజ్జీ ఆ దెబ్బలు తగిలి ప్రాణాలు విడిచింది. "పీడ తొలగింది" అని బెత్తం మూలపారేసి మేడమెట్లు ఎక్కి యిద్దరూ వెళ్లారు.

మేడమీదికి వెళ్ళంగానే యిద్దరూ ఆశ్చర్య చకితులయ్యారు. పాప పరుండే పూల వుయ్యాల మండిపోతూంది. అప్పుడే సగం కాలిపోయింది!... ఈ దృశ్యం చూచి రామారావు "బుజ్జీ" అంటూ గట్టిగా అరచి బుజ్జీ చెంతకు పరుగెత్తాడు. బుజ్జి శరీరం రక్తంలో నాని ముద్దయింది. అలాగే బుజ్జీని తన తొడపై పరుండబెట్టి "బుజ్జీ... తెలీకుండా చేశాను... క్షమించు బుజ్జీ... యీ పాపిని క్షమించవూ... బుజ్జీ నీ వెంత మంచిదానవు. నా పాపకు ప్రాణదానం చేశావు... బుజ్జీ... మాట్లాడవు... పోనీ ఒక్కసారి... కళ్ళు తెరచి నావైపు చూడు బుజ్జీ!... చూడు!... బుజ్జీ!......బుజ్జీ!..." అంటూ బుజ్జీ నెత్తుకొని బయట వెళ్లిపోయాడు రామారావు!... ★

వనితా లోకం

మంచి చెడ్డా:

★ ఇది నిజం కాదు ★

ఆంధ్రప్రదేశ్ రాజధాని అయిన హైదరాబాద్ లో పని మనుష్యుల ప్రవర్తన గురించి అన్నపూర్ణా రామారావుగారు మరీ విడ్డూరంగా వ్రాశారు. అయిదారేళ్ళనుంచీ హైదరాబాదులో ఉంటున్నాను. అన్నపూర్ణగారు చెప్పిన రకం పని మనుషులు నాకెక్కడా కనిపించలేదు సుమండీ. హైదరాబాద్ రాజధాని అవటంవల్ల పని మనుషుల గిరాకీ పెరిగిందన్నారు. అందులోనూ, ఇల్లు ఊడ్చి, అంట్లు తోమడానికి పాతిక రూపాయలు పుచ్చుకుంటున్నారని వ్రాశారు. ఈ సంగతి పొరుగూళ్ళవాళ్ళు వింటే ఏమనుకుంటారు! హైదరాబాదులో మనుషులు ఎలా బ్రతుకుతున్నారో బాబూ అనుకోరూ!

మాదేమీ జమీందారీ సంసారం కాదు. పదిమంది నౌకర్లను పెట్టుకునే తాహతు లేదుగానీ, ఒక్క పని మనిషితోనే అన్ని పనులూ అయిన వనిపించుకుంటున్నాం. మా పనిమనిషికి నెలకి పది రూపాయలు ఇస్తాం. ఇదివరకు "హాలి" ఇచ్చేవాళ్ళం - ఇప్పుడు ఐ. జి. ఇస్తున్నాం. మా యింట్లో నలుగురం ఉంటున్నాం. అయిదుగదులూ, బాత్ రూమ్, రెండు వరండాలూ, చిన్న కాంపౌండూ ఉన్నాయి. పని మనిషి ఇల్లూ వాకిలీ ఊడుస్తుంది. అంట్లు తోముతుంది. మధ్యాహ్నంపూట బట్టలు ఉతికి ఆరవేస్తుంది, నెలకోసారి బియ్యం, పప్పులూ, ఆవాలూ మొదలైన సామాన్లు బాగుచేస్తుంది. కుండీలలో ఉన్న మొక్కలకు నీళ్ళు పోస్తుంది. ఇంకా ఏం చెయ్యాలి చెప్పండి! ఇది మా ఒక్కరికే పట్టిన అదృష్టమనుకుంటారేమో, మాచుట్టుపక్కల చాలా మంది పదీ, ఎనిమిదీ ఇచ్చేవాళ్ళే. పాతిక రూపాయలిమ్మని ఏ పనిమనిషీ అడగదు. అడగడానికి వాళ్ళకి దమ్ములు కూడా లేవు. అంతా పక్క పక్క పల్లెటూళ్ళనుంచి వచ్చి పట్నంలో ఉంటున్న జనం.

గిన్నెలు దొంగతనంగా పట్టుకుపోయే అలవాటు ఏపనిమనిషికీ లేదిక్కడ. ఒకవేళ మనగిన్నెలు వీపులుసుతోనో దేంతోనో వాళ్ళ ఇంటికి పట్టుకెళ్ళినా, చెప్పి పట్టుకెళ్ళి మళ్ళీ తప్పకుండా తీసుకొచ్చేస్తారు. చివరికి చెంచాలుకూడా ఎప్పుడూ పోవు. దొంగతనం చేసే పనిమనుషులు నూటికీ కోటికీ ఉండటం ప్రకృతిసహజం. మాయింట్లో ఏబల్లమీద చూసినా చిల్లరడబ్బులు ఉంటూనే ఉంటాయి. చీకటితోవచ్చి పనులుచెయ్యటం ప్రారంభిస్తుంది మాపని అవ్వ. ఎప్పుడూ చిల్లిదమ్మిడీకూడా ముట్టుకోదు. చెయివాటుతనం ఉండేవాళ్లు ఇక్కడేకాదు ఎక్కడైనా ఉంటారు.

ఎ. ఛాయాదేవి

(హైదరాబాద్)

ఇక పాతికరూపాయలు అడిగే వాళ్ళెవరయ్యాఅంటే, మామూలుగా అంట్లుతోమి ఇల్లూడ్చేరకం కాదు. ఇంట్లో పైపన్లు అన్నీ చేస్తూ, పిల్లలుంటే వాళ్ళని సాకుతూఉండే "ఆయా లే" అడుగుతారు పాతికో ముప్ఫయ్యోను. వాళ్ళకే యీ "చాయ్, నాస్తా" లివ్వటం! వాళ్ళని సంసారపక్షంగా ఉన్న వాళ్లు భరించడం కష్టమైనమాట వాస్తవమే. అయితే వీళ్లు రోజంతా మనింట్లోనే ఉంటారు మరి. పదిరూపాయల అవ్వలైతే పొద్దున్నా మధ్యాహ్నం వచ్చి పనిచేసి వెళ్లిపోతారు.

అంచేత, అన్నపూర్ణా రామారావు గారి మాటలువిని హైదరాబాదు పనిమనుషులంటే హడలిపోవల్సిన అగత్యంలేదు. ఆమాటకొస్తే బెజవాడవైపు పనిమనుషులకన్న హైదరాబాదువైపువాళ్లు లక్షరెట్లు నయం. వీళ్లని కసిరినా పడతారు. అటువైపువాళ్లు నానా బూతులూ తిడతారు మనం నోరు జారామంటే. అంతేకాదు. అటువైపు అంట్లు తోమడానికి అయే చింతపండు ఖర్చు ఇంతా అంతా కాదు. ఇక్కడివాళ్లు చింతపండు ఎప్పుడో గాని అడగరు. మట్టితోనే బరబరా తెల్లగా తోమిపడేస్తారు.

ఏదియేమైనా, "మన కొత్తరాజధానిలో ఇదీవరస" అని అన్నపూర్ణా రామారావు గారు పనిమనుషుల గురించి అంత విపరీతంగా చెప్పటం అన్యాయమే. ★

ఆంధ్ర మహిళాసభ

ఆంధ్ర మహిళాసభ (మైలాపూరు, మద్రాసు) నిర్వహిస్తున్న మహిళా విద్యాలయం, పారిశ్రామిక విద్యాకేంద్రం, ముద్రణశాలలలో శిక్షణ పొందగోరే వారిలో పేదలయిన కొద్దిమందికి ఉచితంగా వసతి గృహ సదుపాయాలు కల్పించాలని సభవారు నిశ్చయించినట్లు సంయుక్త కార్యదర్శిని శ్రీమతి బి. తిమ్మాబాయ్ తెలియచేస్తున్నారు. ఈసహాయం పొందగోరే మహిళలు తమతమ దరఖాస్తులను ఈనెల 25 వ తేదీ లోపల పంపించాలి. వాటితోపాటు నాలుగణాల తపాలా బిళ్లలు జతపరచాలనీ సంయుక్తకార్యదర్శిని తెలుపుతున్నారు. దరఖాస్తులు ఆంధ్ర మహిళాసభ (మైలాపూరు మద్రాసు) కార్యదర్శికి పంపాలి.

'సరి' సరాలు

పెడసరి

అమ్మలూ నీ పేరేమిటోయ్ అని ఎవ రేనా లాలనగా అడిగితే, వినయం, వందనం, నేవలీకం ఉన్న పిల్ల, చక్కగా నెమ్మదిగా చెప్తుంది. అసలలా చెప్తేనే ఆ పిల్ల విద్యా వినయం గణన కెక్కుతాయి. అడిగినవాళ్ళు ఓహో అల్లవారి పిల్లమ్మ ఎంత బుద్ధిమంతురాలనీ! అని చెప్పుకుంటారు. అలా కాకుండా, అడిగిన ప్రతివాళ్ళకీ చెప్పే దేవిటిలెస్తూఅని విర్ర వీగుడు తనంతో నిస్సాకారంగా జవాబిస్తే అడిగిన వాళ్ళకి గొప్ప చిరాకేస్తుంది. అక్కడికి మహ ఈ పేరు తెలీకపోతే ఇహ వాళ్ళకి వచ్చే మా భాగ్యం కాస్తా రాకుండా పోతుందని కాదుగాని, ఇస్సీ ఇది మన్ని ఎంతలో తూలనాడేసిందని మనస్సు చివుక్కు మనిపించిస్తుంది. ఇంతలో నే ఉంది మంచీ చెడ్డాను.

పేరంటే పేర నేకాదుస్మండీ. మాట వరసకి చెప్పాను. ఒక వేళ, వాళ్లికక్కర్లేని ఊసే, మనం చెప్పవల్లగాని విషయమే అడిగారే అనుకోండి. అప్పుడుకూడా కాస్త నెమ్మదిగా నే జవాబు చెప్పిస్తే ఎంత ముచ్చటగా ఉంటుంది.

నే నేదో తీరుబడిగా కూర్చుని ఊ నీతి మాటలు రాసిస్తూన్నానని అనుకోకండి. ఎందుకంటే ఇరుగూ పొరూగు ఆడుకునే మాటలు పొద్దు పొడిచింది మొదలుకుని అస్తమానందాకా విన్నాను గాబట్టి చెప్పమనసయింది. అంతికన్న మరేంలేదు. ఇంకోటి ఈ పెడసరిగుణం చదువుకున్న పిల్లలికే ఎక్కువంటారుగానినన్నడిగితే, ఇన్నాళ్ళాయిచూస్తూన్నాగదా, ఘటుఘారం అవనివాళ్లెందరోగీర్వాణంగా మాట్లాడ్డం నేనెరుగుదును. ఎంత డబ్బున్నా, ఎంత చదువున్నా, మనస్సు ఎంత మంచిదైనా నోటి దురుసుతనం, పెడసరి జవాబులు ఇవ్వడం, మహాలావు టెక్కు చూపించడం మంచిది కాదు.

ముంజులూరిపర్వతవర్ధని, శ్రీకాకుళం.

* * *

బెట్టుసరి

ఈ 'బెట్టుసరి' అనేమాటను మనపెద్దలు ఎక్కువగా వాడుతూఉంటారు. ఒక ఇంటికి ఒక 'బెట్టు' ఉన్న తాళంవేస్తే అందులోనికెవ్వరూ ప్రవేశించలేరు. అదేవిధముగా మనుష్యులుగూడా బెట్టుగాఉంటే ఇతరులు వారిని ఏమియు చేయలేరనియు బెట్టులేకుండాఉంటే అందరికి లోకువఅవుతారనీ అంటారు.

ఈ బెట్టుసరి అనేది నాఉద్దేశ్యంలో ఏమంత మంచిఅలవాటుగాదు. ఇది ఒక వ్యాధిలాటిది. ఈ ప్రభావానికి లోనైన వారంతా ప్రత్యేకమైన లక్షణాలుగల్గి ఉంటారు. ఈలక్షణాలు గల్గినవారిలో ఎక్కువ భాగం మగవారే ఉంటారు. అలాఅన్నంత మాత్రాన ఆడవారిలో లేరని కాదు.

బెట్టుసరి మనుష్యుల లక్షణాలు మనం తేలికగా గమనించవచ్చు. (1) వారు అవసరమైనదానికన్నా కొంచం తక్కువగా మాట్లాడుతారు. (2) తమతో ఎవరైనా ఏవిషయాన్నైనాసరే చెప్పుచున్నప్పుడు విని నట్లు, విననట్లు నటించుచూ ప్రక్కగోడ వైపో లేక కిటికీలవైపో చూస్తుంటారు గాని చెప్పేమాటలు వినిపించుకున్నట్లు కన్పించరు. (3) వారికేవిషయం తెలుసో ఏదితెలియదో ఇతరులకు తెలియనివ్వరు. అన్నీ తెలిసినట్లే కన్పించుతారు. (4 వారు చిరునవ్వుగూడా కష్టంగానే నవ్వుతారు. ఎల్లప్పుడూ తీవ్రంగా కన్పిస్తుంటారు. (5) వారిచూపు ఇతరులను భయపెట్టేలాగుంటుంది. (6) వారినిమించినవారిని ఎదట ఈ బెట్టుసరి మాయమౌతుంది.


ఈ బెట్టుసరిని నేను అసహ్యించుకొన్నట్లుగానే మావారుగూడా అసహ్యపడతారు. సంక్రాంతి పండగకు వారు మాయింటికి వచ్చినప్పుడు ప్రొద్దుపోయేదికాదు. పత్రికలైనా తెప్పించుదామంటే మాది పల్లెటూరు అయినందువల్ల వీలుపడేదికాదు. పోనీ నేనైనా కబుర్లుచెప్పి కాలం వెళ్ళబుచ్చుదామనుకొంటే నాకుసిగ్గుగా ఉండేది. అసలు అదీకాక, ఒక వేళవీరు బెట్టుసరిగా ఉండే మనిషేమోనని అనిపించేది. వారసలేపలకరించేవారు కారు.

ఇద్దరికిద్దరమూ బెట్టుసరిలే అనుకున్నాము. సరే, కొన్నాళ్ళకు కాపరానికివెళ్ళిన తరువాత నేనువారితో మాట్లాడుతూ ఉంటే చాలచనువుగా, ఆప్యాయంగా మాట్లాడే వారు. ఎప్పుడైనా సరదాకి బెట్టుసరిని అమలులోపెట్టి దానిలోని కష్టసుఖాలను పరిశీలించుదామని అనుకొనేవారము గాని ఒకగంటసేపు మాట్లాడుకోకుండా బెట్టుగా ఉండాలంటే మహాకష్టమనిపించేది. ఎవరిమో ఒకరము వ్రతానికి భంగం గలుగ చేసేవారం.

బెట్టుసరి పెత్తనదార్లకు, పెద్దపెద్ద యజమానులకు కొంతవరకు అవసరమేమో గాని, అది సహజముగా వచ్చినదై యుండి, దానిని సాంసారిక జీవితములోగూడా ప్రవేశపెట్టిన ఆ సంసారములో సుఖముఉండదు. సంతోషము ఉండదు. దాంపత్యజీవితం ప్రేమ పూరితంగా, సాగాలంటే 'బెట్టు' అనేది పిశాచాన్ని దూరంగా ఉంచాలి.

ఎం. లక్ష్మీనరసమ్మ (ముప్పాళ్ల)

* * *



చోళీ చేతులకు డిజైన్

బొబ్బాబేబి, (కవుతరం.)

డాబుసరి

మనకు నిత్యజీవితంలో రకరకాల మనుష్యులు తారస పడుతూంటారు. వీరిలో మంచివారు, చెడ్డవారు, అసూయపరులు, డాబుసరివాళ్ళు ఇల్లారకాలుగా ఉంటుంటారు. ఇందులో డాబుసరి వాళ్ళు తమ మాటల్లో ఎప్పుడూ తమ గొప్పనే ప్రదర్శిస్తూంటారు. వీళ్లు ఒకమాదిరి. ఇంకోరకం ఉన్నారు. వీరు తమ గొప్పలుచెప్పటమే కాక ఎదుటివారిని కించపరుస్తారు మాటలతో. ఎదుటివారిలో తప్పు ఎంచడమే వారిపని. దానితో తృప్తి పడుతారు కాని ఎదుటివారి మనస్సుకు ఎలా నొప్పికల్గదో వీరు గ్రహించరు. మా పరిచయస్తురాలొకామెవుంది. ఆ విడవచ్చిందంటే అన్నీ ఆరాలు తీసేది. ఈ క్రేప్ ఎంత కొన్నారు? అంటుంది.

ధర చెప్తామనుకోండీ. "అబ్బే ఇది అసలు క్రేప్ కాదు కల్తీది. లేకపోతే ఇంత చవకలో దొరకదు. మొన్న మావారు గజం 4 రూ పెట్టి తెచ్చారు. అదీ క్రేపంటే" అంటుంది పుసుక్కున. "ఈ చీర ఎక్కడ కొన్నారు నాణ్యం సరిలేదు. అట్టేమన్నదు. దండగ. అని,అబ్బ ఈకూరలు మీరెల్లాతింటారండీ మావారికి ఈతుక్కు కూరలు (బంగాళాదుంప వగైరా) సహించవు." ఈరీతిగా మాట్లాడేది. తీరా ఒకదినం వారింటికి పోయి చూస్తే మనంచేసే కర్చులో మూడువంతులు లేదు. వారికర్చు, ఏదో ఒక పప్పు కూర, చారు. రాత్రి ఊరుగాయి ముక్క. నిత్యం ఇదే. మాటలు కోటలు దాటుతాయి.

కంకిపాడులో మా వారు ఉద్యోగం చెస్తున్న రోజుల్లో మా ఇంటివారి బంధువు ఒకామెవచ్చింది. మా ఇంట్లో వెల్లుల్లి ఆవకాయ ఇష్టంగా వాడుతాము. అది ఆమెకు ఇష్టంలేదుట. పోనీ అంతటితో ఊరుకోవచ్చా అబ్బా ఆపాయలు లద్దిపురుగుల్లా ఉంటాయి. ఏంబాగుంటుంది అనేసింది.

ఇంకచూడండీ ఆరోజునుంచి. ఆ ఊరగాయి వేసుకొన్నప్పుడు ఆమాటలు గుర్తుకొచ్చి వెలపరం వేసేది. మాట మాట్లాడేటప్పుడు తమ మాటలు ఎదుటివారి నేవిధంగా కష్టంకల్గించేది తెలుసుకోరు ఈ రకం వాళ్ళు.

మా పక్కింటావిడ ఒకరోజు గిన్నెడు చక్కెర బదులు తీసుకువెళ్ళింది. తీసుకొనే ముందు తమ ఇంట్లోరోజుకు ఐదు, ఆరుసార్లు కాఫీ త్రాగుతారనీ, బోలెడుచక్కెర కర్చనీ, ఆరోజు బజార్నించి తెచ్చేలోపునే అర్జంటనీ తేగానే ఇస్తామనీ ఒక ఉపోద్ఘాతం ఇచ్చి,వెళ్లింది.

వారంఐనా ఇవ్వలేదు. ఆరోజు అదివారం, కొట్లు మూసేశారు. చక్కెర నింపుకుంది. పక్కింటావిడ ఇవ్వాలికదా? అని అడిగాను.

అబ్బే ఇంకా తెప్పించలేదండి. చేతిలో మనిషిలేక మీరిచ్చిందే వాడుతున్నా ఈరోజు తెప్పించిస్తానంది. నేనిచ్చింది రెండుపలాలుంటుంది.

రోజుకి ఐదు ఆరుసార్లు కాఫీత్రాగి తెగ కర్చుచేసేసే వారింట్లో ఈ రెండు పలాలతో ఎల్లాగడిచిందా అని ఆశ్చర్యం వేసింది. క్రితంరోజు, కేసరీ చేశానని చెప్పింది కూడా. ఇల్లాఉంటాయి వీరి డాబుసరి కబుర్లు. నిజం చెప్పాలంటే వారుచెప్పిందాంట్లో అరసగం కూడా నిజం ఉండదు. తమ గొప్పను ఎదుటివారిముందు, డాబుసరి కబుర్లతో ప్రదర్శించి మెప్పుపొందాలను కోవడం కంటే తమ మంచిమాటలతో ఎదుటవార్ని ఆకర్షించి, మెప్పుపొందడం ఉత్తమం. ఒకరికి గౌరవం ఇచ్చి పుచ్చుకోవడం మేలుకాని, ఎదుట వారిని తీసిపారేసి తాము గొప్పలకు పోతే మొదటికే మోసం వస్తుంది.

కె. పార్వతీదేవి చిత్తూరు.

* * *

వీరు సరే సరి

"చెప్పులు కొత్తగాకొన్నట్టున్నావే,ఎంత?"

"ఎంతో చెప్పుకో చూద్దాం"

"రూపాయిన్నరో రెండో వుంటయ్."

నా మనస్సు కలుక్కుమంది. నిజానికి అవి నేను ఆరు రూపాయలిచ్చి కొనుక్కున్న చెప్పులు. వాటిమీద పనితనం చూస్తే తెలుస్తూనే వుంది అవి అయిదు రూపాయిలపైన విలువచేస్తయ్యని.

"ఒహో అల్లాగా" అని వూరుకున్నా నేను. అటువంటి వాళ్ళకి నిజం చెప్పినా బుర్రకెక్కదు గనక. సాధారణంగా మనలో చాలామంది కొత్తవస్తువేదైనా "ఎంత" అని అడిగితే "చెప్పుకో చూద్దాం" అంటూ వుంటాం. ఆ అడిగినవాళ్లు కాస్త కల్చరు కల వాళ్ళయితే మన మనసు నొప్పించకుండా సమాధానం చెప్తారు. కాని కొందరు ప్రత్యేకం మన్ని కించ పరచడానికే చూస్తూ వుంటారు (పైన నేను చెప్పిన మనిషిలాటి వారు). ఒంటరిగా వున్నప్పుడు అంటే ఫరవా లేదుగాని నలుగుర్లో వున్నప్పుడు అంటే ఎంత కష్టంగా వుంటుందో ఆలోచించండి.

వి. ఆర్. దేవిగారు (తెనాలి) రాసినట్టు ఎక్కువగా ఇటువంటివాళ్లు ఏ పేరంటానికి వెళ్ళినప్పుడో సందుచూసి కసితీర్చుకున్నట్టుగా మాట్లాడతారు. మాటకి ఓ పేరంటానికే వెళ్ళామనుకోండి. మనం కట్టుకున్న చీర ఎంతని అడుగుతారు. ఖర్మం చాలక "ఎంతుంటుందంటారు?" అన్నామా ఇక చచ్చామన్నమాటే. అమాంతం 50 రూ॥ చీరెనీ 20 రూ॥ కింద కట్టేసి "ఇటువంటిదే మొన్న మా తోడికోడలు చెల్లెలు 20 రూ॥ ఇచ్చికొన్నదని" తిరిగి మనని నోరెత్తనీకుండా ఖచ్చితంగా చెప్పేస్తారు. దీన్ని ఒక విధంగా అసూయ అనే అనాలి.

మన స్త్రీ జాతిలో ఈ విధమైన సంకుచిత భావాలు సమసిపోయే మంచి రోజుకోసం నిరీక్షిద్దాం.

పి. వీణాపాణి (బందరు)

* * *


మర్యాద అంటే...

కొంతమంది స్త్రీలకు ఇంటికి వచ్చిన వారిని ఎలా మర్యాదచేసి వారిమనస్సును నొప్పించకుండా వుండాలో తెలియదు. కొంతమంది ఇంటికి ఎవరయినావస్తే తలుపు చాటునఉండి సమాధానము చెప్పేవారు ఉన్నారు. అదీ భయమువేస్తే తెల్లబోయి నుంచుని చూచే వారు వున్నారు.

ఈనాటి నాగరికత క్షణక్షణము పెరుగుచున్నకొలది స్త్రీ పురుషుల యొక్క మనస్తత్వాలు మారుతున్నాయి.


సినిమా బుకింగ్ లో టికెట్లుకొనడముచాలా కష్టముగా వున్నప్పటికి స్త్రీని చూడగానే టికెట్ ఇచ్చి సీటుకూడ ఏర్పాటుచేస్తారు. కాని తోటిసోదరుడు జబ్బులో బాధపడుతు రైలుకివచ్చినా అతనికి టికెట్ కొనిఇచ్చేదాత వుండడు. ఈనాటి పురుషులందరికి స్త్రీకి సహాయము చేయడములో వాళ్ళయొక్క ఉద్దేశ్యము తనుఉన్నత భావాలు కలవాడని చాటుకోవడమే!

(40-వ పేజీ చూడండి)



ముక్కెరముగ్గు

కొత్యంపూడి లక్ష్మీకాంతం (చీరాల)



'నై' తత్పురుష

ద్వితీయా తత్పురుష అలాగే ద్వితీయా, చతుర్థి పంచమీ తత్పురుషలూ అవీ చాలా ఉన్నాయి వ్యాకరణంలో. తెలుగు పరీక్షలో సమాసాల విగ్రహాలగొడవ వచ్చినప్పుడు ఇవీ, ఇంకా విభక్తి ప్రత్యయాలూ కంఠతా వస్తేకాని మార్కులు పడవు.

అయితే, మన నిత్యజీవితంలో ఇవన్నీ ఎలా ఉన్నా, "నై" తత్పురుష గురించిన మంచిచెడ్డలు, దాన్ని ఉపయోగించే పద్ధతులు కొంత బాగా తెలిస్తే కొన్ని మంచి మార్కులు వస్తాయని నా అభిప్రాయం.

సి. వి. విజయలక్ష్మి

జీవితంలో మంచిమార్కులు వస్తే అందరూ మనతో మంచిగా ఉంటారు. అందరమూ సంతోషముగా ఉంటాము. ఎవరితోనూ ఎవరికీ తగాయదాలు ఉండవు.

ఈ నైతత్పురుష అంటే ఏమిటి?

వ్యాకరణంలో నఙ్ తత్పురషకీ, జీవితములో నై తత్పురుషకి దగ్గిర సంబంధం ఉంది. నఙ్ తత్పురుష అంటే ముందర నేగెషన్ ఉన్నమాట అన్నమాట. అధర్మము (ధర్మము కానిది) అసత్యము (సత్యము కానిది) ఇలాంటివి. కాదు లేదు అని అర్థం ఇచ్చే అక్షరాలు వీటికి ముందర ఉంటాయి.

ఈరోజులలో చాలామంది (నామటుకు నేను, మీమాటుకు మీరు, మన తరవాత మనకి కావలసినవాళ్ళు మినహాయించి) ఈ నైఙ్ తత్పురుషని (అధర్మం, అసత్యం) శ్రద్ధాభక్తులతో గురితప్పకుండా అవలంబిస్తున్నారు. శిరసావహిస్తూన్నారు. కాని మనం ఎవరితోనైనా నువు అబద్ధం ఆడుతున్నావు అంటే వెంటనే 'నై' తత్పురుషని ఉపయోగిస్తు జవాబు ఇస్తారు. అంటే, "ఛీ లేదుపో, అది అబద్ధం కాదుపో" అని అనడం అన్నమాట.

ఎదటివాళ్లు మన మనస్సు నొచ్చుకుంటుందేమో అని ఆలోచించకుండా, నిజము గట్టిగా తెలుసుకోనకుండా "నువ్వు అబద్ధం ఆడుతున్నావు" అని కాస్త మొరటుగా మన మీద నఙ్ తత్పురుష విసురుతారు అనుకోండి. అప్పుడు మనకి సహజముగానే కోపము వచ్చివేస్తుంది. "లేదు ఫో" అని మనం కూడా మొరటుగానే ఇంకో 'నైతత్పురుషతో జవాబు విసురుతాముగదా.

చివరికి జరిగేది ఏమిటంటే, నువ్వంటే నువ్వు అని ఏకవచన సంబోధనముతో కూడిన మాట్లాట.

అలాగ కాకుండా ఇద్దరిలో ఏ ఒక్కరో నైతత్పురుషని జాగ్రత్తగా ఉపయోగించిన పక్షంలో పోట్లాటలూ మాట్లాటలూ జరుగవు అని నా అభిప్రాయం.

అసలు నా ఇంకో అభిప్రాయం ఏమిటే అంటే, ఈ నఙ్ తత్పురుషను—అధర్మం, అన్యాయం, అబద్ధం లాంటి మాటలను, సాక్ష్యము అయినంతవరకూ ఎవళ్ళమీద విసర కూడదు అని చెప్తాను.

ఉదాహరణ చూడండి:

"మీరు చేస్తున్న పని పూర్తిగా అన్యాయం"

ఇందులో నఙ్ తత్పురుషని అలా ముడి సరుకుగా వాడకుండానే, మన అభిప్రాయం చెప్పవచ్చును.

"మీరు కూడా కొంచెం న్యాయం ఆలోచించండి. మీకు తెలీందేముంది?" అనవచ్చు.

ఇంకొకటి "నువ్వు చెప్పేది పచ్చి అబద్ధం"

ఇందులో ఈ 'నఙ్' తత్పురుష తీసేసి నైతత్పురుషని వాడితే కొంత మెరుగు.

"నువ్వు నాతో మనసు విప్పి అసలు సంగతి చెప్పు. నాకు తోచినమాట నిజంగా చెప్పాలంటే, నువు నా దగ్గిర నిజం దాస్తున్నావు అనిపిస్తోంది."


లేదా, "నువ్వు నిజం చెప్పటం లేదు కదూ?" అనొచ్చు.

ఇంక మనము మరీ తరచుగా వాడే "నై" తత్పురుష. అంటే "లేదు" అనేమాట.

అసలు ఈ మాటని వాడడమే మంచి కాదు అని నా అభిప్రాయం.

నేనే అనికాదు. అది మన పెద్దవాళ్ళ పద్ధతి. రాయని భాస్కరుని గురించిన పద్యములలో "'లే' కేత్వమివ్వ నేరడు, దాకను కొమ్మివ్వ"డని ఉంది. అంటే 'లే—దు' అనే రెండు అక్షరాలు కలిపి ఆయన ఎపుడూ మాటాడలేదు అన్నమాట.

అలాగే, మన పెద్దలు చెప్పే మరొక మంచిమాట నోటితో లేదనే బదులు చేత్తో లేదను అనేది మన అందరమూ ఎరిగినదేకాని, దానిని అవసరం వచ్చినప్పుడు (పత్రికలకి వ్యాసాలు రాసినప్పుడూ, మీటింగ్సులో లెక్చర్లు ఇచ్చినప్పుడూ మినహాయించి) మనలో చాలామంది శిరసావహించటము లేదు అని నా అభిప్రాయము.



నిలువుటద్దం

ఎమ్. లక్ష్మీబాయమ్మ, జగ్గయ్యపేట.

చేతితో లేదనడం అంటే, ఎవరైనా భిక్షమేకాదు, ఏ చిన్న ఉపకారమునైనాకోరిన సమయంలో, వాళ్ళమాట పూర్తికాకుండానే కొంపమునిగినంత తొందరగా 'లేదూ' అని పుసుక్కున అనెయ్యకూడదూఅని.

మనకి చేతనైనంత సహాయం చేస్తే ఎదటివాళ్లు సంతోషిస్తారు గదా. అప్పుడు,— నేను చేయగలిగిన సాయం ఇది," అని అనవచ్చును. అప్పుడుకూడా "నేనింతకన్న ఏం చెయ్యలేను" అనడం మంచిది కాదు.

అందుచేత ఎప్పుడూ మనము—ముఖ్యంగా ఆడపిల్లలము— (మొగాళ్ళకి మనం చెప్పనావిన రుగా. వాళ్లు గొప్పవాళ్లు (ట).

"సిగ్గెందుకు?"!

"చదువుకున్న దానివి నీకెందుకింత సిగ్గు" .. అప్పుడే పరిచయం అయిన డాక్టర్ ఫ్రెండ్ ఒకావిడ అడిగారు. సమాధానం కోసం తడుముకోవలసి వచ్చింది. కాస్సేపు తటపటాయించి, సాలోచనగా, 'చదువుకుంటే సిగ్గు వుండకూడదా?' అని తిరిగి వారినే ప్రశ్నించాను. నవ్వుకున్నారు.

చాలామందికి ఇదొక అలవాటు, చదువుకున్న అమ్మాయిలకి సిగ్గు ఎందుకు? అని అడగడం. వాళ్ళ ఉద్దేశంలో చదువుకున్న ఆడపిల్లలకి స్త్రీ సహజమయిన సిగ్గు వుండడం అసహజం కాబోలనిపిస్తుంది. ఇక మొగవారితో కలిసి చదువుకున్న స్త్రీలకు వచ్చే ప్రశ్నలు ఓ.. కొల్లలు కొల్లలు. వాటికి జవాబు చెప్పినా తప్పే. ఒక వేళ చెప్పకపోయినా చిక్కే.

చదువుకున్న వారిలో ఈ సిగ్గు చాలా తమాషాగా కనబడుతుంది. కొందరికి మగవారి సమక్షంలోకి రావడం, మాట్లాడడం సిగ్గుగా వుంటుంది. ఆడవారున్న కంపెనీలోనికి పోవడముకూడా మరికొందరికి సిగ్గుగానే వుంటుంది.

మా విమల అంటూ వుండేది 'నలుగురు మగవాళ్లున్న చోటుకయితే నిర్భయంగా వెళ్ళగలం కాని ఇద్దరుఆడవాళ్లున్న చోటుకి వచ్చినా వెళ్ళలేం' అని. అవును. ఆ మాట నిజమే. ఎందుకంటే వాళ్ళు మన మీద ప్రయోగించే కామెంట్స్ (విమర్శలు, వ్యాఖ్యానాలు) విని బాధపడేకంటే, వెళ్ళకుండా ఉంటేనే నయం అనిపిస్తుంది.

కొందరు స్త్రీలకి టీపార్టీలకి, డిన్నరులక్, వెళ్ళడం అంటే బ్రహ్మప్రళయంలా వుంటుంది. నామట్టుకు అంతే. ఎక్కడికయినా జంకూ గొంకూ లేకుండా వెళ్ళగలను. కాని డిన్నరుకి మాత్రం నా తరం కాదు. అదయినా మొగా ఆడా కలిసినదయితే ఫరవాలేదు. ఏమంటారా? ఎవరి తిండి గొడవలో వాళ్ళుంటారు మన గొడవ ఎవరూ పట్టించుకోరు. అదే మన 'గెదరింగ్' అయితే ఏమిటమ్మా 'ఆసతారం? 'ఎక్కడా చూడలేదీ విడ్డూరం?' ఇంకా ఇలాటి ఎత్తిపొడుపు మాటలేవేవో వినవలసి వస్తుంది.

ఈమధ్య యింకో క్రొత్తవిషయం కని పెట్టాను. చదువుకున్న అమ్మాయికి విధిగా పాట వచ్చితీరాలి! "అంత చదువుకున్నావు. నీకు రావంటె ఎవరు నమ్ముతారు. అంటారు పోనీ పాడకపోతే సిగ్గు కాబోలు అనుకోరు. ఇక సాధింపులు "కాలేజీలో పరాయివాళ్ళ ముందర కచ్చేరీ చెయ్యొచ్చుగాని పేరంటలో పాడడానికి సిగ్గు అడ్డువచ్చిందేం" ఇలాంటివే యింకా ఏమేమో అంటారు. కాలేజిలో ప్రేయరు వేరు, పేరంటంలో మంగళహారతి వేరు.

ఈ సిగ్గెందుకు? అనే ప్రశ్న నన్ను చాలా కాలంనుండి ఆలోచనలలో ముంచుతూనే వుంది. దీనికి సమాధానం ఏం చెప్తాం? ఏమైనా, ఇలా "చదువుకున్న అమ్మాయికి సిగ్గెందుకు?" అని అడగకుండా ఉంటే మంచిదని తోస్తుంది.

'నీకెందుకు సిగ్గు' అని ఎవరయినా ఎత్తిపొడుపుగా అంటె ఎంతకష్టంగా వుంటుంది. ఆలోచించండి. బి. ఎ. ఎమ్ ఏ. ప్యాసయినా అమ్మాయిలు భర్తపేరు చెప్పడానికి సిగ్గుపడడం లేదూ!

స్త్రీకి అలంకారం సిగ్గే సిగ్గెందుకు? అంటే ఏం చెప్తాం?

సి. కామేశ్వరి.

* * *

"నై" తత్పురుష

ఈ 'నై' తత్పురుషశబ్దాలు "లేదు, కాదు, యివ్వను, చెయ్యను" అనేలాటి మాటల్ని సాధ్యమైనంతవరకువాడుకోకుండా వుండాలి. తప్పనిసరి అయినపుడు వాడినా, జాగ్రత్తగా సుతిమెత్తగా, ఎదటివాళ్ళని నొప్పించకుండా ఉపయోగించాలి అని నా అభిప్రాయం.

నేనిలా, మినిస్టర్లలాగా మాట్లాడుతూ ఉండడం చూచి, "అజ్ఞానం"అనే నఞ్ తత్పురుష మాటని, తొందరపాటుగా, పెంకెగా అందరి మీదా విసురుతున్నాను అని అనుకోవద్దు. ఈ నఞ్ ఈ విషయాలు మళ్ళీ ఒకసారి జ్ఞాపకము చేసుకొని ఇంకొంచెం శ్రద్ధగా ఆలోచించడం మంచిద అనే అభిప్రాయం లోటే. ★

సరాసరిన మనగుణాలు

[37 వ పేజీ తరువాయి]

నేనొకసారి మా వాళ్ళతో కలసి పేరంటానికి వెళ్ళాను. వారు చాలాగొప్పవారు: అలంకరణ అంతా బాగానేవుంది. ఇంటినిండా సోఫాలు, కర్టెనులు, రంగురంగుల దిపాలు ఓ! మహావైభవముగా వున్నది. వాళ్ళఇంట్లో అరడజనుకు తక్కువగాకుండా నౌకరులు వున్నారు

మేము తీరా అక్కడికి వెళ్ళేటప్పటికి ఎవ్వరు లేరు. ఎవరో ఒకావిడ మాత్రము పిల్లలని పెట్టుకు కూర్చుని వుంది. అయినా ధైర్యముచేసి మా వాళ్ళంతా లోపలకి వెళ్ళారు. నాకు మాత్రము చాలా చిన్నతనమనిపించింది సుమండీ! అయినా ఏదో విధంగా ఆవిడ ప్రక్కన కూర్చున్నాను.

ఎంతసేపటికి ఎవ్వరూ రాకపోయేటప్పటికి మహాచెడ్డ చిరాకేసినది. ఇంతలోనే మునిగిపోయినట్లు మా చిన్న చెల్లెలు ఏడ్పు ఆరంభము చేసింది. ఇక నేను వుండలేక ఆవిడగారిని అడిగినాను "ఏమండీ ఈ ఇంటి యజమానురాలు ఏరి" అని "నేను వచ్చి గంట అయినదమ్మా! ఆమె కూర్చోమని చెప్పి కారమీద ఎవరో ఆడవారు, మొగవారు వస్తే తీసుకుని వెళ్ళారు." అని చెప్పింది. నేను అనుకున్నాను బహుశ వాళ్లు ఘనవంతులై వుంటారని!

ఇక నాకు విసుగు ఎత్తి ఇంటికి వచ్చేశాను. అదీ సంగతి! ఇప్పటికి తలచుకుంటే చిన్నతనమనిపిస్తుంది.

దానికంటె మా ఇంటి దగ్గర ఎం. బి. బి. యస్. చదువుతున్న అమ్మాయి వున్నది. ఆవిడని చూస్తె ముచ్చటేస్తుంది. వారూ! ఘనవంతులే! ఆమె భర్తయే పట్టుబట్టి చదువు చెప్పిస్తున్నాడు. ఆ అమ్మాయికి గర్వమనేది లేదు ఎవరువచ్చినా తొందరగా పోనీయదు. ఏవో కబుర్లు చెప్పుతూనే వుంటుంది. ఆమెకు ఎరుగని వారితోకూడా ఒక రోజులో స్నేహము చేయగల సామర్థ్యము వున్నది.

ఒకసారి సరదాకి మా చెల్లెలని "ఏమే డాక్టరమ్మగారి ఇల్లు బాగుందా! ఆవేళ పేరంటానికి వెళ్లిన వారు నచ్చారా!" అని అడిగినాను కాని అది అంటుంది; వాళ్ళ ఇల్లు చాలా బాగున్నది కాని ఆవిడ మాత్రము బాగా లేదు! ★

పి. విశాలాక్షి. (మద్రాసు)

"కలికాలపు చోద్యాలేమీ కావు"

టి. సీతారామాదేవి
రాజమండ్రి

శ్రద్ధగా పరిశీలిస్తే అసలు ఈ శీర్షిక క్రింద పాత క్రొత్తల అలంకరణాలలో ఇంచు మించు భేదం లేనట్లు తేలుతుంది. పాతే కొత్త—కొత్తే పాత. నేటి యువతీ యువకులయొక్క వేషభాషలను చూసి ఎంతో మంది మన పెద్దలు వాటికి లేనిపోని అపార్థాలు కల్పించి వాటికి 'కలికాలపు చోద్యాలు' అనే బిరుదుకూడా అంటకట్టారు. పైగా వాటిపై తమ ఆక్షేపణను బహిరంగంగా "అయ్యో! ఏమి పోకులు వచ్చిపడ్డాయమ్మ! కలికాలంమాయగాని మా కాలంలో ఇవేవైనా ఎరుగుదుమా ఏమన్నానా?" అంటూ బుగ్గలు నొక్కుకొని మరీ చర్చలు సాగిస్తున్నారు. నిజంగా నవీనయుగం కాబట్టి నవ యువకులు యువతీమణులు కాలానికి, వ్యక్తిగత సౌకర్యాలకు, అనుగుణంగా పూర్వులయొక్క మోటుపద్ధతులకు కొంచెము నగిషీ ఇచ్చినట్టు మార్చి వాడుకలోనికి తీసుకొస్తున్నారు.

ప్రథమంగా శరీరాలంకరణాలను పరిశీలిద్దాం. నవనాగరిక లక్షణాలు కల్గి ఉన్న స్త్రీ, పూర్వపు కట్టుబాట్లను అతిక్రమించి వేషభాషలలోను, నిత్యసాంఘిక జీవనంలోనూ చాలా మారిపోయిందని ఒక అభిప్రాయం బయలుదేరినది. స్త్రీ పల్చని నాజూకు అయిన బట్ట ధరిస్తే ఒళ్ళంతా కనపడేలాగ ఉందని, అది పోకిరీతనం చాటుతోందని కొందరి అభిప్రాయం. పల్చని బట్టయొక్క నేత, కంటికికూడ కన్పించనంత సున్నితంగా మనదేశీయులు ఏనాడో నేసేవారు. అది, అప్పటివారి నైపుణ్యం చాటుతోంది. అయితే ఆ సంగతి విడిచేసి దానిని ఉపయోగించినందుకు ఇప్పటివాళ్ళ పోకిరీతనం చాటుతోందనడం సమంజసం కాదని నా అభిప్రాయం. కాకపోయినా మనదేశం ఉష్ణదేశం కాబట్టి పల్చని బట్టయొక్క అవసరం ఎంతైనా ఉంది.

మరికొందరు స్త్రీలు పల్చటి చీర కట్టవలసి లోపల లంగాలు మొదలయినవి ధరిస్తారు. కాని దానికికూడా పైన చెప్పిన పోకిరీతనమే అంటగడలారు కాని, మంచి ఉద్దేశంతో మాత్రం దాన్ని ఆమోదించరు కాకపోయినా పోకిరీతనమనేది అనాదినుంచే కొద్దో, గొప్పో ఉంటూనే ఉంది. పూర్వం జనాభా తక్కువ కనుక కొంచెం తక్కువగా ఉండేది. ఇప్పుడు జనాభా ఎక్కువ కనుక ఇప్పుడు ఎక్కువగా వుంది.

మరొక ముఖ్యవిషయమేమంటే ప్రస్తుత భారత నారీమణి కట్టూబొట్టూ మొదలయిన విషయాలలో కట్టుబాట్లను గౌరవించడం ఉగ్గుపాలతో నేర్చుకుంటుంది. కొంతకాలం వరకు రవికలకు చేతులు పైకి కుట్టించుకున్నా చాలామంది స్త్రీలు మన పూర్వీకులలాగే ఇప్పుడు తిరిగి జాకట్లకి చేతులు మోచేతులు దాటేలాగనే పెట్టించుకుంటున్నారు. ఇవి చిన్న మార్పులే తప్ప మర్యాద నతిక్రమించడం కాదు.



చోళీ చేతులకు
డిజైన్
దేవరపల్లి బుజ్జమ్మ, (అల్లూరు.)

ఇంక కాళ్ళకు జోళ్ళు అన్నారా—నిజంగా ఆరోగ్య సూత్రాల ప్రకారం బయటికి వెళ్ళినప్పుడు ప్రతివారు జోడు వేసికొని వెళ్ళడం ముఖ్యం.

పౌడరు, స్నో, సెంట్లు మొదలయిన పరిమళ ద్రవ్యాలకు పూర్వపు రారాజుల కాలంలోనే స్త్రీ, పురుషులు ఎక్కువ విలువ ఇచ్చేవారు. ఎటొచ్చీ ఆ ద్రవ్యాలు వేరు.

ఇంక ఆభరణాలలో మార్పులు చూస్తే వాటిలో కూడ పెద్ద మార్పులు లేవు. ఎటొచ్చీ ప్రజలయొక్క ఆర్థికస్థితి కొంచెం కుంటుపడింది కనుక బంగారం నగలు అనేక ఇతర లోహాలతో చేసిన (రోల్డుగోల్డు, జర్మన్ గోల్డు) ఆభరణాలు వాడుకలోనికి వస్తున్నాయి ఇవి ఒకవిధంగా (ఎకానమీ) పొదుపు అనవచ్చును కాని ఇటుబీదరికం, అనిగాని, అటు ఫాషన్ పోకిళ్ళు అనిగాని ఒప్పుకోలేము. పూర్వీకులు రాజులయొక్క ప్రాపకంతో ఆస్తులు సంపాదించారు కాబట్టి వారి స్థితిగతులు చాల బాగుండేవి. అందుచేత నగలు విస్తారంగా ఉపయోగించేవారు. ఆ విధంగా వారి గొప్పతనం చాటేవారు కూడాను. కాని ఈనాడు మనిషి కష్టపడి పనిచేస్తేగాని పొట్ట గడవదు. అందువల్ల తమ స్తోమతును బట్టి, ఏదో అందంగా ఒకటో రెండో నగలు వేసికోవడం అలవాటు చేసికొంటున్నారు.

గృహాలంకరణ సంగతి చూస్తే వాటిలో మాత్రం కొన్ని విషయాలలో స్వల్ప భేదం కన్పిస్తుంది ముఖ్యంగా ఇప్పటి ఇళ్ళు చాలా విశాలంగాను, తక్కువ వ్యయంతోను నిర్మిస్తున్నారు ఇంటిముందర చిన్న పూలతోట లేక పూలకుండీలు ఉంచుతున్నారు. గోడల అలంకరణాలు (గుమ్మాలకు పసుపు బొట్లు పసుపు రంగు వేయించడం వంటివి) కూడా తమకున్న తీరికను, ఓపికను బట్టి చేస్తున్నారు.


సమగ్రంగా పరిశీలిస్తే నవయువతులు, యువకులు మొగుగు దగ్గుపల్లు పరిసరాను కూలంగా పాతపద్ధతులను, ప్రస్తుత పరిస్థితులకు, తమ స్తోమతకు వీలుగా మార్చి, అవే అవలంబిస్తున్నట్లు స్పష్టం అవుతోంది గాని నవీననాగరికత అని విర్రవీగి పెద్దలు నిశ్చయించిన హద్దులు మాత్రం దాటిపోతున్నారు అనిపించదు. పాతే కొత్త; కొత్తే పాత. ★

పిల్లల పెంపకంలో:

చనువుచూపినా అలుసివ్వరాదు

'జయప్రద'
(చినకందుకూరు)

గింజని భూమిమీద పడేసి వర్షవాతాతపాలకు వదిలివేస్తే, అది చెట్టుగా రూపొందదు సరిగదా బ్రతికి మొలకెత్తడం కూడా అనుమానాస్పదమే. అలాగే, పిల్లలూను. పిల్లల్ని కని, తిండిపెట్టడంతో తలితండ్రులుగా మన బాధ్యత తీరిందనుకోరాదు. వారు పెరిగి పెద్దవాళ్ళయేవరకూ దిన దినం క్షణక్షణం కనిపెట్టి ఉండాలి సరియైన సంరక్షణ, కట్టుదిట్టమైన క్రమశిక్షణ లేకపోతే పరిస్థితులు బాధాకరంగా తయారవుతాయి. అన్ని విషయాలు మనం జాగ్రత్తగా ఆలోచించాలి. జాగ్రత్తగా వాళ్లని పెంచాలి.



టేబుల్‌క్లాత్ కార్నర్ - డిజైన్ 1.
పులుసూరి జాయికల్యాణి, (నెల్లూరు)


చదువు

ఉదాహరణకి మొదట చదువునే తీసుకొందాం. కొందరు తలిదండ్రులు తమ బిడ్డ అచిరకాలంలోనే పెద్ద పెద్ద చదువులు చదవాలనే అపేక్షచేత, పిల్లవాడికి సరయిన ప్రాయం రాకముందే బళ్ళో వేయించి 'బండ లెత్తించడం' జరుగుతోంది. విద్యను గురించి ఆలోచిస్తే ఆరేళ్లు దాటితే నేగాని పిల్లలలో ఒక పద్ధతీ క్రమమూ ఏర్పడతాయి అనిపించదు. ఈలోగా వాళ్లని గాలికివదలాలని కాదు. కథల్లూ పద్యాలూ నోటచెప్పించడం రోజూ ఓ కొత్త విషయం చెప్పడం, ఆటలూ పాటలూ నేర్పడం, బొమ్మలూ, బొమ్మల పుస్తకాలూ ఇవ్వడం మొదలగు పద్ధతుల ద్వారా వారిని బడి చదువుకు సిద్ధం చేయాలి. ఇదే గృహ విద్య. పిల్లల్ని బళ్ళో వేసినతరువాత ఈ గృహ విద్య మరింత కట్టుదిట్టం కావాలితప్ప నిర్లక్ష్యం చేయకూడదు. దీనివల్ల పిల్లలు తుంటరిపిల్లల్తో కలసి చెడిపోకుండా ఉండడానికి సాధ్యమవుతుంది. ప్రతి స్కూల్లోను మంచి పిల్లలూ చెడుపిల్లలూ కలిసి ఉండడం సహజం. దురదృష్టవశాత్తూ మంచి పిల్లల సాంగత్యం కంటే చెడుపిలల సావాసమే త్వరగా అబ్బుతుంది అసలు మంచి నేర్చుకోవడం కంటే చెడు నేర్చుకోవడం సులువు, చవుక. ఇది మానవునికి అతిసహజం.

బిడ్డ సుగుణాలకి మెరుగు పెట్టాలంటే తల్లి సైతం క్రమశిక్షణ పాటించేది, విద్యావతీ అయి ఉండాలి. రాత్రి దీపం ముందు కూచోబెట్టుకొని శ్రద్ధగా పిల్లల విద్యావిషయము, ఆరా తీయడానికి వీలవుతుంది. అంతే కాదు, వారు దారి తప్పినపుడల్లా, అడుగడుక్కీ పిలల్ని సన్మార్గంలో పెట్టడానికి అవకాశం ఉంటుంది.

అభిరుచుల్నిబట్టి విద్య

అభిరుచుల్ని బట్టి గూడ విద్య నేర్పడమనేది కొంత పడబోసిన సత్యం. కొందరికి సంగీతంమీదా, మరి కొందరికి చిత్రలేఖనం మీదా ఇంకా కొందరికి వ్యవసాయంమీదా అభిరుచి ఉండవచ్చు. కాని ఇవేమీ మనం గుర్తించకనూ, గుర్తించీ మన అభిరుచుల్ని



టేబుల్‌క్లాత్ మీదకి - డిజైన్
దేవరకొండ జానకి, (మద్రాసు.)

వాళ్ళ నెత్తిమీద బలవంతంగా రుద్దడం జరుగుతూంటుంది. ఇలాంటి బలవంతం ప్రోత్సాహంచేత ఏ ఒక్కదానిలో ప్రావీణ్యం సంపాదించలేక రెంటికీ చెడిన రేవడి అవుతారు. అభిరుచులు తెలుసుకుని, తగిన విధంగా ప్రోత్సహిస్తే పిల్లలు తప్పకుండా ప్రయోజకులు అవుతారు.

సానబెడితేనే...

కొందరు తల్లిదండ్రులు తమపిల్లలు గృహకృత్యాలు చేయించడంవల్ల అరిగిపోతారనో చిక్కిపోతారనో భయపడతారు. అసలు ఇటువంటిభయాలు నిజం అవకపోగా ఇంటి పనులు చేసుకోవడంవల్ల ఆరోగ్యంకూడా. గృహకృత్యాల నిర్వాకంనుండి పిల్లల్ని తప్పించడంచేత, అవేమిటో తెలియకుండా ఉండడంచేత దుర్బలంగానూ, అజాగ్రత్తగానూ తయారవుతారు. పోగా ముందుముందు ఇంటిపనులు బాధాకరంగా అవుపిస్తాయి. ఉన్న అంతస్థులోనే ఉన్నస్థితిలోనే ఉంచేట్టయితే త్వరలోనే వాళ్ళు పడుకున్న పక్కనికూడా ఎత్తలేని పరిస్థితిలోనికి రాగలరు. వయస్సు పెరుగుదలకొద్దీ నేర్పుతూపోవాలి డబ్బువిలువా, కాలం విలువా ప్రతినిత్యం బాధ్యతలూ గుర్తింపచేయాలి అప్పుడేవాళ్లు భావిజీవితంలో చక్కగా ఇల్లుచక్కబెట్టుకోవడం సాధ్యపడుతుంది.

మాటా, చేతా

తమపిల్లల ముందు తలిదండ్రులు సంభాషించుకొనేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. మాట్లాడే తీరుతెన్నులలో వాడే మాటలవిషయంలో తగినంతశ్రద్ధతీసుకోవాలి. ఒక్కొక్కప్పుడు తలిదండ్రులు ఆవేశంలో గాని ఆనందంలోగాని పరస్పర దూషణభూషణలు సాగించినప్పుడు మన ఎదుట పిల్లలుంటే బాగుండదు. ఎందుచేతంటే మనం మాట్లాడే ప్రతిమాటా ప్రతిచేతా పిల్లలు విమర్శనాదృష్టితో చూచి పర్యాలోచన చేసి తీవ్రంగా ఆలోచిస్తారు. పట్టుకోడానికీ ప్రతిబింబించడానికి బాల్యం దర్పణంలాంటిది. అంతేకాదు; అజాగ్రత్తగా నీటి తుంపర ఇనుపముక్కపై పడి త్రుప్పు పట్టిన తర్వాత తేలిగ్గా గుడ్డతో తుడిచి వేయలేం. అయుతంగానైనా తల్లిదండ్రుల (మరింతరయినా సరే) నోటినుండి వొచ్చే అపవిత్రమయినమాటలూ, నిర్దాక్షిణ్యమయిన మాటలూ పిల్లల లేత హృదయాలని గాయపరుస్తాయి; అలానే హత్తుకు పోతాయి కూడా. మనపిల్లల్ని ఇంకా అభివృద్ధికి రావాలనే కోరికతో అసంతృప్తితో ఎప్పుడూ చీదరించుకోవడం గానీ, గొప్పతనాన్ని పొగడడంగానీ తగదు. ఇవి వక్రమార్గాన పెడాయి.

మన ప్రవర్తన


రహస్యాలు సైతం పిల్లల ముందు యథేచ్ఛగా మాట్లాడుకోవడం హానికరం. అలా మాట్లాడుకోవడం మూలాన రహస్యాలు బట్టబయలవడానికి ఆస్కారం ఉంది. అవకమనం వాళ్ళని కొట్టినా తిటినా లాభంలేదు. తప్పుమనదే.

పిల్లల్ని తొందరపెట్టడంవల్ల, బాధించడంవల్ల వాళ్ళ మనసు ముందు గాయపడుతుంది. క్రమంగా వారికీ ఆ గుణాలు అలవడుతాయి. వాళ్లు చెడుదారిపడితే మెల్ల మెల్లగా మళ్ళించాలిగాని ముందరే తొందరపడకూడదు. చెడుతో చెడును, చప్పుడుతో చప్పుడును ఎన్నడూ జయించలేం పిల్లలపట్ల దయతో, ప్రేమతో ప్రవర్తించాలి. నెమ్మదిగా మాట్లాడాలి, మృదువుగా నవ్వాలి.

కాని హద్దు మీరకుండా అణగిఉండేట్టు విధేయతగా ఉండేవిధంగా చూడాలి. ఎంత చనువిచ్చినా, అలుసుమాత్రం ఇవ్వతగదు.

అసలవుతే, ప్రతివారూ ఎవరితోనైనా నెమ్మదిగా మాట్లాడ్డమే మంచిది. కాని ముఖ్యంగా పిల్లల విషయంలో శ్రద్ధ తీసుకోవాలి ఇది పురుషులో లోపించినా పిల్లల్ని అనుక్షణం కట్టిపెట్టి ఉండవలసిన తల్లులలో అవశ్యం ఉండవలసిన లక్షణం. సన్నటి తియ్యని కంఠస్వరం స్త్రీలో ఉండడం దొడ్డ విషయం. పిల్లల్ని చక్కగా పెంచే తల్లికి ఇది ఎనలేని రత్నంగా భాసిస్తుంది.

★



★ కిటుకు ★

అలపర్తి వెంకట సుబ్బారావు

కలడు ఒక్క గ్రామమందు
కడు దరిద్ర బ్రాహ్మణుండు
తెలివిలోన బృహస్పతిని
తలదన్నెడి వాడు అతడు!

అయిన నేమి? తిండిలేక
అవస్థ పడుచుండె నతడు!
అంత, నొక్కనాడు ఇట్లు
చింత జేసె కొంత సేపు,

"నదిని దాటి వెళ్లినచో,
నది కావల గ్రామమందు
సంతర్పణ జరుగుచుండె
సంభావన ముట్టగలదు!

"కాని, నదిని దాటి వెళ్ళ
కానిడబ్బు గూడ లేదు!
ఎటుల నదిని దాటగలను
అటువైపున కేగగలను?"

అదే పనిగ యోచించగ
అకస్మాత్తుగా నతనికి
మెఱపులాంటి యోచ నొకటి
మెఱసె బుర్రలోన తుదకు!

వెనువెంటనె నదియొద్దకు
వెళ్లినాడు బ్రాహ్మణుండు!
పడవ నడుపువాని బిలిచి
పలికినాడు ఈ రీతిగ,

"నన్ను నదిని దాటించిన;
నిన్ను లక్ష్మి వరియించెడి
కిటుకు నీకు చెప్పగలను
అటువైపుకు జనిన పిదప!"

అంతులేని సంతసమున
అందుల కంగీకరించి
పడవవాడు చేర్చినాడు
బ్రాహ్మణు నావల వైపుకు!

పడవ దిగిన బ్రాహ్మణుండు
వడివడిగా వెళ్లుచుండ,
పడవవాడు వెంబడించి
అడిగినాడు ఈ రీతిగ,

"నిన్ను నదిని దాటించితి;
నన్ను లచ్చి వరియించెడి
కిటుకేదో చెప్పవయ్య!
మాట దప్పబోకు మయ్య!"

"ఏమి లేదు! యిది మొదలుగ
ఎవరినైనగాని యిటుల
ఉచితముగా దాటించకు!
అచిరకాలమందె నీవు

ధనవంతుడ వగుదు" వనుచు
జనెను బ్రాహ్మణుండు వేగ!
కిటుకు తెలిసి పాప మపుడు
చిటుకుమనెను వాని మనసు!

మారు పేర్ల మహిమ

ఆర్. దొరస్వామి

పూర్వం ఒకగ్రామంలో పేరయ్య అనే ఒక పేదబ్రాహ్మణుడుండేవాడు. అతని భార్యపేరు కామమ్మ. ఆ దంపతులకు బుచ్చమ్మ అను ఒక కుమార్తె, పిచ్చయ్య అను ఒక కుమారుడు ఉండిరి. వారికి స్థిరాస్తులేవీ లేకున్నా చరాస్తులు ఒక గేదె, దాని దూడా ఉండేవి. గ్రామ పౌరోహిత్యంవల్ల లభించే స్వల్ప ఆదాయంతోనే సంతృప్తిపడి ఆ భార్యాభర్తలు సంసారాన్ని యెలాగో నెట్టుకుంటూ వచ్చారు.

సనాతన ధర్మాలపట్ల శ్రద్ధా భక్తులుకల పేరయ్య, కుమార్తెకు ఏడోయేటనే పెళ్లిచేశాడు. కాని, యుక్తవయస్సు రాకపోవటంచేత ఆ బాలిక యింకా అత్తవారింటికి కాపురానికి వెళ్ళలేదు.

ఇలా వుండగా ఆ గ్రామంలో అకస్మాత్తుగా మహా విచిత్రమూ, అపూర్వమూ ఐన ఒక భయంకర వ్యాధి వ్యాపించింది. దాని ప్రభావం వల్ల కొద్ది రోజులలోనే గ్రామ జనాభా సగానికి పైగా నశించి పోయింది. అదేంవ్యాధో, దాని నివారణోపాయమేమిటో యెవ్వరికీ బోధపడలేదు. తలవని తలంపుగా తమకు సంప్రాప్తించిన మహాపదకు గ్రామస్తులు గజగజలాడిపోయారు.

అటువంటి పరిస్థితిలో ఆ గ్రామానికి ఒక సాధువు వచ్చాడు. అతని వేష భాషల్ని చూసి అందరూ తప్పక అతడొక మహానుభావుడై వుంటాడని భావించారు. చావగా శేషించినవారంతా ఆయన చుట్టూ చేరి, తమ దుర్భర దుఃఖాన్ని మనవి చేసుకున్నారు. "ఎలాగైనా మమ్మల్ని యీ అకాల మృత్యువువాత పడకుండా రక్షించి పుణ్యం కట్టుకోనండి మహానుభావా!" అంటూ ఆయన పాదాలమీద పడి ప్రాధేయపడ్డారు.

కరుణాళుడైన ఆ సన్న్యాసికి వారి దీనాలాపాలు చాలా జాలిని కలిగించాయి. నిశ్శబ్దంగా వుండమన్నట్టు వారికి సంజ్ఞచేసి, నిమీలితనేత్రుడై కొంతసేపు మౌనంగా వుండి చివరి కిలా అన్నాడు:

"నాయన్లారా! భయపడకండి. అన్నింటికీ ఆ సర్వేశ్వరుడే వున్నాడు. ఇదంతా అతని లీలాప్రభావమే. ఈ వ్యాధికి మందంటూ యేదీ లేదు. అలాగని నిరుత్సాహపడకండి. ఈ వ్యాధి నివారణకు మార్గం లేక పోలేదు. అదేమిటంటే మీరందరూ మీ మీ పేర్లు మార్చిపెట్టుకోవాలి. అదే దీనికి దివ్యౌషధం" అని సెల విచ్చి వెళ్లాడాయన.

ప్రాణాలపై ఆశలు వదలుకొని వున్న ఆ పల్లీయులకు ఆ సాధు పుంగవుని వాక్యామృతాలు తిరిగి ఆశను రేకెత్తించాయి. తక్షణమే అందరూ వారివారికి తోచినట్లు పేర్లుమార్చిపెట్టుకున్నారు. పేరయ్య కూడా తనకు నేయి అనీ, భార్యకు పులగమనీ, కుమార్తెకు వెంట్రుక అనీ, కుమారునికి దూడ అనీ పేర్లు మార్చిపెట్టాడు. అంతేకాక గేదెకు చుట్టమనీ, దూడకు దయ్యమనీ కూడా నామకరణాలు చేశాడు.

సన్న్యాసి ప్రభావమో, మారు పేర్ల మహిమో, గ్రామస్తుల అదృష్టమో ఏమైతేనేం? ఆనాటినుండీ ఆ గ్రామంలో ఒక్కరూ చావలేదు. వ్యాధి నిశ్శేషంగా మాయమై పోయింది. భగవంతుడే ఇలా యతి వేషంతో వచ్చి తమ్ము వుద్ధరించాడని భావించారా గ్రామస్తులు. దేవునికి వుత్సవాలు చేసి తమ కృతజ్ఞతను చాటుకున్నారు.

అనేక మైళ్ళ దూరంలో వున్న పేరయ్య అల్లుడుగారికిమాత్రం యీ సంఘటనలేవీ తెలీవు. భార్యను చూసి చాల రోజులు కావటంచేత ఒక్కమారు చూసిపోదామని బయ ల్దేరి వచ్చాడతను. ఊరు యింకా క్రోసెడుదూరంవుందనగానే సంతకు వెడుతూన్న పేరయ్య అతని కెదు రయ్యాడు.

అల్లుని ఆగమనానికి పేరయ్య చాలా సంతోషాన్ని ప్రకటించాడు. కుశల ప్రశ్నలు వేసి "నాయనా! ఇంటివద్ద పులగం వుంది, నీవు వెళ్లు,

★ మారుపేర్ల మహిమ ★

నేను సంతకుపోయి యిప్పుడే తిరిగి వస్తాను" అని చెప్పి వెళ్లాడు.

కారణాంతరాలవల్ల రెండుపూట లుగా తిండిలేక వస్తున్న ఆ చుట్టానికి పులగం అన్నమాట వినేసరికి పోయినప్రాణం తిరిగి వచ్చినట్లైంది. తాను వచ్చేరాకముందే యింత చక్కటి యేర్పాటు చేసి వుంచినందుకు భగవంతునికి లోలోపలనే కృతజ్ఞతా వందనాలర్పించుకున్నాడు. మార్గాయాసాన్ని సైతం మరచిపోయి నాలుగంగల్లో యిల్లు చేరుకున్నాడు.

అల్లుడుగార్ని చూస్తూనే కామమ్మ ఆనందానికి మేరలేక పోయింది. మహాసంబరంతో అత గాడికి అన్ని మర్యాదలూ చేసింది. కుశలప్రశ్నలు వేసినతర్వాత యిలా అంది: "నాయనా! ఇప్పుడే భోంచేస్తావా? నేయి వచ్చేవఱకు వేచి వుంటావా?"

సంతనుండి మామగారు నేయి తెచ్చేలా వుంది. పులగంలోకి నేయి వుంటే మరీ బాగుంటుంది. ఎటొచ్చీ రెండు పూటలుగా వస్తున్నా. యిక కొంతసేపట్లో మునిగిపోయే దేమీ లేదు, అని అనుకున్న ఆ చుట్టం "అలాగే నేయి వచ్చేవఱకు వేచి వుంటాలే అత్తయ్యా!" అన్నాడు. 'పులగం, నేయి' అన్నవి తన అత్త మామల మారుపేర్లని అతని కెలా తెలుస్తుంది పాపం!

పేరయ్య యింటికి చేరుకునేటప్పటికి చాలా ప్రొద్దుపోయింది. కామమ్మ మడి కట్టుకుని వారిని భోజనానికి లేవమంది. మామా అల్లుడూ యిద్దరూ విస్తర్లముందు కూర్చున్నారు. అందులో అన్నం, ఒక్క చారూ తప్పితే యింకేమీ కనపడలేదతనికి. తన్ను యింత సేపూ నోరూరించిన పులగం, నేయీ లేకపోయేసరికి అతని ఆగ్రహం కట్టలు తెగింది. నిష్కారణంగా తన్ను ఏమార్చిన అత్త మామలపై కసికొద్దీ రెండోమారు వడ్డించిన అన్నాన్ని ముట్టుకోనైనా ముట్టుకోకుండానే లేచిపోయాడతడు.

ఇదంతా యేమీ తెలీని ఆ అమాయకపు టిల్లాలు కుమార్తెతో "అమ్మాయీ! నీ భర్త భోంచేసిన ఆ విస్తర్ని తీసుకు వెళ్ళి దూడ ముందు పెట్టు" అన్నది.

ఆమాట వినేసరికి అతడి ఆపాద మస్తకం క్రోధంతో మండిపోయింది. తన ఎంగిలిపడిన అన్నాన్ని తినడానికి అసహ్యపడి దూడకు పెడుతున్నారు శాబోలు. ఇంత అవమాన పరచిన వీరింట్లో యింక ఒక్కక్షణం సేపైనా వుండకూడదు. అని తలంచి తక్షణమే బయలుదేరాడతను.

అల్లుడుగారు అలిగి పోతున్నాడన్న సంగతి ఎలాగో తెలుసుకున్న పేరయ్య పరుగెత్తి వీధిలో వెడుతూన్న అతని చేతులు పట్టుకొని తిరిగి రమ్మని బ్రతిమలాడసాగాడు. ఎంత వేడుకున్నా ససేమి రానుపొమ్మన్నాడతడు.

ఈ గందరగోళం విని అమ్మలక్కలు పదిమందీ అక్కడ పోగయ్యారు. వారిని చూచిన పేరయ్య వారితో "చూడరండమ్మలారా! ఈయనగారు వచ్చి ఒక్క జాము సేపైనా కాలేదు. అప్పుడే వెడతా నంటున్నాడు. ఇతనికి మేమేం ద్రోహం చేశాము? ఈయనకు మేమేం తక్కువ చేశాము! నా వెంట్రుక కన్నా యెక్కువగానే చూస్తున్నానుకదా!" అన్నాడు.

తనభార్య మారుపేరు వెంట్రుక అని తెలియని ఆ ఆసామి అందరు ఆడువారి సమక్షంలో తనకు కలిగిన అవమానానికి కృంగిపోయాడు. ఇంకా కొంతసేపు యిక్కడే వుంటే తాను మరింకేం న్యూనత చెందాల్సి వుంటుందో అని భావించి తన కోపాన్నంతా ఎలాగో దిగమ్రింగి తిరిగి అత్తగారింటికేసి నడచాడు.

అల్లుడు ఎలాగైనా తన మాట మన్నించాడుకదా అన్న సంతోషంతో పేరయ్య కూడా అల్లుడి వెంబడే యిల్లు చేరుకున్నాడు.

అదే సమయానికి మేతకు వెళ్ళి వుండిన గేదె యింటికి వచ్చింది. దాన్ని చూడ్డంతోటే పేరయ్య భార్యతో "ఏమేవ్! ఇదిగో చుట్టాన్ని తీసుకువెళ్ళి కొట్టంలో కట్టివేసి దయ్యాన్ని వదలిపెట్టు" అన్నాడు.

అది విన్న అల్లుడుగారికి గుండె ఆగినంతపనైంది. ఈయింటికి వచ్చిన చుట్టాన్ని నేనేకదా! ఇంతటితోనైనా వదలిపెట్టక వీరు నామీద దయ్యాన్ని ప్రయోగించేలా ఉంది. ఉసురుంటే ఉప్పమ్మైనా బ్రతుకవచ్చు. వృథాగా యిక్కడెందుకు చావాలి? అని అనుకున్న ఆ చుట్టం ఉన్నట్టుండి పరుగు లంకించుకున్నాడు.

ఈమాటకూడా పేరయ్య అతన్ని వెంబడించాడు. కాని వయసుకాడైన అల్లుడి పరుగును అందుకోలేక

థీసియస్

కె. సదానందం

పూర్వం గ్రీసుదేశంలోని ఏథెన్సు అనే నగరాన్ని 'ఈజియస్' అనేరాజు పాలిస్తూవుండేవాడు. ఆ రాజు చాలా సాధు వర్తనుడు. అతడు క్రీటుదేశానికి ప్రభువైన 'మైనాసు'కు లోబడివుండేవాడు. సామంత రాజన్నతరువాత ప్రతిసంవత్సరం చక్రవర్తికి కప్పం కట్టవల్సి వుంటుంది. ఆదేవిధంగా ఈజియస్ మైనాసుకు ప్రతియేడు సుంకం చెల్లిస్తూ వుండేవాడు. కాని వింతఏమంటే అతను చెల్లించే సుంకం—ధనంకాదు, ధాన్యాలు కావు, ఆభరణాలుకావు. ఏడుగురు పురుషులు, ఏడుగురు స్త్రీలు.

ఈ స్త్రీ పురుషులు మైనాస్‌కు ఎందుకంటారేమో - క్రీటుదేశంలో అతి భయంకరుడైన రాక్షసు డొకడుండేవాడు. ఒకపెద్ద కొండగుహ వాడి నివాసం. ఏథెన్సునుండి ప్రతి సంవత్సరం తేబడిన స్త్రీ పురుషులు రాక్షసుని గుహలో త్రోసివేయబడుతూ వుండేవారు. రాక్షసుడు వాళ్ళను తింటూ క్రీటు ప్రజలను బాధపెట్టకుండా వుండేవాడు.

ఈజియస్‌కు ఒక కొడుకు వున్నాడు. అతనిపేరు థీసియస్. పద్దెనిమిదేళ్లు నిండేవరకు అతడు ఏథెన్సులోని తన తండ్రివద్దకాక యింకోచోట పెరిగాడు. అతడు చాలా బలశాలి. ధైర్యసాహసాలను ఉగ్గుపాలతో అలవర్చుకొన్నాడు. అదివరకే కొందరు రాక్షసులను కూడా చంపాడు. చివరికి తనస్వస్థలమైన ఏథెన్సుకువచ్చి సుఖంగా వున్నాడు.

ఒకనాడు థీసియస్ తన గుర్రాన్నెక్కి నగరసందర్శనానికి బయలుదేరాడు. నిత్యం ఆనందంతో కలకలలాడే ఏథెన్సునగరం ఆరోజు చిన్నబోయివుంది. వీధుల్లో జనసంచారం పలచగావుంది. ఎదురయ్యే ప్రతివ్యక్తి ముఖంలోను విషాదచ్ఛాయలు అలుముకొని వున్నై. కొన్ని ఇండ్లల్లో నుండి రోదన ధ్వనులు కూడా వినిపించాయి.

ఈ కొత్తతీరుచూచి థీసియస్‌కు ఆశ్చర్యం కలిగింది. ఆవిషాద తాండవాన్ని చూడలేకుండా వెంటనే తన అంతఃపురాన్ని చేరాడు. నగరంలోని నిత్యశోభ హరించుకుపోవడానికి కారణమేమిటని తండ్రి నడిగాడు. ఈజియస్ కుమారునికి సుంకం సంగతి చెప్పి "నాయనా! ఆ రాక్షసునివలన ప్రజలకు నానాటికీ మనశ్శాంతి నశ్నగిలిపోతోంది. ఈ రోజు సుంకంకోసం దూతవచ్చాడు. అందుకే ప్రజలంతా రాక్షసునికి ఆహారంగా ఎవరు ఎన్నుకో బడుతారో అన్న విచారంతో కుమిలి పోతూ వుంటారు" అన్నాడు.

సంగతంతా విన్నతరువాత సాహసోపేతుడైన థీసియస్ "ఆ ఏడుమంది పురుషుల్లో నన్ను ఒకణ్ణిగా పంపండి" అని తండ్రిని కోరాడు. అతని కోరిక విన్న ఈజియస్ కంగారుపడ్డాడు. అంతటి సాహసానికి ఒడిగట్టవద్దని కొడుకును ఎంతో వేడుకొన్నాడు. విలపించాడు. కాని, థీసియస్ తన మొండిపట్టు విడిచిపెట్టలేదు.

మరునాడు ఒక ఓడలో సుంకం మనుష్యులు బయలుదేరారు. వారిలో థీసియస్ ఒకడు.

ఓడ క్రీటుదేశాన్ని చేరింది. సుంకం మనుష్యులందరూ మైనాస్ దగ్గరకు తీసుకుపోబడ్డారు. "వీరిని చెఱసాలలో వుంచి ఒకరి తరవాత ఒకర్ని గుహలో త్రోయండి." అని తన భటులకు ఆజ్ఞాపించాడు రాజు. అప్పుడు థీసియస్ మైనాసుతో "మహాప్రభూ! దయచేసి అందరికంటె ముందుగా నన్ను రాక్షసుని గుహలోనికిపంపండి" అనిఅర్థించాడు.

ఆ మాటలు విని మైనాస్ నివ్వెరపోయాడు. థీసియస్ ఎవరో తెలుసుకొన్నాడు. అటువంటి ధైర్యశాలి అయిన రాజపుత్రుడు రాక్షసుని వాతబడటంయిష్టంలేక "అబ్బాయీ! నీ ధైర్యానికి సంతోషించాను. నీ ప్రయత్నాన్ని విరమించుకోవడం ఉత్తమం. నువ్వు యింటికి వెళ్లొచ్చు" అని చెప్పాడు రాజు. కాని థీసియస్ తన నిశ్చయాన్ని మరల్చుకోలేకపోయాడు.

(40-వ పేజీ చూడండి)

పోయాడు. ఇంతకూ విశేష మేమిటంటే ఇదంతా మారుపేర్ల మహిమే అని అప్పటికైనా తెలుసుకోలేకపోయాడు పేరయ్య పాపం! ★

వీరబాలకుడు

అవి ఢిల్లీసామ్రాజ్యాన్ని మొగలు చక్రవర్తి పరిపాలిస్తూన్న రోజులు. ఈ మొగలు సామ్రాజ్యాన్ని పరిపాలించిన చక్రవర్తులలో ముఖ్యులు ఆరుగురు. బాబరు, హుమాయూన్, అక్బరు, జహాంగీర్, షాజహాన్ మరియు ఔరంగజేబు మొదలైనవారు. ఈ సామ్రాజ్యానికి పునాదివేసినవాడు బాబరు. అంతస్థులు నిర్మించినవాడు అక్బరు. ఔరంగజేబు కాలంనుంచీ క్షీణదశ ప్రారంభమైంది. మొగలులకు రాజ్యతృష్ణ అధికం. వారి పాలనలో, అందులోనూ - ఔరంగజేబు పరిపాలనలో హిందువులు పడిన కష్టాలు-ఇన్నీ, అన్నీ కావు.

ఔరంగజేబు దక్షిణ దిగ్విజయయాత్ర చరిత్రలో చాలా ప్రసిద్ధికెక్కింది. ఔరంగజేబు మహారాష్ట్రుల్ని జయించడానికి కత్తికట్టాడు. అందుకని వారిని జయించడానికి డేరా వేసికొని, కొంతమంది మహారాష్ట్రుల్ని బందీగాచేసి ఉరిశిక్ష వేయించాడు. ఆ మర్నాడు సూర్యోదయానికి పూర్వమే ఒక పదేళ్ళ మహారాష్ట్ర బాలుడు చక్రవర్తి శిబిరానికి వచ్చి సేవకుల మన్ననలకు పాత్రుడై మొలాగో ఔరంగజేబు చక్రవర్తి దగ్గరకు చేరగలిగాడు.

చక్రవర్తి దగ్గరికి చేరగానే ఆ బాలకుడు అతని పాదాల్ని పట్టుకుని—"మహాప్రభూ! మా తండ్రిగారిని విడిపించి ఆ స్థానే నాకు ఉరిశిక్ష విధించమని" ప్రార్థించాడు.

ఔరంగజేబు అతని ధైర్య, సాహసాల్ని, పరాక్రమాన్ని ... పరీక్షించాలని ఒక బాకుతో అతని చెవిని నరికేశాడు, ఆ వీరబాలకుడు ఏమీ చలించకుండా—మళ్లీ అదే చక్రవర్తి — ఓరీ! మూర్ఖుడా! మృత్యువును కొని తెచ్చుకోకు' ...

వి. రత్నావళి

విధంగా అతన్ని ప్రార్థిస్తూనే ... ఉన్నాడు. చక్రవర్తి అప్పుడతని ధైర్యం చూసి రెండవ చెవినికూడా నరికేశాడు. అయినప్పటికీ కూడా ఆ బాలకుడు తనమనోనిశ్చయాన్ని మరల్చుకోలేదు. అలాగే నిలబడి చక్రవర్తి అనుగ్రహానికి ... ఎదురు చూస్తూ...వున్నాడు. అప్పుడు ... అది చెవి కోసినంతటి బాధకన్నా కూడా అధికతమమైన అవస్థ పడవలసి వుంటుంది" అని చెప్పాడు.

బాలుడు:- రాజా! అమూల్యమైన తండ్రి ప్రాణాలకోసం...తృణప్రాయమైన తనయుని ప్రాణాలు బలి ఇవ్వడమే ధర్మం! ... అది సుపుత్ర లక్షణం!...తండ్రి జీవించియుండినట్లయితే నావంటి అనేక పుత్రులను పుట్టించగలడు. కావలిస్తే నా శరీరాంగాల్ని ముక్కలు.. ముక్కలుగా కోసి తీసికోండి' ... పూజ్యనీయుడైన నా తండ్రిని మాత్రం స్వతంత్రుడిగా విడిచిపెట్టండి!...అని నిర్భయంగా అడిగాడు.

ఔరంగజేబుకి ఆ బాలకునిమీద కొంచెంకూడా జాలి కలుగలేదు, సరికదా మరింత ... వ్యగ్రుడై...అతడా బాలకుని తండ్రి శిరస్సును వెంటనే ఉరి తీయించివేయించాడు.

నిస్సహాయుడైన బాలకుడు తల బాదుకుంటూ మృతుడైన తండ్రి దగ్గరికి వెళ్ళి, అతని పాదాలమీద శిరస్సుంచి వెక్కి వెక్కి ఏడుస్తూ పదే పదే తండ్రి పాదాల్ని ముద్దు పెట్టుకోడం ప్రారంభించాడు. దానితో ఔరంగజేబుకి మరీ మంట బుట్టి నిర్దయుడై ఆ బాలకుణ్ణి ... అక్కడనుంచి వెడల గొట్టించాడు వెంటనే! ... ఆపదతో అణగగొట్టబడిన ఆ బాలుడు తన తండ్రి తలని గుడ్డతో మూట కట్టుకుని యింటికి బయలుదేరాడు బాధగా ... కానీ చక్రవర్తికి యింత చేసినప్పటికీ కూడా ఆ బాలునిమీద కసి తీరలేదు. అతని మనస్సుకి శాంతి కలుగలేదు. వెంటనే యిద్దరు సిపాయిల్ని ఆ వీరబాలకుని చంపమని వెంబడింపజేశాడు.

2

సిపాయీలతనిని వెతుక్కుంటూ ఒక మధ్యారణ్యంలోకి వెళ్ళి అతన్ని

చుట్టుముట్టారు. మొదటి వాడు ఆ బాలుణ్ణి చంపడానికి కత్తి ఎత్తగానే వెంటనే వెనుకనుంచి ఒక తీక్ష్ణమైన బాణంవచ్చి సిపాయీని ఒక్కనిమిషంలో నేలకూల్చేసింది. వాడక్కడే అసువులుకోల్పోయాడు. వెంటనే ఆబాలుడు రెండవవాణ్ణి కూడా కత్తితో పొడిచి చంపేశాడు.

బాలుడు వెనక్కి తిరిగి చూసే సరికి ఒక నవయువకుడు చిరునవ్వులు చిందులు త్రొక్కుతూన్న వదనారవిందంతో తనవైపుకే వస్తూన్నాడు. ఆ నవయువకుడు రాగానె ఆ బాలకుని "మహమ్మదీయమతాన్ని స్వీకరించమని...శివాజినీ నిందిస్తూ బలవంతపెట్టి బెదిరించాడు.

ఆ బాలకుడు—"నాకంఠంలో ప్రాణమున్నంతవఱకు మహమ్మదీయ మతం స్వీకరించజాలనని నిర్భయంగా జవాబిచ్చాడు.

మహారాజా ఛత్రపతి శివాజీ... ఒకదొంగ...బందిపోటుదొంగే అయినప్పటికీ నిర్ధనుల్ని, గోవుల్ని, బ్రాహ్మణుల్నీ రక్షించిన వాడని కూడా ఋజువుచేసికున్నాడు.

ఆ బాలకుని వీర, ధర్మపరాయణత చూసి ఆ నవయువకుడు, యువకరూపంలో నున్న శివాజీ సింహం యొక్క హృదయం కరిగిపోయింది. అతడా బాలుని హృదయానికి హత్తుకుని ఆనందంతో ఉప్పొంగిపోయాడు. కొంతసిపాయీ సిబ్బందితో అతన్ని అతని గ్రామానికి సురక్షితంగా పంపేశాడు.

రాత్రి అయిపోయింది. నది దాటి ఆ బాలుడు నిరపాయంగా యిల్లు చేరగలిగాడు. తండ్రితల తల్లి కెదురుగా పెట్టి తల్లిపాదాలకి నమస్కరించాడు.

దేశ, జాతీయ, భావౌన్నత్యానికి భంగం కలగకుండా ధర్మరక్షణకై తన ప్రాణాన్ని కూడా ఆహుతి చెయ్యడానికి కూడా నిజమైన కర్మవీరులు వెనుకంజవెయ్యరు. పువ్వు పుట్టగానే పరిమళించునట్లు చిన్నతనంలోనే మహాత్ములు కాదగ్గ లక్షణాలలవరుచుకోవాలి! ★

థీసియస్

(47-వ పేజీ తరువాయి)

థీసియస్ మైనాస్‌తో మాట్లాడుతూ వున్న సమయంలో రాకుమారి అయిన ఎరియాడ్నీ అక్కడ వుంది. థీసియస్ అందానికీ, సాహసానికీ ముగ్ధురాలయింది. ప్రథమ వీక్షణంలోనే తన హృదయాన్ని అతనికి అంకితం చేసేసింది.

ఆనాటిరాత్రి ఎరియాడ్నీ రహస్యంగా చెఱసాలలో వున్న థీసియస్‌ను కలుసుకుంది. తాను ఎవరో అతనికి తెలియబరచి అతన్ని పారిపొమ్మని ప్రాధేయపడింది.

థీసియస్ ఆమెను చూచి, "ఓ రాజకన్యా! నీకు నేను కృతజ్ఞుణ్ణి. కాని నా పూనికమాత్రం విడువలేను" అని స్పష్టంగా చెప్పాడు.

రాజపుత్రిక గుప్తంగా వుంచుకొన్న ఒక ఖడ్గాన్ని, ఒక దారపుకండెను యిచ్చి "ఓ రాజకుమారా! ఈ ఖడ్గంలో దివ్యమైన మహిమ వుంది. దీనితో రాక్షసుని వధించగలవు. కానీ గుహనుండి తిరిగి రావడం అసాధ్యమైన పని. అది చిక్కు త్రోవలతో నిండివుంది. కాబట్టి యీ దారపుకండెను నీవద్ద వుంచుకో. నీ నిశ్చయం నెరవేరిన తర్వాత మాత్రం నన్ను కరుణించి ఏలుకో!" అని పలికి దారపుకండెను ఉపయోగించే విధాన్ని తెలిపింది. ఎరియాడ్నీ తనపట్ల చూపిన ప్రేమకు సంతోషిస్తూ థీసియస్ ఆమె కోరిక నెరవేరుస్తానని వాగ్దానం చేశాడు.

మరునాడు సాయంకాలం రాజభటులు థీసియస్‌ను గుహలో త్రోశారు. గుహద్వారం దగ్గర వున్న ఒకరాతికి దారపుకొనను కట్టి ఎడమచేతితో కండె విప్పుకుంటూ కుడిచేతిలో కత్తిపట్టుకుని ఆ వీరుడు గుహచొచ్చాడు. గుహ చీకటితో నిండి రాత్రిమయమై ఇరుకుగా వుంది. థీసియస్ పోయి పోయి ఎదురుగా ఒకచిన్నకొండలా కూర్చొనివున్న రాక్షసునిచూచాడు. మనుష్యుని దేహంతో, యెద్దు ముఖంతో, సింహం కోరలతో, నల్లనిరంగుతో, ఎర్రని కండ్లతో చాలా భీకరంగా వున్నాడు వాడు. థీసియస్‌ను చూడగానే పెడబొబ్బలు పెడుతూ లేచి మీదికి దూకాడు. థీసియస్ వెనకాడకుండా సింహకిశోరంలా వాడిమీదికి ఉరికాడు.

ఇద్దరికీ ఘోరయుద్ధం జరిగింది. రాక్షసుడి బొబ్బలకు కొండగుహ దద్దరిల్లింది. చివరికి థీసియస్ తన కత్తితో వాడితల నరికేశాడు. దారంవెంబడేనడిచిదుర్గమంగావున్న గుహనుదాటి వెలుపలికి వచ్చాడు.

ఎరియాడ్నీ కన్య అక్కడ ఆత్రుతగా అతనికోసం ఎదురు చూస్తోంది. ఆమె థీసియస్‌ను చూడగానే సంతోషంతో వచ్చి అతనిచేయి పట్టుకుంది. వాళ్ళిద్దరూ చెఱసాలవద్దకు వెళ్ళి తక్కిన సుంకం మనుష్యులను వెంటబెట్టుకొని సముద్రతీరాన్ని చేరారు. అందరూ నావనెక్కి లంగరెత్తారు. ★

సినిమా

వార్తలు



మద్రాసులో జరుగుతున్న టాకీ రజతోత్సవాలసందర్భంలో, దక్షిణ భారత చలన చిత్రకళాకారుల సంఘంవారు జనవరి 13 ఉదయాన, మొట్టమొదటి తెలుగు, మలయాళ టాకీలలో పాల్గొన్న నటీనటులను, దర్శకులను సన్మానించారు. విక్టోరియా పబ్లిక్ హాల్‌లో జరిగిన ఈ సభకు రామనాడ్ రాజా శ్రీ ఎస్. ఆర్. సేతుపతి అధ్యక్షతవహించి రజతోత్సవ ఫలకాలనూ, సన్మానపత్రాలనూ కళాకారులకు బహూకరించారు. తొలి తెలుగుటాకీ భక్త ప్రహ్లాదలో నటించి శ్రీమతి సురభికమలను; ఆమెను అభినందిస్తున్న నేటి నటి రాజసులోచనను ఈ చిత్రంలో చూడ వచ్చు.

భారతీయ శబ్దచిత్ర రజతోత్సవాలు మద్రాసులో జనవరి 12 న ప్రారంభమయ్యాయి. తిరువాన్కూరు మహారాణి సేతు పార్వతీబాయి ఆరోజు ఉదయం 9 గంటలకు మిడ్‌లాండ్ థియేటర్‌లో ప్రారంభోత్సవం జరిపారు. దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమకు పితామహతుల్యులు అయిన పెద్దలు, నేటి ప్రముఖ దర్శకనిర్మాతలూ నటీనటులూ పలువురు వచ్చారు.

శ్రీమతి టంగుటూరి సూర్యకుమారి ప్రార్థన గీతంతో సభ ప్రారంభం అయింది.

ఉత్సవాల నిర్వహణకు ఆధ్వర్యం వహించిన దక్షిణ భారతఫిలిం వాణిజ్యమండలి తరఫున మండలి అధ్యక్షుడు శ్రీ టి. ఆర్. సుందరం స్వాగతం చెప్పారు.

ఉత్సవాలు జయప్రదంగా సాగాలని ఆకాంక్షిస్తూ డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్, శ్రీ సి. ఎం. త్రివేడి, డా॥ పట్టాభి సీతారామయ్య, శ్రీ కె.యం. మున్షి, డా॥ బూర్గుల రామకృష్ణారావు ప్రభృతులు పంపిన సందేశాలను సంఘకార్యదర్శి శ్రీ డి. రామానుజం చదివారు. సభ అనంతరం, పోతన, సారంగధర మొదలగు తెలుగు చిత్రాలనుండి, కొన్ని తమిళ చిత్రాలనుండి ఏరిన కొన్ని భాగాలను ప్రదర్శించారు.

తిరువాన్కూరు మహారాణి మాట్లాడుతూ ప్రజాబాహుళ్యంపై బలవత్తర ప్రభావం గల సాధనాలుగా రూపొందిన చలన చిత్రాల శక్తిని, అవధిని దుర్వినియోగం కానీయరాదనీ, వినోదంతోపాటు విజ్ఞానం కూడా అందచేయడానికి చలనచిత్ర కళాకారులు కృషిచేయాలనీ అన్నారు. ప్రాచీనభారతీయ సంస్కృతిని ప్రతిబింబింప చేయాలనీ, తద్వారా ఈ చిత్రాలు వివిధప్రాంతాల ప్రజలలో సమైక్యతాభావాన్ని వ్యాపింపచేయగలవనీ అన్నారు. ఈ పరిశ్రమ ఇంతటి స్థాయిని అందుకొనడానికి, చిరకాలంక్రితం ఈ పని



తొలి తెలుగు టాకీ దర్శకుడు శ్రీ హెచ్. ఎం. రెడ్డి ఆయనకు రజతోత్సవ ఫలకాన్ని ఇచ్చి గౌరవిస్తున్న రాజా సేతుపతి.

శ్రమలో కష్టాలను ఎదుర్కొని మార్గదర్శకులైన పెద్దల ఉత్తమాదర్శాలను నేటివారు మననంచేసుకొని, వాటిని ముమ్ముందుకూడా నిలబెట్టడానికీ, సత్సంప్రదాయాలు నెలకొల్పడానికీ కృషిచేయాలని ఆమె అన్నారు.

శ్రీ టి. ఆర్. సుందరం మాట్లాడుతూ, ఈ పరిశ్రమ చరిత్రను ఒక్కసారి పరిశీలించి, సాధించిన అభివృద్ధిని సమీక్షించి, ఇకనుండి అనుసరించతగు పద్ధతులను ఆలోచించుకోవడానికి ఈ ఉత్సవాలు దోహదం చేయగలవన్నారు.

పరిశ్రమప్రతినిధిగా ఈయనచెప్పినమాటల దృష్ట్యా, చలనచిత్ర నిర్మాతలు, దర్శకులు, ఎగ్జిబిటర్లూ, డిస్ట్రిబ్యూటర్లూ, ఉన్న చిత్రాల పొడుగును, దాని ఖర్చునూ పరిశీలించి, ఇది పాతికేళ్ళ వరవడి అని గమనించి ఇకనైనా చిత్రాలనిడివి తగ్గించి స్థాయిని పెంచడానికి మార్గాలు ఆలోచించడం వాంఛనీయం.

పొడుగుతోపాటు ఖర్చు తగ్గినపుడు, కొత్తతరహా ప్రయత్నాలు చేయడం, చిత్రాలను కొత్త పద్ధతులలో తీర్చిదిద్దడం ఈనాడంత ప్రమాదభరితంగా వుండదు.

అపుడు చిన్న చిన్నచిత్రాల నిర్మాణానికి కూడా ఇతోధికంగా ప్రయత్నించడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. ప్రపంచదేశాలలో మనం అగ్రశ్రేణి స్థానం సంపాదించడానికీ, ప్రపంచ విపణులలో ప్రముఖస్థానం సాధించడానికీ కూడా అవకాశం ఏర్పడుతుంది. సత్ఫలితాలు సుసాధ్యాలూ, సులభసాధ్యాలూ అవుతాయి. ★



రాజ్‌కమల్ వారి కొత్తచిత్రం "దో ఆంఖే బారా హాథ్" లో నాట్యతార సంధ్య.



మోడర్న్ థియేటర్స్ వారి "వీరకంకణం"లో జగ్గయ్య, గుమ్మడి.

బొంబాయి సినిమా లేఖ

జనవరి 11 నుంచి వారంరోజులపాటు రష్యన్ చలనచిత్రోత్సవాలు ఇక్కడ జరిగాయి.

ఈ సందర్భంలో ఉత్తమమైన రష్యన్ చిత్రాలను ఇక్కడి కాపిటల్ థియేటర్‌లో విడుదలచేస్తున్నారు. ఇదేమంత ఘనమైన విషయంకాదు. ఎందుకంటే, ఈ థియేటరు ఇక్కడివాటిలో ఏమంత ఘనమైనదికాదు. ఉన్నవాటిలో ఉత్తమ ప్రదర్శనశాలను ఈ ఉత్సవాలకు కేటాయించచేయటానికి భారత ఫిలింస్ డివిజన్ అధికారులు కృషిచేయలేదో, చేసి విఫలురయ్యారో, తెలియదుగాని, మొత్తంమీద ఫలితం ఇది. అలాగే కొంత అసంతృప్తి కలిగించే మరో విషయం అతిథి సత్కారం. వచ్చిన రష్యన్ ప్రతినిధి వర్గానికి విందులుచేసే వ్యవహారంలో కేంద్రప్రభుత్వ ప్రతినిధులుగాని, రాష్ట్రీయ ప్రభుత్వాధికారులుగాని ఏమంత సరదా పడలేదు. ఇక్కడ ఫిలింప్రముఖులు చందాలు వేసుకొని ఈ అతిథి సత్కార వ్యవహారాలు నిర్వహించారు.



మనదేశంలో జరిగిన రష్యన్ చలనచిత్రోత్సవంలో పాల్గొన వచ్చిన రష్యాసాంస్కృతిక ప్రతినిధివర్గంలో నటి క్లారా లూచ్కో.


మనదేశం వచ్చిన రష్యన్ సాంస్కృతిక ప్రతినిధి వర్గానికి ఇగరాక్ రామాన్ నాయకుడు. ఈయన ఛాయాగ్రహణకళలో దిట్టగా పేరుగడించుకున్నవాడు. బృందంలోని సభ్యులు : నికొలాయ్ క్రియువ్‌లావ్, సెర్గీ స్టోలియారావ్, మిస్ లియూడ్మిలా కాసాట్కినా, మిస్ క్లారా లూచ్‌కో, మిస్ ఓల్గా జాకోల్కినా, సెర్గీ యుట్కెవిచ్.

ఈ ఉత్సవాలలో ప్రదర్శించబడే రష్యన్ చిత్రాలు: ఒథెల్లో, ట్వెల్ఫ్త్ నైట్, ది రుమ్యాన్‌త్సెవ్ కేస్, టూ కెప్టెన్స్, రోడ్ టు లైఫ్, సాల్తసాత్.

ఈ సందర్భములో అతిథులకు చూపించే భారతీయచిత్రాలు శ్రీ 420, వారిస్, మీర్జాగాలిబ్, బిరాజ్ బహు మొదలైనవి.

నసీమ్ పునరాగమనం

మినర్వా మువీటోన్ అధిపతి సొహ్రాబ్ మోడీ, బ్రహ్మాండంగా నిర్మింపదలచిన చిత్రం "నౌ షెర్వాన్"కు జనవరి 6న ప్రారంభోత్సవం జరిగింది. ధర్మపరిపాలనా నిరతుడైన ఒక చక్రవర్తికథ దీనికి ఇతివృత్తం. కథాస్థలం



మాస్కోలో ఇటీవల ఎస్తోనియా కళాప్రదర్శనోత్సవాలు పదిరోజులు జరిగాయి. ఎస్తోనియా ఆపెరా, బాలే థియేటర్‌వారు ప్రదర్శించిన నృత్య నాటిక 'తైనా'లో ఒక సన్నివేశం. నాయిక తైనాగా హెల్మిపుయ్యూర్ నటించింది.

ప్రసిద్ధికెక్కిన్న ఫ్యాబిస్టు చిత్రకారుడు పికాసో ఒకరోజున స్టూడియోలో ఏదో బొమ్మ వేస్తున్నాడు. చేతుల్లో రంగులు. కుంచెలు పట్టుకుని. చాలా ఆందోళనగా కాన్వాస్‌కేసి చూస్తున్నాడు. కాన్వాస్‌మీద కొన్ని కోణాలు, చతురస్రాలు, నిలువుగీతలు, అడ్డగీతలు ఉన్నాయి. ఇంతలో ఒక స్నేహితుడువచ్చి "ఏదో బొమ్మ వేస్తున్నట్లున్నారే?" అన్నాడు.

"అవును ఒక అమ్మాయి బొమ్మ వేస్తున్నాను" అన్నాడు పికాసో.

"మరెందుకంత విచారంగా ఉన్నారు?

"ఏంలేదు; అంతాబాగానే ఉంది. అమ్మాయి ముక్కు సరిగ్గా రావటం లేదు; దాన్ని మార్చాలనుకుంటున్నాను" పికాసో అన్నాడు.

"దాని కాలోచనెందుకు మార్చండి" అన్నాడు స్నేహితుడు.

"అదెక్కడుందో కనిపిస్తేగా?" అని పికాసో జవాబిచ్చాడు.

ప్రాచీన పర్షియా (ఇరాన్) దేశం. చక్రవర్తి భూమికను సొహ్రాబ్ మోడీయే నిర్వహిస్తున్నారు. ఒక సామాన్య యువతిని ప్రేమించి, తండ్రికి సమస్య అయిన యువరాజుగా చంద్రశేఖర్, నటిస్తున్నాడు.

ఈ చిత్రనిర్మాణ వార్తలో విశేషం వటి నసీం పునరాగమనం. చలనచిత్రాల నుండి విరమించుకోవాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకొని, ఇపుడీమె ఈ చిత్రంలో ముఖ్యభూమిక నిర్వహిస్తోంది. ఈ చిత్రంలో ఇతర ప్రముఖనటులు బిపిన్ గుప్త, ముబారక్, నిరంజనశర్మ, మురాద్.

1939 లో "పుకార్" చిత్రం నిర్మించి, తొలిసారిగా మొగలాయీచక్రవర్తుల వైభవాన్ని తాను వెండితెరకు ఎక్కించడం జరిగిందని, ఇప్పుడు, ఈ చిత్రంద్వారా పురాతన పర్షియా విభవాన్ని ఇందులో ప్రతిబింబింపచేయాలని సంకల్పించానని సొహ్రాబ్ మోడీ చెప్పారు. ఇందులో కొంత భాగాన్ని ఇరాన్‌లోనే 'షూట్' చేయ దలచినట్లు ఆయన తెలియచేశారు.

* * *

నిర్మాణం పూర్తికావస్తున్న భారీ చిత్రాలలో రాజ్ కమల్ వారి "దో ఆంఖేఁ బారా హాత్" ఒకటి. ఇది ఒక జైలర్ కథ, [illegible] ఖైదీలకు సంబంధించినకథ. ఒక వాస్తవ సంఘటనను ఆధారంచేసుకొని శాంతారాం ఈ చిత్రం రూపొందిస్తున్నారు. ఇందులో జైలర్ భూమికను ఆయనే నిర్వహిస్తున్నారు.

దొంగలుగా ఉల్హాస్, బి. ఎం. వ్యాస్ మొదలగువారు నటిస్తున్నారు. సంధ్య ముఖ్యస్త్రీ భూమిక నిర్వహిస్తోంది. ★

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి ప్రతినిధి)



"ఏక్ ఫూల్"లో వైజయంతిమాల, ప్రదీప్ కుమార్.



భాస్కర్ ప్రొడక్షన్స్‌వారి "రేపు నీదే"లో ఆర్. నాగేశ్వరరావు, జానకి.

★ సినిమా వార్తలు ★

కొత్త సంవత్సరం ప్రవేశానికి, సంక్రాంతి పైచిలుకు తెలుగు చిత్రాల నిర్మాణం సాగుతోంది. గత సంవత్సరంకూడా పరిశ్రమ ఇంతటి స్థాయిలోను ఇంత ఉత్సాహభరితంగానూ ఉంది. నవయువకులు ఎందరో పరిశ్రమలో ప్రవేశిస్తున్నారు. కొన్నాళ్ళనాడు కొత్తగా నెలకొన్న సంస్థలు ఈనాడు నిలద్రొక్కుకొని, స్థిమితపడి పదికాలాలు నిలిచి పది చిత్రాలు తీసే స్తోమత సంపాదించుకుంటున్నాయి. బాక్సాఫీస్ సూత్రాలు మటుకు యథాప్రకారం చెక్కుచెదరకుండా పదిలంగా ఉన్నాయి. కొందరవి కూడనివని నిరసించి మరీ శిరసావహిస్తున్నారు. తదన్యులు అనకుండా మామూలుగా వాటిని గౌరవిస్తున్నారు.

'మాయాబజార్'

విజయవారి చిత్రం. దర్శకుడు కె. వి. రెడ్డి. నాగేశ్వరరావు, రామారావు, రంగారావు, సావిత్రి ప్రభృతులు పాల్గొంటున్నారు. రచన: పింగళి నాగేంద్రరావు. సంగీతం: ఘంటసాల. ఇది మార్చిలో విడుదల కావచ్చు.

భాగ్యరేఖ

వాహినీపేరిట పొన్నలూరి బ్రదర్స్ నిర్మిస్తున్న చిత్రం. రూపురేఖలు తీర్చిదిద్దుతున్నవారు బి. యన్. రెడ్డి. జమున, రామారావు నటిస్తున్నారు. మాటలు పాలగుమ్మి పద్మరాజు, పాటలు కృష్ణశాస్త్రి.

వద్దంటే పెళ్లి

విఠల్ ప్రొడక్షన్స్ వారి తొలి చిత్రం. దర్శకుడు విఠలాచార్య. చలం, సి.ఎస్.ఆర్. కృష్ణకుమారి నటిస్తున్నారు.

కాత్తవరాయుడి కథ

ఆర్. ఆర్. పిక్చర్స్. దర్శకుడు రామన్న. నటీనటులు రామారావు, బి. యస్. సరోజ, ముక్కామల. రచన ముద్దిపట్లనూరి.

నందీవారి చిత్రత్రయం

"మోహినీ రుక్మాంగద" దర్శకుడు జంపన. రీటా, నాగయ్య నటిస్తున్నారు.

'సౌభాగ్యవతి.' దర్శకుడు జంపన. సావిత్రి, ఎన్. టి. రామారావు, ముక్కామల పాల్గొంటున్నారు.

'కృష్ణగారడి' దర్శకుడు వై. వి. రావు. జగ్గయ్య ముఖ్యభూమిక నిర్వహిస్తున్నాడు.

వరుడు కావలెను

భరణివారి హాస్యచిత్రం. దర్శకుడు రామకృష్ణ. రచన రావూరు సత్యనారాయణ. భానుమతి, జగ్గయ్య, అమర్‌నాథ్ నటిస్తున్నారు.

నలదమయంతి

కెంపరాజ్ ప్రొడక్షన్స్. దర్శకుడు కెంపరాజ్. భానుమతి, కెంపరాజ్, నాగయ్య ముఖ్యభూమికలు నిర్వహిస్తున్నారు.

సినిమా వార్తలు

అల్లా ఉద్దీన్

జైశక్తి ప్రొడక్షన్స్ వారి చిత్రం "అల్లావుద్దీన్ అద్భుత దీపం". దర్శకుడు టి. ఆర్. రఘునాథ్. నాగేశ్వరరావు, అంజలి, ఇంద్రజాలిగా ఎస్. వి. రంగారావు నటిస్తున్నారు.

ఆడ పెత్తనం

ప్రభ ప్రొడక్షన్స్. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు. అంజలి, నాగేశ్వరరావు, గుమ్మడి, రమణారెడ్డి నటిస్తున్నారు. రచన పినిశెట్టి శ్రీరామమూర్తి.

వినాయకచవితి

అశ్వరాజ్ ప్రొడక్షన్స్. దర్శకుడు,రచయిత సముద్రాల రాఘవాచార్య. జమున, రామారావు నటిస్తున్నారు.

రాజనందిని

జలరుహా ప్రొడక్షన్స్. దర్శకుడు వేదాంతం రాఘవయ్య. అంజలి, రామారావు పాల్గొంటున్నారు. రచన మల్లాది రామకృష్ణశాస్త్రి.

అక్క చెల్లెళ్లు

కళ్యాణీపిక్చర్స్‌వారి చిత్రం. దర్శకత్వం సార్వభౌమ, అమానుల్లా నిర్వహిస్తున్నారు. కృష్ణకుమారి, శ్రీరంజని అమర్‌నాథ్ నటీనటులు.

పెద్దరికాలు

సారథీవారి కొత్త సాంఘికచిత్రం. దర్శకుడు తాపీ చాణక్య. అంజలి, జగ్గయ్య, డా॥ గోవిందరాజుల సుబ్బారావు పాల్గొంటున్నారు. మాటలు : నార్ల చిరంజీవి.

సువర్ణ సుందరి

అంజలీ పిక్చర్స్‌వారి జానపదం. దర్శకత్వం వేదాంతం రాఘవయ్య. అంజలి, నాగేశ్వరరావు ముఖ్యభూమికలు నిర్వహిస్తున్నారు.

బలే బావ

భరణీ(?) ఫిలింస్ వారి హాస్యచిత్రం. దర్శకుడు పట్నపీస్ రజనీకాంత్. జానకి, జగ్గయ్య, గిరిజ నటిస్తున్నారు.

భలే అమ్మాయిలు

వరలక్ష్మీ పిక్చర్స్‌వారి చిత్రం. "భలే రాముడు"లో అమ్మాయిలు సావిత్రి గిరిజా ఇందులో భలే అమ్మాయిలు. అబ్బాయి పేరు జగ్గయ్య. దర్శకత్వం వేదాంతం రాఘవయ్య.

రేపు నీదే

భాస్కర్ ప్రొడక్షన్స్‌వారి మూడవ చిత్రం నిర్మాత దర్శకుడు భాస్కరరావు. జగ్గయ్య రంగారావు, ఆర్. నాగేశ్వరరావు రాజనాల, జానకి నటిస్తున్నారు. రచన కొండముది, సంగీతం ఘంటసాల.

భక్త రామదాసు

వి. ఎస్. ఫిలింస్‌వారి చిత్రం. దర్శకుడు నాగయ్య. ఇందులో నాగయ్య, కన్నాంబ, లింగమూర్తి, ఎ. వి. సుబ్బారావు, ఋష్యేంద్రమణి నటిస్తున్నారు. రచన యడవల్లి లక్ష్మీనారాయణ. పర్యవేక్షణ సముద్రాల.

భట్టి విక్రమార్క

నిర్మాత పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణమూర్తి. ఛాయాగ్రహణం దర్శకత్వం వి. ఎస్. రెడ్డి. అంజలి, రామారావు, రంగారావు పాల్గొంటున్నారు.

సంకల్పం

సాధనా (సంసారం, సంతానం) వారి చిత్రం. దర్శకుడు రంగనాథదాస్, రామారావు, కుసుమకుమారి నటిస్తున్నారు.

రామాంజనేయ యుద్ధం

కాశీనాథ్ ప్రొడక్షన్స్. దర్శకుడు ఎస్. ఎస్.ఆచార్య. గౌరీనాథశాస్త్రి, అమర్‌నాథ్ నటిస్తున్నారు.

సారంగధర

మినర్వా ప్రొడక్షన్స్. దర్శకుడు వి. ఎస్. రాఘవన్. భానుమతి, రామారావు, రంగారావు పాల్గొంటున్నారు.

పాండురంగ మహాత్మ్యం

నేషనల్ ఆర్ట్ థియేటర్స్. దర్శకుడు కమలాకర కామేశ్వరరావు. అంజలి, రామారావు, శివరావు నటిస్తున్నారు.

స్వయంప్రభ

సిల్వర్‌కోటి పిక్చర్స్‌వారి చిత్రం. దర్శకుడు శోభనాద్రిరావు. పర్యవేక్షణ యోగానంద్. శ్రీరంజని, అమర్‌నాథ్, రాజసులోచన, ఆర్. నాగేశ్వరరావు పాల్గొంటున్నారు. సంగీతదర్శకుడు రమేష్‌నాయుడు.

బభ్రువాహన

భారతీ ప్రొడక్షన్స్. దర్శకుడు సముద్రాల రాఘవాచార్య. అంజలి, రామారావు నటిస్తున్నారు.

వీరకంకణం

మాడర్న్ థియేటర్స్‌వారి చిత్రం. దర్శకుడు టి. ఆర్. సుందరం. జమున, జగ్గయ్య నటిస్తున్నారు.

వీరి తమిళ చిత్రం "మహేశ్వరి"ని 'రాణీ రంగమ్మ' పేరిట తెలుగులోకి తర్జుమా చేస్తున్నారు. దర్శకుడు టి. ఆర్. సుందరం. సావిత్రి ముఖ్యభూమిక నిర్వహించింది.

దొంగలున్నారు జాగ్రత్త

ప్రతిభావారి కొత్తచిత్రం. దర్శకుడు వి. ఎస్. ఆర్. జగ్గయ్య, గిరిజ నటిస్తున్నారు. రచన ఆత్రేయ.

కృష్ణలీలలు

రాజ్యం పిక్చర్స్‌వారి చిత్రం. దర్శకుడు సి. పుల్లయ్య.

ఎ. వి. ఎం. వారు "భూకైలాస్" అనే చిత్రం నిర్మిస్తున్నారు. దర్శకుడు చిత్రపు నారాయణమూర్తి. నాగేశ్వరరావు, రామారావు, జమున పాల్గొంటున్నారు.

ఎం. హెచ్. ఎం. మూనాస్ "శోభ సుందరి" అనే చిత్రాన్ని ఐదు రంగులలో ఏడెనిమిది భాషలలో నిర్మిస్తున్నారు. తెలుగు చిత్రంలో కాంతారావు ముఖ్యభూమిక నిర్వహిస్తున్నాడు. రచన శ్రీ శ్రీ.

అరుణా ఫిలింస్ వారు "బొమ్మల పెళ్ళి" అనే చిత్రం నిర్మిస్తున్నారు. జమున, రంగారావు నటిస్తున్నారు.

ఇది కాక నామకరణం జరగని చిత్రాలు: రిపబ్లిక్ (తాడేపల్లి సీతారాం)పిక్చర్స్‌వారి తొలిచిత్రం.దర్శకుడు యోగానంద్. నాగేశ్వరరావు, అంజలి నటిస్తున్నారు.

జయశ్రీవారి తొలిచిత్రం. దర్శకుడు పి. పుల్లయ్య, నాగేశ్వరరావు, అంజలి, నటీనటులు.

★

★ బుడుగు! చిచ్చుల పిడుగు! ★

(7-వ పేజీ తరువాయి)

తెగిపళ్ళు వద్దంటే, మొట్టికాయలు ఇచ్చి తీసుకోవచ్చులే.

ఏం? నాన్నా నేనూ యిన్ని అణాలూ కాణీలూ పట్టికెళ్ళి, నాన్న దగ్గిర అణాలు విసినాథానికి ఇచ్చి, నావి దాచుకున్నాం.

విసినాథం పలకలిచ్చాడు.

నాన్న గట్టివేనా అన్నాడు.

గుండేసి పేల్చినా, పగలవని విసినాథం చెప్పాడు.

అప్పుడు నేను యిలా నేలమీద వేసి కాలితో పేల్చానా ఇట్టే పప్పు పప్పు అయిపోయాయి.

చూశావా ఎలా అబద్ధం చెప్పాడో. అందికే వాడికి మూడు ఆడపిల్లలు.

అబద్ధాలు చెప్తే ఆడపిల్లలు పుట్టార్ట. నీకు తెలుసా? నాకు తెలుసుటలే.

నిజం చెప్తే మొగపిల్లలు పుట్టార్ట.

చాలా ఎక్కువ నిజం చెప్తే నాలాంటి పెంకి భడవలు పుట్టార్ట. ఇలా అని నాన్న చెప్పేడు.

పుట్టార్టడం అంటే, మనం ఎక్కడో దొరకడం అన్నమాట. అంటే దేవుడు మన్ని తెచ్చి మా యింటో పడేస్తాడు. అపుడు అమ్మా నాన్నా కొంచెం రోజులు పెంచుతారు. తరవాత పెంకిభడవ కానా బడుద్దాయీ అంటారు. అప్పుడు గబుక్కుని అప్పరాభాసం చేసి బళ్లో పెట్టేస్తారు.

బడుద్ధాయీ అనడం తప్పు. బుడుద్ధాయి అనాలి. నాపేరు బుడుగుకదా అందుకు'

కాని, బళ్ళో చవిటి మేష్టరుకి యిలా అని తెలియదు. నన్ను ముందస్తుగా బడుగూ బంగారు తండ్రీ అన్నాడు.

కాదూ, బుడుగూ బంగారు తండ్రీ అని చెప్పానా.

అలా చెప్తే మేష్టరుకి కోపంవచ్చి ఇలా చెవిమెలిపెట్టేశాడు. బడుగూ బడుద్ధాయీ అన్నాడు.

అప్పుడు నాకు కోపం వచ్చేసింది. బాణం తీసి కొట్టేస్తాను అని చెప్పాను. మేష్టరు హడిలిపోయాడులే. బుడుగు మంచివాడూ అనూ అన్నాను.

అప్పుడు మేష్టరు బుడుగు మంచివాడూ అని మూడుసార్లు అన్నాడు.

అప్పుడు భయపడ్డాడు, తరవాత నాన్నతో వెళ్ళి చెప్పుకున్నాడు.

అప్పుడు నాన్న నాకు ప్రైవేటు చెప్పేవాడు.

కాని మేష్టరికి నేనంటే బయమే.

బయం అంటే, మన్ని అస్తమానూ కొట్టడం.

అలా కొట్టకపోతే మనం అల్లరిచేస్తామని భయం. అదీ సంగతి.

మేష్టరేమిటిలే. బళ్లో పెంకిపిల్లలికి కూడా నేనంటే భయమే. నేనొస్తే చాలు పలకపుల్లలూ, గోలీకాయలూ అన్నీ దాచేసుకుంటారు. అస్సలు అల్లరి చెయ్యరు.

నాతో "గుడుగుడు గుంచం గుండారాగం పాములపట్టం పడగారాగం కత్తేనా బద్దేనా వేణ్నీళ్ళ చన్నీళ్ళ" ఆట ఆడడానికిగూడ రారు. ఆడితే ఠక్ ఠక్‌మని కొట్టేస్తానుగా అందుకని. యిలా బయపడిపడి ఓపదిమంది బడి మానేశారు. అప్పుడు మూడ్రోలో పదిరోలో పోయాక, నన్ను బడికి వెళ్ళద్దన్నాడు నాన్న. మేష్టరుకూడా ఇప్పుడప్పుడే రావద్దు అన్నాడు. నేనే మీ యింటికి వస్తాను అన్నాడు. (ఇంకా వుంది)

సహజీవనమా?...

(8-వ పేజీ తరువాయి)

విభేదాలుండేవి. ముస్లిములకూ, క్రైస్తవులకూ అలాంటి విభేదాలే ఉండేవి. ఒక మతవర్గం మరొక మతవర్గాన్ని, దాని మనుగడను సహించలేనంత తీవ్రంగా ఈ విభేదాలుండేవి. ఒకరినొకరు రూపుమాపివేయడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. కాని ఈ ప్రయత్నాలన్నీ విఫలమైనాయి. కాథలిక్కులు ప్రొటెస్టెంటులనూ, ప్రొటెస్టెంట్లు కాథలిక్కులనూ రూపుమాపడం అసాధ్యమని గ్రహించారు. అలాగే ముస్లిములూ, క్రైస్తవులూ కూడా పరస్పరం రూపుమాపడం అసాధ్యమని గ్రహించారు. అందుచేత ఈనాడు ప్రొటెస్టెంటులూ, కాథలిక్కులూ, క్రైస్తవులూ, ముస్లిములూ ఒకే దేశంలో, ఒకే పట్టణంలో; ఒకే వీధిలో ప్రక్క ప్రక్కన కలిసి మెలిసి నివసిస్తున్నారు. వారి వారి మత వైరుద్ధ్యాలు ఇంకా అలాగే ఉన్నాయి. అయినా వారు కలిసి మెలిసి జీవించక తప్పలేదు. విరుద్ధ మతాల మధ్య సమన్వయం కుదరకపోయినా సహజీవనం తప్పలేదు.

ఇదేవిధంగా ఈనాడు సమన్వయించరాని పెట్టుబడిదారీ, కమ్యూనిస్టు వ్యవస్థలు కూడా పరస్పరం నిర్మూలించుకోవడం అసాధ్యమని గ్రహిస్తే ప్రపంచయుద్ధం నివార్యం కావచ్చును. సహజీవనం సిద్ధించవచ్చును. పైగా అణ్వస్త్రాలను కనిపెట్టడం మూలంగా యుద్ధాల స్వభావం మారిపోయింది. పూర్వపు యుద్ధాలలో సైనికుడు తన కుటుంబాన్నో, దేశాన్నో, మతాన్నో రక్షించాలనే ఆవేశంతో యుద్ధంలోకి ఉరికేవాడు. తన పక్షం గెలవాలని యుద్ధం చేసేవాడు. ఇప్పుడు అణ్వస్త్రాలమూలంగా, యుద్ధంలో ఒకదేశం రక్షించబడడం, మరొకటి ధ్వంసం కావడం అంటూ ఉండదు. ఒక పక్షం గెలవడం మరొకటి ఓడిపోవడం అంటూ జరగదు. సర్వనాశనమొకటే ఫలితం. అందుచేత యుద్ధం చేయడానికి తగిన ప్రోద్బలం, కారణం ఈనాడు లేవు. ఇది గ్రహిస్తే ప్రపంచయుద్ధం నివార్యమవుతుంది.

ప్రొ॥ టాయిన్‌బీ ప్రసంగాంశాలన్నిటితోనూ అందరూ ఏకీభవించినా, ఏకీభవించలేకపోయినా, ఆయన ప్రసంగాలు ఆలోచనను రేకెత్తించేవిగా ఉన్నాయనడంలో సందేహం లేదు. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.